RNI NO:TELTEL/2017/74161 www.janavijayam.com

# జన విజయం
# JANA VIJAYAM

ఖమ్మం | సంపుటి : 9 | సంచిక : 17 | 25 - 31 జనవరి, 2026 | ఎడిటర్ : పల్లా కొండల రావు | పేజీలు : 8 | వెల : రూ. 15.00

KHAMMAM | Volume : 9 | Issue No : 17 | 25 - 31 January, 2026 | EDITOR : PALLA KONDALA RAO | PAGES : 8 | RS : 15.00

మీరు జర్నలిస్టుగా పని చేస్తారా?

రెండు తెలుగు రాష్ట్రాల నుండి జనవిజయం వారపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్, నియోజకవర్గం ఇన్‌చార్జ్, మండల రిపోర్టర్‌లు కావలెను.

సంఘటనను వార్తగా మలచే తెలుగు భాషా ప్రావీణ్యం ఉంటే చాలు.

18సం. పైన వయసు కలిగియుండి జర్నలిజం పట్ల ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.

మీ వివరాలను పంపించాల్సిన చిరునామా:

వాట్సాప్ నెంబర్ : 9866925937

మెయిల్ ఐ.డి : janavijayam@gmail.com



## గణతంత్ర వేడుకల్లో..
# తెలంగాణ ప్రత్యేకత

**న్యూఢిల్లీ, జనవరి24 :** దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఏడాది జరిగే 77వ గణతంత్ర వేడుకుల్లో ఈసారి తెలంగాణ బిడ్డలు ప్రత్యేకంగా నిలవబోతున్నారు. రాష్ట్రపతి, ప్రధాని, ఇతర దేశాధిపతుల ముందు తెలంగాణకే సొంతమైన కళారూపాన్ని ప్రదర్శించనున్నారు. ఇప్పటి వరకు ఎన్నో కళారూపాలు రిపబ్లికే డేలో పాల్గొన్నా, తొలిసారి ఒగ్గుడోలు విన్యాసానికి చోటు దక్కింది. ఈ ప్రదర్శన కోసం సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ నుంచి ప్రఖ్యాత ఒగ్గు డోలు కళాకారుడు డాక్టర్ ఒగ్గు రవి బృందానికి ఆహ్వానం అందింది. దీంతో ఒగ్గు రవి నేతృత్వంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 30 మంది కళాకారులు ఈనెల 8నే ఢిల్లీకి చేరుకున్నారు.



- పరేడ్‌లో ఒగ్గుడోలు ప్రదర్శనకు అనుమతి
- ఢిల్లీ వేదికగా ప్రాక్టీస్ చేస్తున్న కళాకారులు

## భారత సంతతి వ్యక్తి కాల్పుల్లో భార్య మరో ముగ్గురు హతం...

**న్యూయార్క్, జనవరి24:** అమెరికాలో భారత సంతతికి చెందిన నలుగురు వ్యక్తులు హత్యకు గురయ్యారు. కుటుంబ తగాదాల వల్ల ఓ వ్యక్తి తన భార్యతో పాటు బంధువులను కాల్చి చంపాడు. జార్జియాలోని లారెన్స్‌విల్లే నగరంలో అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం జరిగిన ఈ ఘటనకు సంబంధించి విజయ్ కుమార్ (51)ను పోలీసులు అరెస్టు చేశారు. మీడియా కథనాల ప్రకారం.. కాల్పుల విషయం పోలీసులకు ఫోన్‌కాల్ ద్వారా సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సంఘటనా స్థలానికిచేరుకోగా.. అక్కడ నలుగురు భారత సంతతి వ్యక్తులు విగత జీవులుగా పడి ఉండటాన్ని గుర్తించారు. కుటుంబ తగాదాల వల్లే విజయ్‌కుమార్ వారిని కాల్చి చంపాడని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. మృతులను కుమార్ భార్య మీను డోగ్రా (43), బంధువులు గౌరవ్ కుమార్ (33), నిధి చందర్ (33), హరీష్ చందర్(38)గా గుర్తించారు.



## అమెరికాలో దారుణ ఘటన
## కుటుంబ తగాదాలతో..
# నరమేధం

# కాశ్మీర్‌లో మంచు దుప్పటి

**శ్రీనగర్, జనవరి24 :** జమ్మూకశ్మీర్‌లో భారీ హిమపాతం కురుస్తోంది. రెండ్రోజుల నుంచి విపరీతంగా మంచు కురుస్తుండటంతో పలు ప్రాంతాలు శ్వేతవర్ణంలోకి మారిపోయాయి. గందేర్బల్, రాజౌరీలోని ప్రాంతాలు, మాతా వైష్ణో దేవి ఆలయంపై దట్టమైన మంచు కప్పేసింది. కొన్ని ప్రాంతాల్లో మంచు అడుగుల మేర పేరుకు పోవడంతో యంత్రాల సాయంతో తొలగిస్తున్నారు. ప్రతికూల వాతావరణం కారణంగా పలు రోడ్లను మూసేశారు. కీలక ప్రాంతాల్లో రైల్వే సేవలను రద్దు చేశారు.





## అమెరికాను కుదిపేస్తున్నమంచు
# తుఫాన్

ఎమర్జెన్సీ ప్రకటించిన పలు రాష్ట్రాలు
4,800 విమాన సర్వీసులు రద్దయినట్లు వెల్లడి

**వాషింగ్టన్, జనవరి, 24 :** అమెరికాను భారీ మంచు తుపానుతాకింది. దీంతో పలు రాష్ట్రాల్లో భారీస్థాయిలో మంచు, వర్షంతో పాటు అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం టెక్సాస్, ఓక్లహోమాపై మంచు తుపాను పంజా విసురుతోంది. మంచు తుపాను కారణంగా అమెరికా లోని 20 కోట్ల మందికి పైగా ప్రజలు ప్రభావితం కానున్న ట్లు అధికారులు వెల్లడించారు. అవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఈ భీకర తుపాను కారణంగా పలు రాష్ట్రాల్లో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలిగినట్లు స్థానిక అధికారులు వెల్లడిం చారు. శనివారం నాటి 3,200 విమాన సర్వీసులు, ఆదివారం నాటి 4,800 విమాన సర్వీసులు రద్దయినట్లు సైలట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌అవేర్ వెల్లడించింది.



## చైనా మిమ్మల్ని..
# తినేస్తుంది

## కెనడాకు ట్రంప్ హెచ్చరిక

**దావోస్,జనవరి, 24 :** అమెరికా, కెనడా మధ్య సంబంధాలు మరింత ఉద్రిక్తంగామారాయి. కెనడానుఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రవ్యాఖ్యలు చేశారు. చైనాతో వ్యాపారం కోసం అమెరికా భద్రతా ప్రయోజనాలను కెనడా పక్కనపె డుతోందని ఆరోపిస్తూ.. ఏడాదిలోపే చైనా వారిని తినేస్తుంది! అని తన ట్రూత్ సోషల్ మీడియా ఖాతాలో ఘాటుగా హెచ్చరించారు. గ్రీన్‌లాండ్‌పై అమెరికా ప్రతిపాదించిన.. గోల్డెన్ డోమ్.. క్షిపణి రక్షణ వ్యవస్థను కెనడా వ్యతిరేకిస్తోందని ట్రంప్ ఆరోపించారు. ఆ వ్యవస్థ కెనడాకు కూడా రక్షణ కల్పిస్తుందని, అయినా వారు చైనాతో వ్యాపారం వైపే మొగ్గు చూపుతున్నారని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. ఇటీవల స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో ఇరు దేశాధినేతల మధ్య మాటల యుద్ధం ప్రారంభమైంది. పెద్ద దేశాల ఆర్థిక ఆధిపత్యంపై కెనడా ప్రధాని మార్క్ కార్నీ చేసిన వ్యాఖ్యలకు ట్రంప్ కౌంటర్ ఇచ్చారు.



## గాలి జనార్ధన్ రెడ్డి
# ఇంటికి నిప్పు

**బళ్లారి, జనవరి, 24 :** బళ్లారి-బెళగల్లు రోడ్డులోని ఒక ప్రైవేట్ నివాస లేఅవుట్‌లో ఉన్న ఒక మోడల్ ఇంటికి నిప్పంటించారు, ఇది నగరంలో కొత్త ఉద్రిక్తతకు దారితీసింది. బళ్లారిలో బ్యానర్ సం బంధిత ఘర్షణ కొనసాగుతుండగానే తాజాగా ఈ ఘటన చోటు చేసు కున్నది.గంగావతి ఎమ్మెల్యే గాలి జనా ర్ధన్ రెడ్డి మరియు ఆయన సన్నిహితుడు బి. శ్రీరాములు యాజమాన్యం లోని జి స్క్వేర్ లేఅవుట్ లోపల నిర్మించిన మోడల్ ఇంట్లో ఈ సంఘటన జరిగింది. కొనుగోలుదారులకు లేఅవు ట్‌ను ప్రదర్శించడానికి నిర్మించిన ఆ నిర్మాణం ఆ సమయంలో ఖాళీగా ఉందని పోలీసులు తెలిపారు. మానవు లకు ఎటువంటి గాయాలు కాలేదని నివేదించబడింది.ప్రాథమిక సమాచా రం ప్రకారం, సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో మంటలు చెలరే గాయి. కొంతమంది

స్థానికులు నిర్మా ణంలో మంటలు చెలరేగడం గమనించి బాధ్యులను పట్టుకోవడానికి ప్ర యత్నించారు, కానీ అనుమానితులు పారిపోయారని వర్గాలు తెలిపాయి. ఈసంఘటనపైమాజీ ఎమ్మెల్యే, జనా ర్ధన్ రెడ్డి సోదరుడు జి. సోమ శేఖర్ రెడ్డి స్పందిస్తూ, ఈ దహనం వెనుక కాంగ్రెస్ కార్యకర్తల హస్తం ఉందని అన్నారు.





## తెలంగాణ జాగృతి
# సింహ గర్జన

**హైదరాబాద్,జనవరి 24 :** రాజకీయంగా బలపడడానికి అసవరమైన రీతిలో జాగృతి అధ్యక్షురాలు కవిత అడుగులు వేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఇందుకు అవసరమైన విధంగా పునాదులు వేయాలని చూస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక ఎన్నికల్లో నిలబడాలన్న దిశగా వ్యూహం వేస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ జాగృతి నేతలు స్థానిక సంస్థల ఎన్నికల బరిలోకి దిగనున్నారు. మున్సిపాలిటీలతో పాటు జిల్లా పరిషత్, మండలపరిషత్ ఎన్నికల్లోనూ సింహం గుర్తుతో పోటీ చేయాలని తెలంగాణ జాగృతి నాయకత్వం నిర్ణయించింది.



## మేడారం జాతరకు తరలుతున్న జనం

**ములుగు, జనవరి 24 :** ములుగు జిల్లా మేడారం జాతరకు ప్రజలు తరలి వెళుతున్నారు. గద్దెలను దర్శించుకుని, అమ్మవారికి బంగారం సమర్పించుకోవడం ఆనవాయితీ. గిరిజన జాతర అయినప్పటికీ కులమతాలకు అతీతంగా అంతా ఇక్కడి రావడం ఆనవాయితీ. తెలంగాణ జతారలో కొన్ని మాత్రమే ప్రముఖంగా కనిపిస్తాయి. సమ్మక్క సారక్క జాతర అనేది ములుగు జిల్లా తాడ్వాయి మండలానికి చెందిన మేడారంలో జరిగే ఒక గిరిజన జాతర.

ఈ జాతర తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందింది. వివిధ రాష్ట్రాల నుంచి పది కోట్ల మందికి పైగా హాజరవుతారని అంచనా. ములుగు జిల్లా కేంద్రం నుండి 44 కిలోమీటర్ల దూరంలో తాడ్వాయి మండలంలో ఉన్న మారుమూల అటవీ ప్రాంతమైన మేడారంలో దట్టమైన అడవులు, కొండ కోనల మధ్య ఈ చారిత్రాత్మకమైన జాతర ఈనెల 28-31 తేదీల మధ్య జరుగుతుంది. సమస్త గిరిజనుల సమారాధ్య దేవతలు, కష్టాలు కడతేర్చే కలియుగ దైవాలుగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకునే ఆపద్భాంధవులుగా, కేవలం తెలంగాణలోనే గాక అఖిల భారతదేశంలోనే వనదేవతలుగా పూజలందుకుంటున్నారీ సమ్మక్క-సారక్క . ఈ జాతర గిరిజన సాంప్రదాయ రీతుల్లో జరుగుతుంది



# మావోయిస్టుల లొంగుబాటు..

**గోదావరిఖని, జనవరి, 24 :** లొంగిపోయిన మావోయిస్టుకు పునరావాస పథకం.. నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఎనిమిది మంది మిలీషియా, కోరియర్, సాంస్కృతిక విభాగం, లోకల్ కమిటీ సభ్యులు రామగుండం కమిషనరేట్ పోలీసుల ఎదుట లొంగిపో యారు. శనివారం కమిషనరేట్ కార్యాలయంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ ప్రజలకు చేస్తున్నటువంటి వివిధ రకాల సహాయ సహాకారాలు, లొంగిపోయిన మావోయిస్టుల పట్ల చూపి స్తున్న ఆదరణను గురించి తెలుసుకుని లొంగిపోయారని వెల్లడించారు. తాము కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత జీవితం గడపాలని నిర్ణయించుకున్నామన్నారు. మిలీషియా, కోరియర్, సాంస్కృతిక విభాగం, లోకల్ కమిటీ మావోయిస్టులని తెలిపారు. వీరు ప్రధానంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహించారన్నారు. ధర్మాజీ శ్రీకాంత్, పొడియం కాములు, ముడియం జోగ, కుంజం లక్కె (క్ష్మ), మోదం భీమ, కుంజం ఉంగా, ముడికం సుక్రం, ముడియం మంగు లొంగిపోయారు.

తెలంగాణ మావోయిస్టులు వారి గ్రామాలకు తిరిగి రావాలి..: శ్రీకాంత్ ఒక్కడే తెలంగాణకి చెందినవాడు, మిగిలిన వాళ్ళందరూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా, గంపుర్ గ్రామం, గాంగేలురు పోలీస్ స్టేషన్ పరిధికి చెందినవారని తెలిపారు.

# ఆటబొమ్మలతో అందమైన ఇల్లు



**హైదరాబాద్, జనవరి, 24 :** చిన్న పిల్లలు ఆడుకునేందుకు అవసరం ఉన్నా లేకపోయినా రకరకాల బొమ్మలు కొనేస్తుంటాం. కొన్ని రోజులకే అవి విరిగిపోవడమో, పాడైపో వడమో జరుగుతుంది. కొంత కాలం తరువాత ఏ ఉపయోగం లేనివా టిని చెత్తబుట్టలో పడేస్తాం. అయితే కేరళకి చెందిన ఓ ఇంటివారు అలా చేయలేదు. పిల్లలు ఆడిపారేసిన రకరకాల ఆటబొమ్మలతో అందమైన ఇంటిని కట్టుకున్నారు. వృత్తాకారంలో ఎటు వెళ్లినా ఇంట్లోకి వెళ్లేలా గుమ్మాలు పెట్టుకున్నారు. వారి వ్యక్తిగత గోప్యతకి భంగం కలగకుండా మంచి పడక గది నిర్మించుకున్నారు. తమ సృజనాత్మకతని పదిమందికి తెలియజేయాలని, ఇంటిని చూసేందుకు సందర్శకులకి కూడా అనుమతి ఇచ్చారు. దీంతో ఆ ఇంటి గురించి అందరికీ తెలిసింది. పిల్లలైతే తాము ఆడుకున్న వస్తువులతో కట్టిన ఆ ఇంటిని చూసి అక్కడే ఉండిపోతున్నారంట. కేరళ వడకరలో ఈ ఇంటి నిర్మాణం ఉంది. పెద్ద పెద్ద చెట్ల మధ్య కట్టిన ఈ బొమ్మల ఇంటిని 'వాల్ మేకర్స్' అనే సంస్థ ఫౌండర్ అయిన వినుడానియల్, ఆయన బృందం నిర్మించింది. మొత్తం 6200 విరిగిపోయిన ఆటబొమ్మలను ఇంటి నిర్మాణం కోసం ఉపయోగించారు. వృత్తాకారంలో ఉన్న ఈ ఇంటి మధ్యలోకి, మూడు ద్వారాల గుండా వెళ్లేలా కట్టారు. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా ఉన్న పెద్ద వరండా ఇంటి అందాన్ని రెట్టింపు చేసినట్లు ఉంటుంది. ఇంటి మధ్యలో గాజు పైకప్పుతో నిర్మించిన అంతర్గత ప్రాంగణం వల్ల సూర్యకాంతి సహజంగా లభిస్తుంది. కుటుంబ సభ్యులు, సందర్శకులు ఎవరికీ ఇబ్బంది లేకుండా దేనికదే ప్రత్యేకమైన గదులు నిర్మించారు. మంగుళూరు పెంకుల మధ్య విరిగిపోయిన బొమ్మలని అందంగా, నైపుణ్యంగా అమర్చిన తీరు చూస్తే ఔరా అనకుండా ఉండలేం. అంత అందంగా, నైపుణ్యంగా వాటిని పెట్టిన విధానం పిల్లలకే కాదు, పెద్దలకి కూడా ఆశ్చర్యం కలిగిస్తుంది. విదేశీ నిర్మాణశైలి కూడా ఈ ఇంట్లో కనిపిస్తుంది. జపాన్ శైలిలో షోజి తెరలను ఉపయోగించారు. దీనివల్ల ఇల్లు చాలా చల్లగా ఉంటుంది. లైబ్రరీ, వంటగదిని చూసి, యజమానుల అభిరుచి గురించి అందరూ మాట్లాడుకుంటారు. 'టారు స్టోరీ రెసిడెన్స్'గా చలామణి అవుతున్న ఈ ఇంటి నిర్మాణంలో వాడిన ప్రతి బొమ్మ అక్కడికి వచ్చిన వారికి ఒక్కో కథ చెబుతుంటాయి.

# ఫేమస్ ఫంక్షన్ హాల్ సీజ్..

**హైదరాబాద్, జనవరి, 24 :** ప్రభుత్వ స్థలంలో నిర్మించిన చాలా వరకు నిర్మాణాలు హైడ్రా వచ్చిన తర్వాత ఒక్కోటి బయటకు వస్తున్నాయి. కొంత మంది అక్రమ కట్టాలు విషయంలో ఫిర్యాదు చేసేందుకు హైడ్రా దాక వెళ్లకుండా.. ఆ పరిధి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. అక్కడ నిజంగానే అక్రమ కట్టడం జరిగిందా లేదా అనేది అధికారులు నిర్ధారించుకొని వాటిని కూల్చేస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో ఏ నిర్మాణాలు చేపట్టవద్దని ప్రభుత్వం చెబుతున్నా.. చాలా మంది పెడచెవిన పెడుతున్నారు. ఈ కోవలోకే వస్తుంది ఈ ఘటన. హైదరా బాద్ లో ఫేమస్ ఫంక్షన్ హాల్ ను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ భూముల పై అక్రమ కట్టడాలు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు చర్యలు వేగవంతం చేస్తున్నారు. తాజాగా హిమాయత్‌న గర్‌లో హైదరగూడ అపోలో ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఈఎఫ్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఈ స్థలం ప్రభుత్వానికి చెందిందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో.. పోలీసులు భద్రత కల్పించగా అధికారుల బృందం స్వాధీనం చేసుకుందిఈ వ్యవహారం చాలా కాలంగా న్యాయపరమై న వివాదంలో ఉంది. ఫంక్షన్ హాల్ యజమానులు ప్రభుత్వ భూమిలో వ్యాపారం నడుపుతున్నారని గతంలో కేసు నమోదైంది. చివరికి సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ఈ చర్య సపట్టారు. ఈ సందర్భంగా మజ్లీస్ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం కూడా చోటుచేసుకుంది. హైడ్రా ఏర్పడిన తర్వాత నగరంలో అనేక అక్రమ నిర్మాణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటివరకు ప్రజలు అక్రమ కట్టడాలపై ఫిర్యాదులు చేసేందుకు నేరుగా హైడ్రాకు వెళ్లకపోయినా.. పరిధి రెవెన్యూ అధికారులకు సమాచారం అందిస్తే అక్కడి పరిశీలన తర్వాత నిర్మాణం చట్టబద్ధమా కాదా అనేది నిర్ధారిస్తున్నారు. అక్రమంగా తేలితే వాటిని కూల్చివేయడం లేదా స్వాధీనం చేసుకోవడం జరుగుతోంది. ప్రభుత్వం తరచూ ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తోంది. ప్రభుత్వ భూముల్లో ఎలాంటి కట్టడాలు, వ్యాపారాలు, ఫంక్షన్ హాళ్లు లేదా వాణిజ్య ప్రాజెక్టులు చేయకూడదని స్పష్టం చేస్తోంది. అయినప్పటికీ కొంతమంది పెద్దల మద్దతుతో అక్రమంగా భూములను ఆక్రమించి వాణిజ్య కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఈఎఫ్ గార్డెన్ ఘటన కూడా అదే తరహాలో వెలుగులోకి వచ్చింది. అనేక ప్రాంతాల్లో ఇలాంటి కేసులు బయటపడుతున్నాయి. శివార్లలో గాని, వాణిజ్య కేంద్రాల్లో గాని అక్రమ కట్టడాలు గుర్తించిన వెంటనే హైడ్రా బృందాలు అక్కడికి చేరుకొని చర్యలు తీసుకుంటున్నాయి. ప్రజలు కూడా ఇలాంటి సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు.

## పల్లెల అభివృద్ధి ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే

**హైదరాబాద్, జనవరి, 24:** కొడిమ్యాల మండలంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శుక్రవారం పర్యటించారు ముందుగా స్థానిక మండలఅభివృద్ధి కార్యాలయంలో మండలానికి చెందిన 46 ముఖ్యమంత్రి సహాయ నిధి 12,16,500 విలువగల చెక్కులను లబ్ధిదారులకు అందించారు, తరువాత కొడిమ్యాల మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించేఎస్ జి ఎఫ్ –అండర్– 14అండర్ –17 క్రీడలను ప్రారంభించి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు తరువాత దమ్మయ్యపేట గ్రామంలో వరదరాయ చెరువును పరిశీలించి త్వరతగతిన పనులు చేపడతామని తెలిపారు తరువాత అంగన్వాడీ నూతన బిల్డింగ్ భూమిపూజ చేసి ఒడ్డెర కులసంఘ భవనం ప్రారంభించారు స్థానిక మహిళల కోరికమేరకు వెంటనే కలెక్టర్ తో మాట్లాడి బ్రతుకమ్మ తెప్ప నిర్మాణంతో పాటు హైమస్ లైట్లను పండగ లోపు ఏర్పాటు చేస్తాం అని హామీ ఇచ్చారు రాబోవు రోజుల్లో దమ్మయ్య పేట గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయిస్తాం అని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్త కార్డుల కష్టాలు..!



**హైదరాబాద్, జనవరి, 24 :** తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసిన ప్రభుత్వం.. కొత్త వారికి కూడా సెప్టెంబర్ కోటా రేషన్ విడుదల చేసింది. అయితే వీరిలో చాలా మందికి డీలర్లు రేషన్ ఇవ్వడం లేదు. కారణం ఈకేవైసీ పూర్తి చేయకపోవడం. కొందరు ఈకేవైసీ పూర్తి చేసినా.. ఆధార్ అప్‌డేట్ లేకపోవడంతో వారి రేషన్ కార్డు ఈకేవైసీ రావడం లేదు. దీంతో వారంతా ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసింది. జూన్ నెలలోనే మూడు నెలల రేషన్ పంపిణీ చేసిన ప్రభుత్వం తిరిగి రేషన్ పంపిణీ ప్రారంభించింది. కొత్తగా రేషన్ కార్డు పొందిన వారికి కూడా సెప్టెంబర్ నుంచి రేషన్ పంపిణీ చేస్తున్నారు. అయితే కొత్తగా కార్డు పొందిన వారితో పాటుగా.. పాత రేషన్‌కార్డు హోల్డర్లకు ఆధార్ కార్డుకు సంబంధించిన ఓ ఇష్యూ వల్ల సమస్య ఎదుర్కొంటున్నారు. దీంతో డీలర్లు వారికి బియ్యం ఇవ్వడం లేదు. ఇంతకు సమస్య ఏంటి అంటే..రేషన్‌కార్డు దారులు ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని

## ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత రెండేళ్ల నుంచి చెబుతూనే ఉన్నాయి. పైగా ఈకేవైసీ అప్‌డేట్ కోసం గడువు పెంచుతూపోతున్నాయి. అయినా సరే ఇంకా కొందరు ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయలేదు. అలానే తాజాగా మంజూరు చేసిన కొత్త రేషన్‌కార్డుల్లో కొత్తగా సభ్యులను చేర్చారు. వీరికి కూడా సెప్టెంబర్ నెలకు సంబంధించిన రేషన్ కోటా విడుదల చేశారు. అయితే వీరంతా బియ్యం పొందాలంటే కచ్చితంగా ఈకేవైసీ చేయించాల్సిందే అంటున్నారు డీలర్లు. చాలా వరకు జిల్లాల్లో సుమారు 80 శాతం మందికి ఈకేవైసీ పూర్తి కాగా.. మరో 20 శాతం మంది మాత్రం ఇంకా పూర్తి చేయలేదు. దీంతో వారికి రేషన్ బంద్ చేస్తామని డీలర్లు చెబుతున్నారు. అయితే వీరిలో కొందరు ఈకేవైసీ చేయించుకున్నప్పటికీ.. వీరి వేలి ముద్రలు అప్‌డేట్ కావడం లేదు. దీని గురించి ఆరా తీయగా.. సదరు వ్యక్తుల ఆధార్ కార్డు అప్‌డేట్ కాలేదని.. అందుకే వారి ఈకేవైసీ ప్రక్రియ పూర్తి కాలేదని తెలిసింది. చిన్నారులకు ఆధార్ కార్డు అప్‌డేట్ చేయకపోవడం వల్ల వారు ఈకేవైసీకి దూరం అయ్యి.. రేషన్ బియ్యం పొందలేని పరిస్థితి నెలకొంది. దీంతో వీరంతా ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే పలు జిల్లాల్లో ఆధార్ కేంద్రాలు తక్కువగా ఉండటంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కొన్ని మండలాల్లో ఆధార్ కేంద్రాలు లేవు. దీంతో వీరు ఇతర మండలాలకు వెళ్తున్నారు. దీంతో పలు ఆధార్ కేంద్రాల వద్ద జనాలు పెద్ద సంఖ్యలో క్యూ కడుతున్నారు. అధికారులు మరిన్ని ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది అంటున్నారు. దీనిపై అధికారులు స్పందిస్తూ ఆలస్యం అయినా పర్లేదు కానీ.. ప్రతి ఒక్కరు ఈకేవైసీ చేయించుకుంటే మంచిది అంటున్నారు. ఆధార్‌కు ఈ–పాస్ యంత్రాన్ని అనుసంధానం చేయడంతో.. తప్పుడు వ్యక్తులు బియ్యం తీసుకోవడానికి వీలుండదు. అందుకే కేవైసీ నిబంధన తప్పనిసరి చేశారు.


# వ్యవసాయం అతిపెద్ద ఉత్పాదక రంగం



## దానిని ప్రోత్సహిస్తే ఆర్థిక పురోగతి

**హైదరాబాద్, జనవరి, 24 :** స్వవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన అవసరం ఉంది. వ్యవసాయరంగ నిపుణులు ఇదే అభిప్రాయ పడుతున్నారు. నిరుద్యోగులు గ్రామాలకు తరలాలని, వారిని ఆదరించి వ్యవసాయం వైపు మళ్లించాలని అన్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయంరంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిదని అంటున్నారు. బహుళజాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమిా సారం తగ్గుతోంది. ఏ పంటపండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందిం చాలి. ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్న ప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. ఇతర దేశాల నుంచి ఆహార ధాన్యాల దిగుబడి తక్షణం ఆగిపోవాలని అన్నారు. ఆర్థిక పునరుత్తేజానికి, వృద్ధిరేటును పెంచడానికి నవతరం సంస్కరణలు అవసరమని తెలిపారు. విద్యుత్తు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల రంగాల సమస్యలు సత్వరం పరిష్కరించాల్సి ఉందని, ప్రైవేటు పెట్టుబడులు పెరిగేందుకు సరికొత్త సంస్కరణలు అవసరమని తెలిపారు. ప్రైవేటురంగ విశ్లేషకుల నుంచి వృద్ధిరేటు అంచనాలు వేర్వేరుగా ఉంటున్నాయని, వీటిల్లో చాలావరకు ప్రభుత్వ అంచనాల కంటే తక్కువగా ఉంటున్నాయని గుర్తు చేశారు. ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని, పరిష్కారానికి నూతన సంస్కరణలు అవసరమని నిపునుల హెచ్చరికలు పట్టించుకోవడం లేదు. విద్యుత్తు, ఎన్‌బీఎఫ్‌సీ రంగాల్లో సత్వరం సమస్యలు పరిష్కరించాలి. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు వచ్చేలా దీర్ఘకాలిక దృక్పథం కలిగిన సంస్కరణలూ కావాలి. ప్రోత్సాహకాలు, ఉద్దీపనలు తాత్కాలికంగా మాత్రమే ఉపకరిస్తాయి. ఇప్పుడు మెరుగైన విధానం కాదు, ప్రత్యేక విధానం కావాలి.

# మహారాష్ట్ర ఉల్లి రైతు కన్నీరు



- ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్‌లోనూ భారీగా ధర పతనం
- క్వింటాల్‌కు రూ.3 వేలు కనీస మద్దతు ధర ఇవ్వాలని
- అన్నదాతల డిమాండ్
- ఆగస్టు 10లోగా చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన సిద్ధం

**హైదరాబాద్, జనవరి, 24 :** మహారాష్ట్రలో ఉల్లి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. అప్పుసప్పు చేసి ఆరుగాలం కష్టించి పండించిన పంటకు కనీస మద్దతు ధర దక్కకపోవడంతో సమస్యల వలయంలో చిక్కుకున్నారు. ఆసియాలోనే అతిపెద్ద ఉల్లి మార్కెట్ అయిన మహారాష్ట్రలోని లాసాల్ గావ్‌లో గత రెండు వారాలుగా ఉల్లి ధరలు దాదాపు 15 శాతం మేర పడిపోయాయి. జులై 16న క్వింటాల్ ఉల్లి ధరలు సగటున రూ.1500 వుండగా, జులై 28 నాటికి అది రూ.1275కి పడిపో యింది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తక్షణమే జోక్యం చేసుకుని రైతులను ఆదుకోవాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. క్వింటాల్‌కు కనీస మద్దతుధర రూ.3వేలుగా నిర్ణయించాలన్నది రైతుల ప్రధాన డిమాండ్‌గా వుంది. ప్రస్తుతం సగటు మార్కెట్ ధర క్వింటాల్‌కు రూ.1275గా వుంది. తమ పంటకు మద్దతు ధర ఇవ్వాలని, దీర్ఘకాలిక విధానపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జరిగిన లాసాల్‌గావ్ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ (ఎపిఎంసి) సమావేశంలో మహారాష్ట్ర రాష్ట్ర ఉల్లి రైతుల సమాఖ్య పలు తీర్మానాలను ఆమోదించింది. ఈ సమావేశానికి రైతు ప్రతినిధులు, ఎపిఎంసి సభ్యులు, రాష్ట్రవ్యాప్తంగా సహకారనేతలు హాజరయ్యారు. 10 వరకు వేచిచూస్తాం: రైతులు తమ ఉత్పత్తి వ్యయాని కన్నా చాలా తక్కవ ధరలకు అమ్ముకోవాల్సి వస్తోంది. ఆ ఉత్పత్తి వ్యయం క్వింటాల్‌కు రూ.1800 నుండి రూ.2వేలు మధ్యలో వుంటోంది. ఇది కేవలం ఆర్థికపరమైన దోపిడీనే కాదు, ఏడాది కాలమూ కష్టించి పనిచేసే రైతన్న పట్ల అగౌరవమని అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు భరత్ ధిఘోలె విమర్శించారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించని పక్షంలో రైతులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతారని హెచ్చరించారు. అప్పటివరకైతే వేచి చూస్తామన్నారు.రైతుల డిమాండ్లు: ఉల్లి ఎగుమతులపై ఏకపక్ష ఆంక్షలను నివారించడానికి 20 ఏళ్ళ దీర్ఘకాలిక ఎగుమతి విధానాన్ని రూపొందించాలి. ప్రతిపాదిత ఎంఎస్‌పితో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉల్లిని సేకరించాలి. ఆనియన్ పండ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి, ఇటీవలి మాసాల్లో ఉత్పత్తి వ్యయానికన్నా అతి తక్కువ ధరకు ఉల్లిని అమ్ముకున్న రైతులకు కింటాల్‌కు వెయ్యి రూపాయిలు ఇవ్వాలి, కీలకమైన జిల్లాల్లో కేంద్రం తోడ్పాటుతో ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలి. రవాణా, ఇంధన రేట్లపై సబ్సిడీ ఇవ్వాలి, 10 శాతం ఎగుమతి సబ్సిడీ ఇవ్వాలి, మార్కెట్ కమిటీల ద్వారా క్వింటాల్‌కు రూ.3 వేలకు తగ్గకుండా పెద్ద మొత్తంలో నిల్వలు సేకరించాలి, అలా కాని పక్షంలో నాఫెడ్, ఎన్‌సిసిఎఫ్‌ల ద్వారా సేకరించడాన్ని ఆపేయాలని కేంద్రాన్ని అసోసియేషన్ కోరింది.

# సిసిఆర్‌సి కార్డు ఉన్నా 'అన్నదాతా సుఖీభవ'కు దూరం

**హైదరాబాద్, జనవరి, 24 :** కౌలు రైతులను అన్నదాతా–సుఖీభవ పథకానికి ప్రభుత్వం దూరం చేసింది. ప్రస్తుతం పంట సాగు హక్కుదా రుల పత్రం (సిసిఆర్‌సి కార్డు) ఉన్న వారు, గతంలో రైతు భరోసా అందుకున్న వారు సైతం ఇప్పుడు ప్రభుత్వ సాయానికి నోచుకోలేకపో తున్నారు. గత వైసిపి ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని కౌలు రైతులకు వర్తింపజేసినా ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం వారిని పరిగణనలోకి తీసుకోలేదు. కార్డుల జారీ ప్రక్రియ పూర్తి కాలేదనే సాకుతో వారికి ఈ పథకాన్ని వర్తింపజేయడం లేదు. కౌలు కార్డులు దక్కినా, దాని ఫలితం మాత్రం కౌలు రైతులు పొందలేకపోతున్నారు. విత్తనాల పంపిణీ దాదాపు పూర్తయిన తర్వాత కార్డులు ఇవ్వడం వల్ల ప్రయోజ నం లేకుండా పోతోంది. బ్యాంకు రుణాలూ దక్కడం లేదు. భూ యజమానులు అప్పటికే ఆ భూమిపై రుణం తీసుకోవడంతో కౌలు రైతులకు బ్యాంకర్లు రుణం మంజూరు చేయడం లేదు. రాష్ట్ర వ్యాప్తం గా ఈ ఏడాది పది లక్షల మంది కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులను జారీచేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.జూన్ రెండో వారంలో కార్డుల జారీ ప్రక్రియ మొదలు పెట్టింది. కౌలు రైతులకు రెండు కేటగిరీల్లో కార్డులను జారీ చేసింది. ఇప్పటివరకు మొత్తం 4,58,987 మందికి జారీ అయ్యాయి. సర్వే నంబర్లు ఆధారంగా 2,86,383 మందికి, భూ సమగ్ర సర్వే జరిగిన చోట ల్యాండ్ పార్శిల్ మ్యాప్ ఆధారంగా 1,72,604 మందికి అందించింది. కౌలు రైతులను గుర్తించి సిసిఆర్ సి కార్డుల జారీని సులభతరం చేస్తామని చెప్పిన టిడిపి కూటమి ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన పంట సాగు హక్కుదారుల చట్టం–2019నే యథాతథంగా అమలు చేసింది. దీంతో, భూ యజమానుల దయాదాక్షిణ్యంపైనే కార్డుల జారీ ప్రక్రియ సాగుతోంది. తమ భూమిపై భవిష్యత్తులో కోర్టులకు వెళ్తారన్న భయం, పిఎం కిసాన్, రైతు భరోసా, అన్నదాతా సుఖీభవ వంటి పథకాలు తమకు రావనే ఉద్దేశంతో అంగీకార పత్రాలపై సంతకాలు చేసేందుకు చాలాచోట్ల భూ యజమానులు అంగీకరించలేదు. వ్యవసాయం గిట్టుబా టు కాకపోవడంతో ఒకట్రెండు ఎకరాల భూమి ఉన్న రైతుల్లో కొందరు తమ భూములను కౌలుకి ఇచ్చి వలస వెళ్లిపోతున్నారు. ఆధార్ కార్డు, పాస్ పుస్తకం కాపీలు ఇవ్వడానికి, రాతపూర్వక సమ్మతి తెలపడానికి వారు అక్కడి నుంచి ఇక్కడికి రావడానికి ఇష్టపడడం లేదు. అధిక శాతం జిల్లాల్లో సగం మందికి కూడా అందని వైనం: చాలా జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలో సగం మందికి కూడా కార్డులు అందలేదు. తూర్పుగోదావరి
జిల్లాలో 1.10 లక్షల మందికి కార్డులు జారీ చేయాలనేది లక్ష్యం కాగా, ఇప్పటివరకూ 4,63,595 మందికి మాత్రమే అందింది. ఎన్‌టిఆర్ జిల్లాలో 56 వేల మందికి కార్డులను అందించాలనేది లక్ష్యం కాగా, ఇప్పటివరకూ 37,739 మందికి జారీ అయ్యాయి. వైఎస్‌ఆర్ కడపలో 11 వేల మందికి కౌలు కార్డులు ఇవ్వాలనే లక్ష్యం కాగా, 2,919 మందికి మాత్రమే అందాయి. అనంతపురంలో 8,500 మందికి ఇవ్వాలనేది లక్ష్యం కాగా, 559 మందికి, చిత్తూరు జిల్లాలో 4,200 మందకి జారీ చేయాలనేది లక్ష్యం కాగా, 213 మందికి మాత్రమే అందజేశారు.



# కార్పొరేట్ల గుప్పెట్లో పచ్చని భూములు

**- కర్నూలు జిల్లాలో ఇప్పటికే 20 వేల ఎకరాలు వారి చేతుల్లో**

**- మరో 15 వేల ఎకరాలు కట్టబెట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు**

**కర్నూలు, జనవరి, 24 :** అభివృద్ధి, ఉద్యోగాలు, ఉపాధి పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పచ్చని పంట పొలాలను కార్పొరేట్ల కట్టబెడుతున్నాయి. కర్నూలు జిల్లాలో 2015 నుంచి ఇప్పటికే 20 వేల ఎకరాలు వారి గుప్పిట్లోకి వెళ్లిపోయాయి. మరో 15 వేల ఎకరాలను కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. 2015లో గడివేముల మండలం ఘని, శకునాల గ్రామాల పరిధిలో కర్నూలు అల్ట్రా మెగా సోలార్ పార్క్ పేరుతో ఆరు వేల ఎకరాలను ప్రభుత్వం కేటాయించిం ది. ఈ ప్రాజెక్టును ఒక గిగావాట్స్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రారంభించా రు. అయినా, స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వలేదు. డి-పట్టా భూము లనే పేరుతో రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండానే భూములు తీసుకో వాలని ప్రయత్నించింది. దీనికి వ్యతిరేకంగా సిపిఎం, రైతు సంఘాల పోరాటం ఫలితంగా అప్పటి టిడిపి ప్రభుత్వం చివరికి 1,800 మంది రైతులకు ఎకరాకు రూ.4.20 లక్షల చొప్పున పరిహారం అందించింది. ఓర్వకల్లులోని జయరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. ఈ ప్లాంట్ వల్ల ప్రత్యేక్షంగా 1,100 మందికి, పరోక్షంగా ఆరు వేల మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. రెండు వేల ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఆ ప్లాంట్‌ను నేడు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించనున్నా రు. ఇప్పటి వరకు సుమారు 3,200 మందికి ఉపాధి కల్పించినట్టు చెబుతున్నారు. అదే మండలంలోని నన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలో డ్రోన్ హబ్ కోసం సుమారు 300 ఎకరాలను ప్రభుత్వం బలవంతంగా లాక్కొంది. దీని నిర్మాణ పనులకు ప్రధాని మోడీ ఈ నేడు శంకుస్థాపన చేయనున్నారు. 2018లో ఓర్వకల్లు మండలం గుమ్మితం తండా, పాణ్యం మండలం పిన్నాపురం ప్రాంతాల్లో గ్రీన్‌కో పేరుతో ఇంటిగ్రేటెడ్ పవర్ ప్రాజెక్టుకు ప్రభుత్వం 4,500 ఎకరాలను కట్టబెట్టింది. రైతులు సాగు చేసుకుంటున్న రెండు వేల ఎకరాల్లో పట్టాలు ఉన్న వంద మంది రైతులకు చెందిన 500 ఎకరాలకు మాత్రమే ఎకరాకు రూ.8 లక్షల నుంచి రూ.11 లక్షల వరకూ పరిహారాన్ని అందించారు. ఏళ్ల కాలంగా మరో 300 మంది రైతులు 1500 ఎకరాలు సాగు చేసుకుంటున్నా పరిహారం ఇవ్వలేదు. 2022 సెప్టెంబర్‌లో నంద్యాల జిల్లా కొలిమిగుండ్లలో రామ్‌కో పరిశ్రమను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించినప్పుడు దాదాపు వెయ్యి మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. ప్రస్తుతం ఆ సంఖ్యలో ఉద్యోగులు ఉన్నా, వారిలో స్థానికులు 300 మందే. కర్నూలు అల్ట్రా మెగా సోలార్ పార్క్‌కు భూములు ఇచ్చిన రైతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. మొత్తం 1800 రైతు కుటుంబాలు ఉండగా, 25 మంది ఐటిఐ వారికి, పది మంది డ్రైవర్లకు మాత్రమే అందులో ఉద్యోగాలు కల్పించారు. తాజాగా పత్తికొండ మండలం హొసూరు, పెద్దహుల్తి గ్రామాల్లో సోలార్ విద్యుదుత్పత్తి కోసం టాటా పవర్ కంపెనీ రైతుల నుంచి 1800 ఎకరాలను సేకరిస్తోంది. ఆ ప్రాంతంలో రైతులు వేరుశనగ, ఉల్లి, వాము, జొన్న, కొత్తిమీర తదితర పంటలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మధ్య దళారులు రైతులను మభ్యపెట్టి పంట భూముల ను కారు చౌకగా ప్రయివేట్ కంపెనీలకు దోచిపెడుతున్నారు.

ఇప్పటికే రైతుల నుండి దాదాపు వెయ్యి ఎకరాలకు లీజు ఒప్పందం జరిగినట్లు సమాచారం. ఆలూరు, హొళగుంద, ఆస్పరి, చిప్పగిరి మండలాల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సాయిరాం, పెంటాగాన్, దత్తు, టిజివి గ్రూప్ కంపెనీలు కలిసి ఐదు వేల ఎకరాలను రైతుల నుంచి సేకరిస్తున్నాయి. వాటికి తోడు ఓర్వకల్లు మండలం మీదివేముల, కొమరోలు, పాలకొలను, గుట్టపాడు, పూడిచర్ల గ్రామాల్లో 15 వేల ఎకరాలను రైతుల నుంచి లాక్కొని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఎపిఐఐసి సిద్ధం అవుతోంది.

ఆలూరులో రైతుల నుంచి వ్యతిరేకత: ఆలూరు నియోజకవర్గంలో మనేకుర్తి, హులేబీడు, కమ్మరచేడు గ్రామాల రెవెన్యూ పరిధిలో సోలార్ కోసం 192 ఎకరాల సాగు భూమిని రాష్ట్ర ప్రభుత్వం చేసేందుకు సమాయత్తం అవుతోంది. మనేకుర్తికి చెందిన రైతుల నుండి 94.64 ఎకరాలు, హులేబీడు గ్రామానికి చెందిన 82.11 ఎకరాలు, కమ్మరచేడు గ్రామానికి చెందిన 15.016 ఎకరాలు భూసేకరించాలని నిర్ణయించింది. 60 మంది రైతులు భూములు ఇవ్వబోమని తేల్చి చెబుతున్నారు. ఆలూరు మండలం మనేకుర్తిలో సోలార్ గ్రిడ్ కోసం సేకరించే భూమికి తొలుత ఎకరాకు రూ.6 లక్షల పరిహారం ఇస్తామన్నారు. తర్వాత దాన్ని రూ.12 లక్షలకు పెంచారు. తాజాగా రూ.18లక్షలు ఇస్తామనిఅంటున్నారు. అయినా, సరే మా భూములు ఇస్తే తమకు ఆధారం లేకుండా పోతుందని, భూములను ఇచ్చేదే లేదని రైతులు తేల్చి చెబుతున్నారు.

# రోడ్లు బాగుపడేదప్పుడు

**నిజామాబాద్, జనవరి, 24 :**మండలంలోని రహదారులు గుంతల మాయంగా మారడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పదర ప్రధాన రహదారితోపాటు మద్దిమడుగు వరకు ఎక్కడ పడితే అక్కడ గుంతలు పడి యమ లోకానికి ద్వారాలుగా ఉన్నాయి.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా రహదారుల మరమ్మత్తు పనులపై పట్టించుకోలేకపోవడం దురదృష్టకరం.. నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మండల పర్యటనకు వచ్చినప్పుడల్లా ఈ రహదారుల గుండానే ప్రయాణం చేస్తున్నా కనీసం పట్టించుకోకపోవడం గమనార్హం. కోతులు పడిన ఈ రహదారిలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు గోతుల్లో పడి తీవ్రంగా గాయపడిన సంఘటనలు అనేకం. వర్షపు నీరు నిలిచి ఉండడంతో గోతులు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్న పరిస్థితి.గత ప్రభుత్వ మాజీ ఎమ్మెల్యే ఎన్నోసార్లు హామీలు ఇచ్చి ఏ రోడ్డు కూడా మరమ్మ తులు చేయలేకపోయారనే విమర్శలు ఉన్నాయి. పదర నుండి మద్దిమడుగు వరకు డబల్ రోడ్డు వేయాలని ప్రయాణికులు, గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, అధికారులు స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.కొంతకాలంగా గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులు బిటిగా మార్చకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూర్తిగా మట్టి రోడ్లు కావడం అధిక వర్షాలు కురుస్తుండడంతో దారులన్నీ దెబ్బతిని రాకపోకలకు వీల్లేని విధంగా మారాయి. అదే మార్గాల్లో భారీ వాహనాలు సైతం వెళ్తుండడంతో నిత్యం వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులు ప్రమాదాల బారిన పడుతున్నారు.అధిక మంది పాడి రైతులు ఉదయం సాయంత్రం రాకపోకలు చేస్తుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని గ్రామాలతో పాటు నియోజకవర్గ సరిహద్దు గ్రామాల పరిస్థితి అధ్వానంగా మారింది. నియోజకవర్గ ఎమ్మెల్యే స్పందించకపోవడంతో ఎన్నో ఏళ్లుగా మట్టి దారిలో దర్శనమిస్తున్నాయి. నిత్యం గతుకుల రోడ్డులోని వాహనదారులు రాకపోకలు చేస్తున్నారు. అధికారులు ప్రజా ప్రతి నిధులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లోని మట్టి దారులను బీటీ దారుల మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

# 22 ఏ కిందకు ఎకరాల భూమి

## అమ్మకోలేరు..వాడుకోలేరు

**ఏలూరు, జనవరి, 24 :**కొరందరికీ ఎకరాల కొద్దీ భూమి ఉంది. కానీ ఏదైనా అత్యవసం అయితేనో.. ఆడబిడ్డకో ఇవ్వలేరు.. వారసులకు పంచలేరు. చుట్టూ నీరున్నా.. తాగడానికి పనికి రాదు అన్న చందంగా ఉంది వారి పరిస్థితి. ఎకరాల కొద్దీ భూములున్నా అవన్నీ 22ఎ(నిషేధిత ఆస్తుల) జాబితాలో ఉండటంతో.. ఇటు అమ్ముకోలేక.. అటు వారసుల కు పంచలేక భూ యజమానులు నరకం చూస్తున్నారు. అసైన్డ్ భూములు, స్వాతంత్ర్య సమరయోధుల భూములు చేతులు మారినా.. గత ప్రభుత్వం ఫ్రీహోల్డ్‌లో పెట్టి అమ్మకాలు ఆపేసింది. సుమారు 15 వేల ఎకరాల భూములు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాయి. భూమి ఉంటే మనిషికి కొండంత భరోసా. ఎంత పెద్ద కష్టం వచ్చినా సరే.. తీర్చుకోవచ్చు అనే ధీమా ఉంటుంది. చిన్న చిన్న అక్కర్లకు అయితే భూమిని తాకట్టు పెట్టి రుణం పొందవచ్చు. పెద్ద సమస్య వస్తే.. భూమిని అమ్ముకుని కష్టం నుంచి బయపడవచ్చు. ఆడబిడ్డ పెళ్లికి కట్నంగా కూడా ఇవ్వొచ్చు. భూమి ఉంటే మనిషికి తల్లి దగ్గర ఉన్నంత భరోసా ఉంటుంది. కానీ ఇప్పుడు మనం చెప్పుకోబోయే రైతులది విచిత్రమైన పరిస్థితి. వారందరి పేరు మీద వేల ఎకరాల భూములున్నా.. వారికి అక్కరకు రాకుండా పోతున్నాయి. పోని వారసులకు పంచుదామా అంటే దానికి వీలు లేకుండా ఉంది. అసలేంటి సమస్య అంటే..పశ్చిమ గోదావరి జిల్లాలోని చాలా మంది రైతులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. వారి పేరు మీద ఎకరాల కొద్దీ భూములున్నా.. ఇటు ఆర్థిక అవసరాలకు అమ్ముకోలేక.. అటు వారసులకు పంచలేని దుస్థితిలో ఉన్నారు. కారణం వారి భూములు 22ఎ జాబితాలో ఉండటం. అదేలా జరిగింది అంటే.. ప్రభుత్వం అసైన్డ్ ల్యాండ్స్ ఈ జాబితాలోకి వస్తాయి. ఈ భూములను అమ్ముకోలేరు.. వారసులకు పంచలేరు.మం డలంలో అత్యధికంగా 15 వేల ఎకరాల భూమి ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. గతంలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు, స్వాతంత్ర్య సమరయోధులు, సైనికులకు కేటాయించిన భూములను కొందరు అమ్ముకున్నారు. ఈ భూములు పలుమార్లు చేతులు మారాయి. అయితే గతంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఈ భూములను ఫ్రీహోల్డ్‌లో పెట్టింది. వాటి అమ్మకాలు, కొనుగోళ్లను నిలిపివేసింది. ఈ భూములకు సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు, అడంగల్ పత్రాలు, పాస్‌పుస్తకాలు వంటివి ఉన్నా సరే.. పాలకుల నిర్ణయాల వల్ల సంవత్సరాల తరబడి ఇబ్బంది పడుతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అయినా తమ సమస్యను పరిష్కరిస్తుందని వారు ఆశించారు. కానీ రోజులు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాలేదు. ఈక్రమంలో తాజాగా పెదవేగి మండలానికి చెందిన కొందరు.. కోర్టు అనుమతితో భూములను రిజిస్టర్ చేయించుకున్నారు. అయితే ఈ సమస్య ఎదుర్కొంటున్న అందరూ ఇలా కోర్టుకు వెళ్లడం సాధ్యం కాదు. కనుక ప్రభుత్వమే ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

పెదవేగి మండలంలోనే అత్యధికంగా 15 వేల ఎకరాల భూమి ఈ సమస్యను ఎదుర్కొంటుంది. ఈ భూముల సమస్యలను పరిష్కరించాలని బాధితులు పీజీఆర్ఎస్‌లోనూ విన్నవించుకున్నారు. అయినా ప్రయోజనం లేదని తెలుస్తోంది. ఈ భూములపై ప్రతి వారం కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్షలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. సరైన పత్రాలు ఉన్న భూములను ఈ జాబితా నుంచి తొలగిస్తామని వెల్లడించారు. వాటి క్రయ, విక్రయాలకు అవకాశం కల్పిస్తున్నామని.. ఈ మేరకు తహసీల్దార్లకు ఆదేశాలు ఇచ్చామని వారు పేర్కొన్నారు

# 2061 నాటి ఒత్తిడికి తగ్గట్టుగా

# రెడీ అవుతున్న బెజవాడ రైల్వేస్టేషన్

**విజయవాడ, జనవరి, 24 :**విజయవాడ రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. ఇక మీదట ఈ స్టేషన్‌లో విమానాశ్రయం తరహా సౌకర్యాలు అందు బాటులోకి రానున్నాయి. రానున్న 30 ఏళ్ల ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా స్టేషన్‌ని అభివృద్ధి చేయబోతున్నారు. నీతి ఆయోగ్ ఈ రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు ఆమోదం తెలిపింది. పీపీపీ పద్ధతిలో చేపట్టే ఈ ప్రాజెక్టుతో స్టేషన్ రూపురేఖలే మారిపోనున్నాయి. స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల సంఖ్య పెరగడమే కాక.. లిఫ్టులు, ఎస్కలెటర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించబోతున్నారు. భారత్ స్టేషన్ పథకంలో భాగంగా.. కేంద్ర ప్రభుత్వం.. దేశవ్యాప్తంగా ఉన్న ప్రధానమైన రైల్వే స్టేషన్ల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోంది. దీనిలో భాగంగా విజయవాడ రైల్వే స్టేషన్ రూపు రేఖలు మార్చేందుకు సిద్ధమయ్యింది. వందల కోట్లరూపాయల నిధులు వెచ్చించి స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. రానున్న 30 ఏళ్ల పాటు ప్రయాణికులు అవసరాలు తీర్చేలా స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. పీపీపీ విధానంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈక్రమంలో రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల సంఖ్య పెంచనున్నారు. ఆ వివరాలు..కేంద్రం ప్రభుత్వం చొరవతో.. విజయవాడ రైల్వేస్టేషన్‌ను విమానాశ్రయానికి ధీటుగా అభివృద్ధి చేయనున్నారు. వచ్చే 30 ఏళ్లలో ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా స్టేషన్‌ను ఆధునికీకరించనున్నారు. ఈ అభివృద్ధి పనులకు తాజాగా నీతి ఆయోగ్ ఆమోదం తెలిపింది. ప్రైవేట్ పబ్లిక్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈమేరకు రైల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఈ పనుల టెండర్లకు సంబంధించి తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. డిసెంబర్ 31 లోపు టెండర్లు దాఖలు చేయాలని తెలిపింది.ప్రస్తుతం విజయవాడ రైల్వే స్టేషన్‌లో రోజుకు లక్ష నుంచి 2 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే మరో 30 ఏళ్లలో అనగా 2061 నాటికి ప్రయాణికుల సంఖ్య 4-5 లక్షలకు చేరుకుంటుందని అధికారులు అంచనా



వేస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగా స్టేషన్‌ను తీర్చిదిద్దనున్నారు.ప్రస్తుతం రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వైపు మాత్రమే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. త్వరలోనే పశ్చిమ వైపు కూడా రైల్వే స్టేషన్‌ను విస్తరించనున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా వన్‌టౌన్ వైపు 2, 3 అదనపు ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. దీంతో పాటు.. ప్రస్తుతం ఆర్ఈ కాలనీలో ఉన్న రైల్వే క్వార్టర్స్‌ను తొలగించి.. ఆ స్థలాన్ని కూడా అభివృద్ధికి వాడుకోనున్నారు. విజయవాడ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల్లో భాగంగా.. ఇక్కడ విమానాశ్రయంతో సమానమైన సౌకర్యాలు కల్పించనున్నారు.విజయవాడ స్టేషన్ 84 వేల చదరపు మీటర్లలో ఉంటుంది. ఆధునీకికరణలో భాగంగా రైల్లే స్టేషన్లో కొత్తగా 2, 3 ప్లాట్‌పారాలు రానున్నాయి. లిఫ్టల సంఖ్య 20కి పెరగనుండగా.. ఎస్కెలెటర్ల సంఖ్య 15కు పెరగనుంది. 3 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. ఇందుకు గాను సుమారు రూ.661.11 కోట్లు ఖర్చు అవుతుందని భావిస్తున్నారు.ప్రయాణికుల కు మెరుగైన సేవలు అందించడమే ఈ ఆధునికీకరణ ముఖ్య ఉద్దేశ్యం అంటున్నారు అధితకారులు. స్టేషన్‌ను మరింత విశాలంగా, ఆధునికంగా మార్చడం ద్వారా ప్రయాణ అనుభవాన్ని మెరుగుపరచాలని రైల్వే అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

# ఆక్రమణలు తొలగించిన హైడ్రా



**రాజేంద్రనగర్, జనవరి, 24 :** సర్కిల్ పరిధిలోని బద్వేల్, ఉప్పర్ పల్లి గ్రామాల్లోని జనచైతన్య లేఔట్ ఫేజ్ 1, 2లలో ఆక్రమణలకు గురైన 4 పార్కు స్థలాలకు హైడ్రా విముక్తి కల్పించింది. 19878 గజాల భూమిని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుంది. దీని విలువ రూ.139 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. దాదాపు 120 ఎకరాల్లో ఫేజ్  పేరుతో హుడా అప్రూవల్ తో ఏర్పాటు చేసిన జనచైతన్య లేఔట్ లో పార్కులు కబ్జాకు గురి అవుతున్నాయని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యా దులు అందాయి. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం కబ్జాలు జరిగినట్టు హైడ్రా నిర్ధారించింది. ఈ మేరకు  కబ్జాలను తొలగించింది. ప్రహరీలు నిర్మించుకొని వేసిన షెడ్డులను , రూమ్ లను హైడ్రా తొలగించింది. 3 వేలు, వెయ్యి గజాలు, అయిదు వందల గజాల చొప్పున ఆక్రమించి నిర్మించిన షెడ్డులను నేలమట్టం చేసింది. ఆక్రమణల తొలగింపు తర్వాత వెను వెంటనే ఫెన్సింగ్ నిర్మాణ పనులు చేపట్టింది.

# నిరుపేద మహిళకు చేయూత..

**కమ్మర్ పల్లి, జనవరి, 24 :** మండల కేంద్రానికి చెందిన నిరుపేద మహిళ సంపంగి మాధురికి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో  కుట్టు మిషన్ అందజేసినట్లు లైన్స్ క్లబ్ అధ్యక్షుడు లుక్క గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాధురి భర్త బాలరాజ్ మరణించడంతో ఇద్దరు పిల్లలను పోషిస్తూ కుటుంబ భారాన్ని మోస్తుందని తెలిపారు. స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా ఇలాంటి మహిళలకు ఇస్తే స్వయం ఉపాధి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించడంలో ఆర్థికంగా చేదోడు వాదోడుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గంగాధర్, కోశాధికారి తెడ్డు రమేష్, ఉపాధ్యక్షుడు సున్నం మోహన్, కార్యవర్గ సభ్యులు నోముల నరేందర్, చింత ప్రదీప్, సుంకరి విజయ్, తదితరులు పాల్గొన్నారు.




# ముంచుకొస్తున్న మరో మహమ్మారి

**టోక్యో, జనవరి, 24 :**కరోనా మహమ్మారి తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఒక పెద్ద సంక్షోభం పొంచి ఉంది. జపాన్ ఇన్ఫ్లుఎంజా మహమ్మారిని ప్రకటించింది. వాస్తవానికి ఆ దేశంలో ఫ్లూ కేసుల సంఖ్య అకస్మాత్తుగా పెరిగింది. అందువల్ల ఈ వ్యాధిని ఎదుర్కోవడానికి మొదటి నుండి చర్యలు ప్రకటిం చారు. జపాన్‌లో 4,000 మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారు. చాలా చోట్ల పాఠశాలలు మూసివేశారు. జపాన్‌లో ఫ్లూ రోగులు కొత్త కాదు, కానీ ఈసంవత్సరం వారు పెరిగే సీజన్ కంటే చాలా ముందుగానే సమస్య తలెత్తింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. వ్యాప్తి సాధారణం కంటే ఐదు వారాల ముందుగానే వచ్చింది, ఇదిఆసియా అంతటా వైరస్ వ్యాప్తి నమూనాలో మార్పును సూచిస్తుంది.ముందు జాగ్రత్త చర్యగా వీలైనంత త్వరగా టీకాలు వేయించుకోవాలని ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ పౌరులను కోరింది. ఈ కేసుల ప్రారంభ పెరుగుదల ఆసుపత్రి వ్యవస్థలపై ఒత్తిడిని కలిగిస్తుందని వైద్యులు హెచ్చరించారు. దీనిని కాలానుగుణ ఫ్లూ వ్యాప్తి అని పిలుస్తున్నప్పటికీ, దాని తీవ్రత, సమయం భారతదేశంతో సహా ఇతర దేశాలకు హెచ్చరిక గంటలు లేవనెత్తాయి. ఎందుకంటే శీతాకాలం సమీపిస్తోంది, శ్వాసకోశ సమస్యలు పెరుగుతున్నాయి. అధికారుల ప్రకారం జపాన్‌లోని 47 ప్రిఫెక్చర్లలో 28 చోట్ల కేసుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా టోక్యో, ఒకినావా, కగోషిమాలో మరిన్ని కేసులు కనుగొన్నారు. అక్కడ 130కి పైగా పాఠశాలలు, పిల్లల సంరక్షణ కేంద్రాలు తాత్కాలికంగా మూసివేశారు. వైద్యుల ప్రకారం ఈ సంవత్సరం వ్యాప్తి అనేక కారణాల వల్ల మరింత తీవ్రంగా మారింది. ఇందులో ఫ్లూ వైరస్ విభిన్న జాతి కూడా ఉంది, ఇది మునుపటి కంటే శక్తివంతమైనదని చెబుతారు. అలాగే కోవిడ్-19 మహమ్మారి సమయంలో సంవత్సరాల తరబడి తక్కువ సంపర్కం కారణంగా రోగనిరోధక శక్తిలో హెచ్చుతగ్గులు కూడా కేసుల సంఖ్య పెరగడానికి ఒక కారణం. అదనంగా క్రమరహిత వాతావరణం కూడా వైరస్ వ్యాప్తిని పెంచుతోంది. వైద్యులు కూడా దీనికి కారణం ఫ్లూకు వ్యతిరేకంగా టీకాలు వేయడం తగ్గడమేనని ఆపాదించారు. మహమ్మారి తర్వాత చాలా మంది నిర్లక్ష్యంగా మారారు, వార్షిక ఫ్లూ వ్యాక్సిన్ తీసుకోవడానికి సమయం తీసుకోరు, దీనివల్ల వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ప్రస్తుతానికి ఇది జరిగే అవకాశం లేదు. ఎందుకంటే ఇది సీజనల్ ఇన్ఫ్లుఎంజా మహమ్మారి ఇది ప్రధానంగా ఊ3ఔ2 అనే జాతి వల్ల వస్తుంది, దీనిని అధ్యయనం చేశారు.

## అధికారంలో ఉన్నప్పుడు బిఆర్ఎస్ పార్టీ చేసిన తప్పులే ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి..



**హుజురాబాద్, జనవరి, 24 :**కరీంనగర్ పట్టణంలోని ఆర్.అండ్.బీ గెస్ట్ హౌస్ లో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు,హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ మీడియా సమావేశాన్నీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హరీష్ రావు మాట్లాడేవాన్ని అబద్ధాలే అని,అబద్ధాల పునాదుల మీద బీఆర్ఎస్ పార్టీ పుట్టిందని,నీటి పారుదల శాఖ మంత్రిగా పని చేసిన హరీష్ రావు కి కూలడానికి,కుంగిపోవడానికి తేడా తెలుస్తలేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.చెక్ డ్యాం కు అణువుకాని ప్రదేశాల్లో నిర్మించి వాటిని డబ్బుల కోసం కమీషన్ ల కోసం రైతులను ఇబ్బంది పెట్టారని అన్నారు.ఇదే బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాళేశ్వరం కుంగిపోతే కనీసం చూడ్డానికి కూడా పోనివ్వలేదని ఇప్పుడు స్వేచ్ఛగా కూలిన ప్రదేశానికి వెళ్లగలుగుతున్నారని అన్నారు.కాళేశ్వరం కూలిన తరువాత ఎందుకు మరమ్మతు పనులు కొనసాగించలేదని,మీ తప్పిదాలు ఎదుట వారి మీద రుద్దడం సహజమయ్యిందని అన్నారు.జమ్మికుంట మండల పరిధిలోని తనుగుల గుంపుల చెక్ డ్యాం ఇప్పుడే ఏం కూలలేదని గతంలో కూడా కూలిందనీ,వాటి మరమ్మతుల కోసం తక్షణం నిధులు కేటాయిస్తున్నామని అన్నారు.ఆనాడు బి ఆర్ ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నేరేళ్ల ఘటనలో 3వ డిగ్రీ ప్రయోగించి,3,4 నెలలు జైల్లో ఉంచారని అన్నారు.వారి హయంలో ఏ రోజు నాణ్యతతో పని చేయలేదని,అప్పటి ఇసుక క్వారీల్లో సంతోష్ రావు కి వాటా లేదా అని ప్రశ్నించారు.జూబ్లీహిల్స్ ఎన్నికల్లో విషపు ప్రచారం చేసిన అక్కడి ప్రజలు సోషల్ మీడియాలో గెలిచారు కానీ బీఆర్ఎస్ పార్టీ ప్రజల మనసులను గెలవలేకపోయారని అన్నారు.

# హక్కులను హరించే కార్మిక కోడ్‌లు



**హైదరాబాద్, జనవరి, 24 :**కార్మికులకు తీపికబురు' అంటూ కేంద్ర ప్రభుత్వం ఈ నెల 22వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చిన 4 కార్మిక కోడ్‌ల లోగుట్టు అంతా శ్రామిక వ్యతిరేకతనే నిండి ఉన్నది. కాలం చెల్లిన పాత చట్టాలు మారుతున్న పారిశ్రామిక విధానాలకు, కొత్తతరహా ఉద్యోగులకు వర్తించేలా లేవని చెప్తూ కేంద్రం వీటిని ప్రవేశపెట్టింది. అయితే, ఎన్నో పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న హక్కులు, ప్రయోజనాలను తొలగించి ఈ కోడ్‌లను పూర్తిగా కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా రూపొందించడం జరిగింది. పారిశ్రామిక వర్గాలు సంతోషంగా స్వాగతిస్తుండగా కార్మిక సంఘాలు వ్యతిరేకించడంలోనే వీటి అసలు రంగు బయటపడుతున్నది. మన దేశంలో కార్మిక అంశం కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి జాబితాకు చెందినది. స్థానిక అవసరాలు, శ్రామిక ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని రాష్ట్రాలు సొంత కార్మిక చట్టాలు రూపొందించుకుంటాయి. ప్రభుత్వం, కార్మికసంఘాలు, యాజమాన్యం కలిసి చర్చించి త్రైపాక్షిక ఒప్పందం ద్వారానే చట్టం ఆకారాన్ని పొందుతుంది.

దేశంలో కార్మికుల ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వం 1942లో ఇండియన్ లేబర్ కాన్ఫెరెన్స్‌ను ఏర్పాటుచేసింది. లేబర్ పార్లమెంట్ ఆఫ్ ఇండియాగా పిలువబడే ఐఎల్‌సీ ప్రమేయాన్ని కూడా ఈ విషయంలో కేంద్రం ఖాతరు చేయలేదు. జూలైలో ఏర్పాటుచేసిన ఐఎల్‌సీ సమావేశంలో ప్రధాన కార్మిక సంఘాలు ఈ కొత్త కోడ్‌లపై తమ వ్యతిరేకతను తెలియజేశాయి. అదేదీ పట్టించుకోకుండా, రాష్ట్రాలను కూడా సంప్రదించకుండా కేంద్రం వీటి అమలు తేదీ ప్రకటించింది. వెంటనే వీటిపై డ్రాఫ్ట్ పాలసీ సిద్ధం చేసుకొమ్మని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీచేసింది. సెప్టెంబర్ 2020 నాటికే సిద్ధంగా ఉన్న ఈ కోడ్‌లను అదను చూసుకొని బీహార్ ఎన్నికల్లో విజయం ఊపులో బీజేపీ ప్రభుత్వం అమలుకు సిద్ధపడింది. వీటికి వేతనాల కోడ్, పారిశ్రామిక సంబం ధాల కోడ్, సామాజిక భద్రతా కోడ్, వృత్తిపర భద్రతా–ఆరోగ్యం –పని ప్రదేశాల్లో పరిస్థితుల కోడ్ అని పేర్లు పెట్టారు. ప్రస్తుతం ఉన్న 29 కార్మిక చట్టాల స్థానంలో ఇవి పనిచేస్తాయి. 4 వేతన చట్టాలు, 9 సామాజిక భద్రతా చట్టాలు, 9 వృత్తిపర భద్రతా, ఆరోగ్యం, పని చోట వసతుల చట్టాలు, 3 పారిశ్రామిక సంబంధాల చట్టాలు కలిపి 4కోడ్‌లుగా మార్చారు. అయితే, పాత చట్టాల స్థానంలో వచ్చిన కొత్త కోడ్‌లు ఏ విధంగా కార్మిక ప్రయోజనాలను కాలరాస్తాయో తె లుపుతూ కార్మిక సంఘాల నేతలు, విషయ నిపుణులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చుతు న్నారు. వీటిని కార్మిక వ్యతిరేక, యాజ మాన్యాల అనుకూల చట్టాలుగా వారు పేర్కొంటున్నారు.ఉద్యోగులను విధుల్లోంచి తొలగించడానికి అనుకూలంగా, యాజమా న్యాలతో చర్చలకు, సమ్మెలకు ఇవి ఆటంకంగా ఉన్నాయి. యజ మాని బానిస సంబంధాలను తిరిగి తెస్తున్నాయని, పారిశ్రామిక రక్షణను తొలగిస్తూ సంఘాల ఏర్పాటు, సామూహిక ఆందోళనలను అడ్డుకుం టాయని, ఎంతో పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలు నిరుపయో గమవుతాయని అంటున్నారు. వీటి అసలు ఉద్దేశం సంస్కరణ కాదు.

ఏకపక్షంగా, అప్రజాస్వామ్యంగా ఉన్న ఈ క్రూరమైన చట్టాలను అమలుచేయవద్దని వారు కోరుతున్నారు. న దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టాలని, పని ప్రాంతాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించాలని కార్మిక సంఘాలు ఇప్పటికే నిర్ణయించాయి. కేంద్రం తెచ్చిన ఈ కోడ్‌లు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికే ఆచరణలోకి వచ్చాయి. ఉద్యోగ తొలగింపు సమయంలో చెల్లించే సొమ్ము విషయంలో 100 బదులు 300 ఉద్యోగులున్న పరిశ్రమలకు కూడా ఉపశమనం లభిస్తున్నది. కొన్ని రాష్ట్రాల్లో మహిళలను రాత్రి వేళ పనికి అనుమతించాలని కంపెనీలు ఒత్తిడి తెస్తున్నాయి. ఓవర్ టైమ్ లిమిట్‌ను 50 గంటల నుంచి 125 గంటలకు పెంచారు. విశాలమైన ఫెడరల్ వ్యవస్థలో ఇలాంటి ఏకరూప కార్మిక చట్టాలు ఉపయోగపడవు.

స్థానిక అవసరాలు, కార్మికుల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రాలు చట్టాలను ఏర్పాటుచేసుకుంటాయి. పాత్రికేయుల వేతన సంబంధ ప్రత్యేక చట్టం వేతన కోడ్‌లో లుప్తమైందని జర్నలిస్టు లు ఆందోళన చెందుతున్నారు. ఇంకా ఎవరెవరి చట్టాలు ఈ సుడిగుండాల్లో ఎలా చిక్కుపడ్డాయో బయటపడాల్సి ఉన్నది. సెప్టెంబర్ 2020లో మోదీ ప్రభుత్వం తెచ్చిన 3 వ్యవసాయ చట్టాలను రైతులు తీవ్రంగా వ్యతిరేకించడం వల్ల 2021 నవంబర్‌లో వాటిని రద్దు చేస్తున్నట్టు ప్రకటిస్తూ మోదీ జాతికి క్షమాపణ చెప్పారు. ఇప్పుడు ఈ ఉత్పాతం కార్మికులపై పడింది. వారు ఏ స్థాయిలో తమ నిరసనను ప్రదర్శించి హక్కులు కాపాడుకుంటారో చూడాలి.

## పెన్షన్ కోసం మూడేళ్లుగా చనిపోయిన తల్లిలా వేషం వేసిన కొడుకు



**న్యూఢిల్లీ, జనవరి, 24 :** చనిపోయిన తల్లి పింఛను కోసం ఆమె అవతారం ఎత్తిన ఓ మోసగాడిని ఇటలీ పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. కొన్నేళ్లుగా తల్లి మారువేషంలో దాదాపు రూ. 80 లక్షలను అక్రమంగా ఆ వ్యక్తి ప్రభుత్వం నుంచి కొల్లగొట్టినట్లు బయటపడింది. హారర్ చిత్రాన్ని తలపించే ఈ వ్యవహారం అందరినీ నివ్వెరపోయేలా చేస్తున్నది. ఇటలీలోని బోర్గో వర్జిలియోలో నివసించే ఓ 56 ఏళ్ల మంటోవా గతంలో నర్సుగా పనిచేసేవాడు. స్థానిక రిజిస్ట్రీ కార్యాలయంలో తన తల్లి గ్రాజియెల్లా గుర్తింపు కార్డును రెన్యువల్ చేసేందుకు వెళ్లిన ప్రతిసారీ తన తల్లిలా కనిపించేందుకు తలకు విగ్గు, పెదవులకు లిప్‌స్టిక్, ముఖానికి మేకప్, 1970 దశకంలో ఉపయోగించే బ్లౌజు, పొడుగు స్కర్టు, నెయిల్ పాలిష్, పాతకాలం నాటి చెవిరింగులు ధరించేవాడు. మూడేళ్ల క్రితం ఆ వ్యక్తి తల్లి డాల్ ఓగ్లియో మరణించగా ఆ విషయాన్ని వెల్లడించకుండా ప్రతినెలా ఆమె పింఛనును వసూలు చేసుకునేవాడు. అలా రూ.80 లక్షలు వసూలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. తన తల్లి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించకుండా.. మమ్మీలా మార్చి ఇంట్లో భద్రపర్చాడు. అయితే పింఛను కోసం వచ్చిన వృద్ధురాలి రూపంలో ఏదో తేడా ఉన్నట్లు ముందుగా రిజిస్ట్రీ ఉద్యోగి గుర్తించాడు. ఆమె మెడ బలంగా ఉంది. ముఖంలో మడతలు వింతగా ఉన్నాయి. చేతులపైన చర్మం వృద్ధురాలి చర్మంలా లేదు. గొంతులో కొంత ఆడతనం ఉన్నప్పటికీ అప్పుడప్పుడు మగగొంతు వినిపించేది అని రిజిస్ట్రీ ఉద్యోగి చెప్పినట్లు బోర్గో వర్జిలియో మేయర్ ఫ్రాన్సెస్కో తెలిపారు. పింఛను ఫారాలు నింపాలని పిలిపించి తన తల్లి వేషంలో వచ్చిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు. తన నేరాన్ని అతను అంగీకరించినట్లు ఆయన తెలిపారు.

# ఖైరతాబాద్ కసరత్తు...

**హైదరాబాద్, జనవరి, 24 :**ఈసారి మునుపటి లెక్క కాదు. కంటోన్మెంట్ చేజారింది..జూబ్లీహిల్స్ మిస్ అయ్యింది. ఆ రెండు సిట్టింగ్ సీట్లలో సెంటిమెంట్ వర్కవుట్ కాలేదు. ఖైరతాబాద్ బై ఎలక్షన్ వస్తే మాత్రం ఎట్టి పరిస్థితుల్లో గెలిచి తీరాల్సిందేనని పట్టుదలతో ఉంది బీఆర్ఎస్. ఇక చేజారిన జూబ్లీహిల్స్ పక్కనే ఉన్న ఖైరతాబాద్‌కు కూడా ఉప ఎన్నిక ఖాయమన్న ప్రచారం ఊపందుకుంది. పార్టీ ఫిరాయింపుల ఎపిసోడ్‌లో ఖైరతారాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు తప్పదన్న చర్చ జరుగుతోంది. దానంపై వేటు పడటమో లేక అంతకంటే ముందే ఆయన రిజైన్ చేయడమో ఏదో ఒకటి పక్కా అని టాక్ వినిపిస్తోంది.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమితో తీవ్ర నిరాశలో ఉన్న బీఆర్ఎస్..కచ్చితంగా ఖైరతాబాద్‌లో గెలిచి తీరాలన్న కసితో ఉంది. అందుకోసం ఇప్పటి నుంచే కసరత్తు స్పీడప్ చేసింది. బలమైన అభ్యర్థి కోసం గులాబీ పార్టీ వేట మొదలుపెట్టింది. అధికార కాంగ్రెస్ నుంచి మళ్లీ దానం నాగేందర్ పోటీ చేస్తే ఒకలా..లేదంటే మరోలా రెండు ప్లాన్స్ రెడీ చేస్తోంది గులాబీదళం. దివంగత నేత పీజేఆర్‌కు ఖైరతాబాద్ లో అభిమానులు ఉండటంతో..ఆయన తనయుడు, జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ ను రంగంలోకి దించాలని అనుకుంటోందట బీఆర్ఎస్.ఒకసారి ఖైరతాబాద్ నుంచి, నియోజకవర్గాల పునర్విభజన తర్వాత జూబ్లీహిల్స్ నుంచి మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన విష్ణు..2023లో టికెట్ దక్కకపోవడంతో కారెక్కారు. మొన్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో విష్ణు టికెట్ ఆశించినా.. మాగంటి గోపీనాథ్ భార్య సునీతనే పోటీలో పెట్టారు గులాబీ బాస్ కేసీఆర్. కాబట్టి ఇప్పుడు ఖైరతాబాద్ ఉపఎన్నిక వస్తే విష్ణును పోటీ చేయిస్తే..పీజేఆర్ తనయుడిగా ఇప్పటికే ఆయనకున్న ఫాలోయింగ్‌తో ఖైరతాబాద్ లో దానం నాగేందర్‌కు గట్టి పోటీ ఇస్తాడని నమ్ముతోంది గులాబీ పార్టీ.ఇదే సమయంలో బీఆర్ఎస్ లో ఖైరతాబాద్ టికెట్ ను పలువురు ఆశిస్తున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి 2014లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిన మన్నె గోవర్ధన్ రెడ్డి తనకే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారట. ఒకవేళ తనకు టికెట్ ఇవ్వకపోతే తన భార్య మన్నె కవితకు ఛాన్స్ ఇవ్వాలని అడుగుతున్నారు. ప్రస్తుతం ఖైరతాబాద్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ గా ఉన్నారు మన్నె కవిత. 2018, 2023 రెండుసార్లు బీఆర్ఎస్ దానం నాగేందర్‌కు టికెట్ ఇస్తే సీటు త్యాగం చేసి సహకరించాన ని..ఈసారి తనకు, లేకపోతే తన భార్య మన్నె కవితకు టికెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారట మన్నె గోవర్ధన్‌రెడ్డి.మరోవైపు ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కూడా గతంలో ఎరు కూడా బీఆర్ఎస్ పరిశీలిస్తోంది. వీరితో పాటు మరికొందరు నేతలు ఖైరతాబాద్ బీఆర్ఎస్ టికెట్ రేసులో ఉన్నారని..పార్టీ ముందు తమ ప్రతిపాదన పెట్టారని అంటున్నారు. దీంతో ఖైరతాబాద్ నుంచి ఎవరిని బరిలోకి దింపాలని బీఆర్ఎస్ ఆలోచనలో పడింది. జూబ్లీహిల్స్ మాదిరి కాకుండా ఈసారి ఖైరతాబాద్ లో కచ్చితంగా గెలిచి తీరాలన్న పట్టుదలతో ఉన్న గులాబీ పార్టీ..బలమైన అభ్యర్థి కోసం వడపోస్తోందట.

# ఏపీలో మ్యాజిక్ డ్రెయిన్స్

**హైదరాబాద్, జనవరి, 24 :**పల్లెల్లో మురుగునీటి వ్యవస్థను సక్రమంగా నిర్వహించేం దుకు మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 106 గ్రామ పంచాయతీలలో మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించనున్నారు. తొలివిడతగా 59 కిలోమీటర్ల మేరకు ఈ మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం జరగనుంది. తక్కువ ఖర్చు, దుర్వాసన లేకపోవటం, మెరుగైన నిర్వహణ వంటి కారణాలతో ప్రభుత్వం సిమెంట్ డ్రెయిన్ల బదులుగా మ్యాజిక్ డ్రెయిన్ల వైపు మొగ్గ చూపుతోంది. ఏపీలో ఇప్పటికే కొన్నిచోట్ల వీటి నిర్మాణం జరిగింది. అక్కడ మంచి ఫలితాలు వస్తూ ఉండటంతో మరికొన్ని చోట్ల నిర్మిం చనున్నారు.పల్లెలలో పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్ర వాతావరణం ఏర్పాటు చేసే దిశగా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా రాష్ట్రంలోని 106 గ్రామ పంచాయతీలల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టనుంది. గ్రామీణా భివృద్ధి శాక చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్ ఈ విషయాన్ని వెల్లడించారు. 106 గ్రామపం చాయతీల పరిధిలో 59 కిలోమీటర్ల మేరకు మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించనున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామాలలో మురుగునీటి వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలని భావిస్తున్న ఏపీ ప్రభుత్వం.. అందులో భాగంగానే మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టనుంది. పైలెట్ ప్రాజెక్టు కింద ఇప్పటికే మ్యాజిక్ డ్రెయిన్లు ఏర్పాటు చేశారు. ఇవి సత్ఫలితాలు ఇస్తూ ఉండటంతో 106 గ్రామపంచాయతీలలో వీటిని నిర్మించాలని భావిస్తున్నారు. తొలి విడతగా 59 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. మూడు నెలల తర్వాత మ్యాజిక్ డ్రెయిన్లను పూర్తిస్థాయిలో అమలు చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు భావిస్తున్నారు. మరోవైపు మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మురుగునీటి సమస్యలకు.. తక్కువ ఖర్చుతో సమర్థవంతమైన పరిష్కారం లభిస్తుందని అధికారులు చెప్తున్నారు. అలాగే దుర్వాసన, దోమలు, కాలుష్యం వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చని భావిస్తున్నా రు. ఇక ఆర్థికంగానూ ఇది మంచి పరిష్కారం కానుంది. ఒక కిలోమీటర్ మేరకు సిమెంట్ డ్రెయిన్ నిర్మించాలనే సుమారుగా రూ. 50 లక్షలు ఖర్చు అయితే.. ఈ మ్యాజిక్ డ్రెయిన్లు అయితే రూ.7.5 లక్షలకే పూర్తవుతుందని అధికారులు చెప్తున్నారు. అలాగే మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి తక్కువ స్థలం సరిపోతుంది. మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వచ్చే అవకాశం ఉండదు.మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణం కోసం తొలుత 2 అడుగుల లోతు, అరమీటర్ వెడల్పు ఉండేలా ఓ కాలువను తవ్వుతారు. అందులో తొలుత అడుగు మేర కొండరాయితో నింపుతారు. దానిపైపొరలో గులకరాళ్లు 8అంగుళాల మేర నింపుతారు. దాని మీద కంకర రాళ్లు 4 అంగుళాల మేరప రుస్తారు. చివరిగా గండ్ర ఇసుక పోస్తారు. ఇలా మూడు పొరలతో ఈ మ్యాజిక్ డ్రెయిన్ నిర్మిస్తారు. డ్రెయిన్ మధ్యలో 50 మీటర్లకు ఓసారి ఇంకుడు గుంత ఏర్పాటు చేస్తారు.

## ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

**హైదరాబాద్, జనవరి, 24 :** రాసబత్తుల ప్రసాద్ అనే వ్యక్తిని తేదీ 21 నాడు సాయంత్రం పూట 108 అంబులెన్స్ ద్వారా మంద మర్రి నుండి మంచిర్యాలలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆ తర్వాత ఆ వ్యక్తికి సంబంధించిన వారు ఎవరు కూడా ఆస్పత్రికి వెళ్లలేదు. తన అనారోగ్యానికి చికిత్స పొందుతూ ఈరోజు మంచిర్యా లలోని ప్రభుత్వాసుపత్రిలో మరణించాడు. ఈ వ్యక్తి గురించి సమాచారం తెలిసినవారు, మందమర్రి పోలీసులకు సమాచారం అందించగలరు. ఎస్ఐ మందమర్రి 8712656570 ప్రస్తుతం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహం ఉంది.

# స్కిన్ క్రీమ్ రూపంలో ఇన్సులిన్!

**ఎలుకలు, పందులపై ప్రయోగం విజయవంతం**

**ఐదు నుంచి పదేండ్లలో మధుమేహ రోగులకు అందుబాటులోకి**



**హైదరాబాద్, జనవరి, 24 :**మధుమేహ రోగులు కొందరు రోజుకు మూడుసార్లు కూడా ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకోవాల్సి వస్తుంది. వీరి బాధకు శాస్త్రవేత్తలు గొప్ప ఉపశమనాన్ని కనుగొన్నామని చెప్తున్నారు. ఇన్సులిన్‌ను శరీరానికి రాసుకొనే స్కిన్ క్రీమ్ రూపంలో రూపొందించా మని అంటున్నారు. ఈ నూతన ఆవిష్కరణకు సంబంధించిన వివరాలు 'నేచర్' పత్రికలో ఇటీవల ప్రచురితమయ్యాయి. ఈ పాలిమర్ ఇన్సులిన్ చర్మం ద్వారా రక్త ప్రవాహంలోకి దూసుకెళ్లగలదని అంటున్నారు. పరిశోధన సందర్భంగా ఎలుకలు, పందులపై ఈ స్కిన్‌క్రీమ్‌ను ప్రయోగించినప్పుడు.. వాటి శరీరంలో చక్కెర స్థాయి తగ్గిపోయిందని తెలిపారు. ఇంజెక్షన్లు చేసే పనిని ఈ స్కిన్‌క్రీమ్ విజయవంతంగా పూర్తి చేసిందని, పైగా వాటి చర్మానికి దురద వంటి సమస్యలు రాలేదని పేర్కొన్నారు. ఎంతో సురక్షితమైన ఈ స్కిన్‌క్రీమ్‌తో శరీరంలో చక్కెర స్థాయిని తగ్గించవచ్చని వివరించారు. క్లినికల్ ట్రయల్స్ గనుక త్వరగా ప్రారంభమై.. ప్రయోగాలు స్థిరంగా ముందుకు సాగితే.. ఐదు నుంచి పదేండ్ల వ్యవధిలో ఈ స్కిన్ క్రీమ్ ఔషధ దుకాణాల్లో అందుబాటులోకి వస్తుందని వివరించారు.

# 20 నెలల క్రితమే ముగిసిన కాలపరిమితి

**హైదరాబాద్, జనవరి, 24 :** 2024 ఫిబ్రవరి ఒకటితో పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. రాజ్యాంగంలోని 243(3) (ఏ) ఆర్టికల్ ప్రకారం పంచాయతీ రాజ్ సంస్థల ఎన్నికలను ఐదేళ్ల పదవీ కాలం ముగిసేలోపే నిర్వహించాల్సి ఉంటుంది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 14(2) ప్రకారం.. పంచాయతీ పాలకవర్గ పదవీకాలం ముగియడానికి మూడు నెలల్లోగా ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేస్తున్నది. పాలకవర్గాల గడువు పూర్తి కావడంతో సర్పంచ్ ఎన్నికలను నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లను వెంటనే చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల సంఘంగతేడాది డిసెంబర్ 14న రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసింది. కానీ, ఆచరణలో మాత్రం ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించింది.

# యూరప్ నుంచి యూటర్న్!



ప్రయాణాలు అత్యంత ఆహ్లాదకరంగా సాగుతాయి. పొగమంచుతో నిండిపోయే హిల్ స్టేషన్లు.. వెండిరంగులో మెరిసే మంచు పర్వతాలు యాత్రికులను రా రమ్మని పిలుస్తుంటాయి. ఇక మంచు దుప్పటి కప్పుకొన్న కొండలపై స్కీయింగ్, స్నోబోర్డింగ్ లాంటి సాహస క్రీడలు.. అంతులేని థ్రిల్‌ను పంచుతాయి. అయితే, ఇలాంటి యాత్రలు చేయాలంటే.. చాలామంది 'యూరప్ ట్రిప్' వెయ్యాల్సిందే అంటారు. కానీ, మన దేశంలోనూ అ: తకుమించిన అనుభూతుల్ని అందించే అందమైన పర్యాటక కేంద్రాలెన్నో ఉన్నాయి. సిమ్లా (హిమాచల్ ప్రదేశ్): స్విస్ గ్రామీణ ప్రాంతాలే కాదు.. మన సిమ్లా కూడా భూతల స్వర్గమే! మంచుతో నిండిపోయే రోడ్లు, చెక్క కుటీరాలు, దట్టమైన దేవదారు అడవులు.. స్విట్జర్లాండ్‌ను తలపిస్తాయి. ఇక ఇక్కడి వలసరాజ్యాల కాలం నాటి వారసత్వ భవనాలు.. ఆ పాత చారిత్రక వాతావరణాన్ని కళ్లకు కడతాయి. ముఖ్యంగా, శీతాకాలంలో ఈ ప్రాంతమంతా పొగమంచుతో ఆహ్లాదకరంగా
మారుతుంది. ఆకర్షణీయమైన యురోపియన్ స్పర్శను అందిస్తుంది.

ప్రక ృతి సౌందర్యం, సాహస క్రీడలు, స్కీయింగ్, స్కేటింగ్, యాక్, పోనీ సవారీలకు సిమ్లా ప్రసిద్ధి. ఇక్కడికి 15 కి.మీ. దూరంలోని కుఫ్రీ కూడా అదుతేమైన సందర్శన స్థలమే! ఇక్కడ 'కుఫ్రీ ఫన్ వరల్డ్ వైల్డ్‌లైఫ్ జూలో మంచు చిరుత పులులు, యాక్ వంటి జంతువులను వాటి సహజ ఆవాసాలలో చూడవచ్చు.

గుల్మార్గ్ (జమ్మూ – కశ్మీర్): మంచు పర్వతాల్లో సందడి చేయడానికి ఆల్ప్స్ పర్వతాలే అవసరం లేదు. అంతకుమించిన హిమాలయాలు మన చెంతనే ఉన్నాయి. ఈ శీతాకాలంలో జమ్మూకశ్మీర్‌లోని గుల్మార్గ్‌కు ప్రయాణం కట్టండి. తెల్లటి మంచు దుప్పటి కప్పుకొన్న పర్వతాలు, పైన్ అడవులు.. ఆల్ప్స్ అందాలను మించిన అనుభూతిని అందిస్తాయి. ఇక్కడి మంచు కూడా మందంగా, నిర్మలంగా ఉంటుంది. స్కీయింగ్, స్నోబోర్డింగ్, మౌంటెన్ బైకింగ్, ట్రెక్కింగ్ వంటి సాహసయాత్రికులకు గుల్మార్గ్ స్వర్గధామమే! ఇక్కడి గండోలా రైడ్.. ప్రపంచంలోనే ఎత్తయిన కేబుల్ కార్లలో ఒకటి.

ఔలీ (ఉత్తరాఖండ్): ప్రశాంతమైన పచ్చిక మైదానాలలో సేదతీరేందుకు ఆస్ట్రియా వెళ్దామని ఆలోచిస్తున్నారా వెంటనే విరమించుకోండి. ఉత్తరాఖండ్‌లోని 'ఔలీ'ని సందర్శిస్తే.. 'ఔరా!' అనాల్సిందే! ఇక్కడి ఎత్తయిన పర్వతాలు, పచ్చికబయళ్లు. ఆస్ట్రియాలోని ప్రశాంతమైన శీతాకాలపు గ్రామాలను గుర్తుకు తెస్తాయి. ఇక్కడికి ప్రయాణం కట్టేస్తే.. హిమాలయ శిఖరాల మధ్య స్కీయింగ్, ట్రెక్కింగ్‌లాంటి సాహసయాత్రలతోపాటు పచ్చిక మైదానాల్లో ప్రశాంతతనూ ఆస్వాదించొచ్చు. స్కీయింగ్, కేబుల్ కార్ (రోప్‌వే), రైడ్ చైర్ లిఫ్ట్, నందా దేవి, కామత్ పర్వతాలు.. అదుతేమైన అనుభూతుల్ని పంచుతాయి. అందుకే.. ప్రొఫెషనల్ స్కీయర్లతోపాటు ఔత్సాహికులూ ఔలీని వాచ్‌లిస్ట్‌లో తప్పకుండా చేర్చుకుంటారు.

# ఫ్యూచర్ సిటీకి విపరీతమైన క్రేజ్



**హైదరాబాద్, జనవరి, 24 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ.. దేశంలో మరే ఇతర కొత్త నగర నిర్మాణానికి దక్కని అరుదైన ప్రాముఖ్యతను దక్కించుకుంది. 13,500 ఎకరాల్లో సువిశాలంగా రూపుదిద్దుకోనున్న ఈ నగరం, కేవలం రెండు రోజుల తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025 విజయ ంతోనే ప్రపంచ పారిశ్రామిక పటంలో కీలక గమ్యస్థానంగా నిలిచింది. ఈ సమ్మిట్‌లో 44 దేశాల ప్రతినిధులు హాజరు కావడం, రూ.5.7 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు జరగడం ఫ్యూచర్ సిటీ పట్ల ఇన్వెస్టర్ల విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది.దేశంలో ఇప్పటికే అనేక స్మార్ట్ సిటీలు, కొత్త నగరాల నిర్మాణ ప్రతిపాదనలు దశాబ్దాలుగా కేవలం కాగితాలకే పరిమితమైన సందర్భాలు ఉన్నాయి. కానీ భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి వేదికగా గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించడం అనేది సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ దార్శనికత, కార్యాచరణ వేగానికి నిదర్శనం అని పలువురు అభిప్రాయపడుతున్నారు. సమ్మిట్ ముగిసిన వెంటనే ఫ్యూచర్ సిటీ కార్యరూపం దాల్చడానికి మార్గం సుగమమైంది. మౌలిక సదుపాయాలు, డీప్ టెక్, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్,ఫ్మా, ఎంటర్టైన్మెంట్, డిఫెన్స్, ఏఐ వంటి రంగాలకు లక్షల కోట్ల పెట్టుబడులు తరలివస్తున్నా యి. ఈ ప్రాంతాన్ని నివాస కేంద్రంగా, వ్యాపార, పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది.భార త్ ఫ్యూచర్ సిటీ నగరాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, హెల్త్ సిటీ, ఎంటర్‌టైన్‌మెంట్, క్రీడలు, డేటా సెంటర్స్, అంతర్జాతీయ స్థాయి ఉన్నత విద్యా సంస్థల జిల్లాలుగా మొత్తం ఆరు విభాగాలుగా నిర్మించ నున్నారు. ముఖ్యమైన నిర్మాణ ప్రక్రియలో భాగంగా డేటా సెంటర్ల కోసం 400 ఎకరాలు కేటాయిం చారు, వచ్చే ఫిబ్రవరి చివరిలో నిర్మాణాలు ప్రారంభం కానున్నాయి. ఇక మరో నెల రోజుల్లో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కార్యక్రమాలు మొదలవుతా యి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షల మేరకు ఈ 13,500 ఎకరాల నగరాన్ని జీరో కార్బన్ సిటీగా రూపొందించే లక్ష్యంతో.. నగరం అంతటా అర్బన్ ఫారెస్ట్‌లు, రెయిన్ హార్వెస్టింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు. లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఫార్మా, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో పరిశోధన, మ్యాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాలు ఇక్కడ ఉంటాయి. ఈ నగరం సమగ్ర జీవన కేంద్రంగా ఉండనుంది. ఇక్కడ 13 లక్షల మందికి ఉద్యోగాలు, 9 లక్షల జనాభా కోసం నివాస సముదాయాలు ఏర్పాటవుతాయి. అంతేకాకుండా రిలయన్స్ ఫౌండేషన్ వంతారతో వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం ఏర్పాటుతో పాటు ఎంటర్‌టైన్‌మెంట్ డిస్ట్రిక్ట్‌లో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్లు, స్టార్ హోటళ్లు, రేసింగ్ ట్రాక్‌లు వంటి వినోద, క్రీడా సౌకర్యాలు కూడా అందుబాటులోకి రానున్నాయి. భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం అద్భుతమైన మౌలిక వసతులు, అత్యాధునిక రవాణా వ్యవస్థలతో ఒక ఆర్కిటెక్చరల్ అద్భుతంగా నిలవనుంది. సమ్మిట్ విజయం తర్వాత దేశంలో ఏ కొత్త నగరానికి దక్కని ప్రాముఖ్యత ఈ ప్రాజెక్ట్‌కు దక్కింది. ఇది తెలంగాణ విజన్–2047 లక్ష్యాలకు అనుగుణంగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దడంలో ఫ్యూచర్ సిటీ కీలక పాత్ర పోషించనుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# మళ్లీ విస్తరణ ఆశలు...


**అదిలాబాద్, జనవరి, 24 :** ఉన్నది రెండు క్యాబినెట్ బెర్తులు. ఎంతోమంది ఆశావ హులు. మరెన్నో క్యాస్ట్ ఈక్వేషన్స్. అయినా తన లెక్కలు తనకు ఉన్నాయంటున్నారు ఓ ఎమ్మెల్యే. ఎంబీసీ కోటాలో తనకు మినిస్ట్రీ పక్కా అని ధీమాగా ఉన్నారట. ఐయామ్ మోస్ట్ ఎలిజిబుల్ పర్సన్ అంటూ.. ఓ రేంజ్‌లో హోప్స్ పెట్టుకుని హైప్ క్రియేట్ చేస్తున్నారు. ఇంతకు ఎవరా ఎమ్మెల్యే ఆయనకు అమాత్య యోగం అంత దగ్గరలో ఉందా రెండో సారి క్యాబినెట్ విస్తరణపై ఆ ఎమ్మెల్యే ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఎంబీసీ కోటా.. డిస్ట్రిక్ ఈక్వేషన్స్ ఎలా ఎన్నో లెక్కలు వేసుకున్నా.. అప్పట్లో జస్ట్ మిస్. అయినప్పటికి పట్టు వదలని విక్రమార్కుడిలా అలుపెరగని ప్రయత్నాలు చేస్తున్నారు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్. ఇంకా మంత్రి వర్గంలో రెండు బెర్తులు ఖాళీగా ఉండటంతో..ఎంబీసీ కోటాలో ఛాన్స్ కోసం పట్టుబడుతున్నారట. రెండో విడత మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కించుకోవాలనే ఆశతో సౌత్ టు నార్త్ ఎఫర్ట్స్ పెట్టినప్పటికీ ఫలితం దక్కలేదట.అయితే సామాజిక సమీకరణల నేపథ్యంలో ఇరుగు పొరుగు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మంత్రులయ్యారు కానీ..మక్కాన్ సింగ్ కోరిక నెరవేర లేదు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలలో మోస్ట్ బ్యాక్ వర్డ్ క్యాస్ట్ ఎమ్మెల్యేగా మక్కాన్ సింగ్ ఒక్కరే ఉన్నారు. మొదటి నుంచి ఎంబీసీ కోటాలో తనకు బెర్త్ దక్కడం ఖాయమని భావించిన ఆయనకు.. జిల్లా ఈక్వేషన్స్ మాత్రం అడ్డంకిగా మారుతు న్నాయట. ఇప్పటికే ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి ముగ్గురు మంత్రు లు కేబినెట్ లో ఉండటంతో ఆయనకు ఛాన్స్ దక్క లేదు. అయితే నెక్స్ట్ విస్తరణలో మాత్రంజిల్లా నుండి ఓ మంత్రిని తప్పించైనా మక్కాన్ సింగ్ కు బెర్త్ ఖాయమనే చర్చ జోరుగాసాగుతోం ది.2014, 2018లో రెండుసార్లు రామగుండం నుంచి పోటీ చేసి ఓడిన మక్కాన్ సింగ్.. 2023 ఎన్నికల్లో మాత్రం గెలుపొందారు. దివంగత సీఎం రాజశేఖర్ రెడ్డి హయంలో మక్కాన్ సింగ్ కు శాప్ ఛైర్మన్ పదవి దక్కింది. రాజశేఖర్ రెడ్డికే కాదు ఏపీ మాజీ సీఎం జగన్ తోసత్సంబంధాలున్న ప్పటికి మారిన రాజకీయ పరిణామాల తో ఆశించిన పదవులు ఆమడ దూరమయ్యాయి. ఇప్పుడు ఎమ్మెల్యేగా విజయం సాధించడం, పార్టీ అధికారంలో ఉండడంతో..ఎంబీసీ స్లోగన్ కలిసి వస్తుందనుకున్నారు. మొదట విడతలో బీసీ కోటలో పొన్నం ప్రభాకర్, కొండా సురేఖకు మంత్రి పదవులు దక్కగా..రెండో విడత క్యాబినెట్ విస్తరణలో వాకిటి శ్రీహరి మంత్రి అయ్యారు. ఎంబీసీ కోటాను పరిగణలోకి తీసుకుంటే తనకు మినిస్టర్ పదవి దక్కుతుంద నేది మక్కాన్ సింగ్ నమ్మకం. క్యాబినెట్ లో మొత్తం 18మందికి అవకాశం ఉండగా..సీఎంతో కలిసి 16మందితో క్యాబినెట్ కొనసాగు తుంది. మొదటి విడతలో 11 మందిని, రెండో విడతలో ముగ్గరికి క్యాబినెట్ లో బెర్త్ లు దక్కాయి. జూబ్లీహిల్స్ ఎన్నికలకు ముందు అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడంతో మరో రెండు ఖాళీలు మాత్ర మే మిగిలి ఉన్నాయి. మిగిలిన రెండింట్లో ఓ ఛాన్స్ ఇవ్వాలంటున్నా రట మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్. పార్టీకి వీర విధేయుడిగా పని చేయడమే కాదుసామా జిక పరంగా చూసుకున్నా మోస్ట్ ఎలిజిబుల్ పర్సన్ అంటున్నారట. సీఎంరేవంత్ రెడ్డికి సన్నిహి తుడేకాదు.రాహుల్ గాంధీతో మంచి సంబంధాలున్నాయి.ఇక అమాత్య పదవి దక్కితే మాత్రం మొదటి మంత్రిగా రామగుండం పొలిటికల్ హిస్టరీలో మిగిలి పోనున్నారు. కాబట్టి మక్కాన్ మంత్రి పదవి కోసం మాములుగా ట్రై చేయడం లేదట. అయితే అమాత్య రేసులోఉన్న మక్కాన్ సింగ్ కు రెండోసారి పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడి పదవి దక్కింది. డీసీసీ ప్రెసిడెంట్ పోస్ట్ వచ్చినా తన సీనియారిటీకి తగ్గ పదవి ఇవ్వలేదనే అసంతృప్తితో ఉన్నారట ఎమ్మెల్యే.

# డివిజన్ల పునర్విభజన షురూ!

**హైదారబాద్,జనవరి, 24 :** ఎల్బీనగర్ నియోజకవర్గంలో డివిజన్ల పునర్విభజనతో నూతన డివిజన్ల ఏర్పాటుతో పాటు రాజకీయ వర్గాల్లో నూతనోత్సాహం కనిపిస్తుంది. జీహెచ్ఎంసీలో శివారు ప్రాంతాలను విలీనం చేసిన అనంతరం నూతన డివిజన్లను వాటి పేర్లలో ప్రాథమిక నోటిఫికేషన్ ప్రకటించారు. కాగా, ఎల్బీనగర్ జోనల్ లోని హయత్ నగర్, ఎల్బీనగర్, సరూర్ నగర్ సర్కిళ్ల పరిధిలోని
డివిజన్లను పునర్విభజన చేశారు.నూతనంగా 9 నూతన డివిజన్లు ఏర్పాటు కాబోతున్నాయి. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని మూడు సర్కిళ్లలో ఇప్పటివ రకు మొత్తం 13 డివిజన్లు ఉండగా, వాటి స్థానంలో మొత్తం 22 డివిజన్లు రానున్నాయి. నూతన డివిజన్ల ఏర్పాట్లపై అభ్యం తరాలు, సలహాలు, సూచనలు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు కోరుతున్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో ఇప్పటివరకు 11 డివిజన్లు ఉన్నాయి.

ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 11 డివిజన్లు ఉన్నాయి. వీటికి అదనంగా నూతనం గా 7డివిజన్లు ఏర్పాటు చేయడంతో మొత్తంగా 18డివిజన్లు ఏర్పాటు కానున్నాయి. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో ఉన్న మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన సరూర్ నగర్, ఆర్కేపురం డివిజన్లను సైతం పునర్విభజన చేశారు. రెండు డివిజన్ల స్థానం లో మరో రెండు డివిజన్లు ఏర్పాటు చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం జీహెచ్ఎంసీ జోనల్ పరిధిలో ఇప్పటి వరకు మూడు సర్కిళ్ల ఉన్నాయి. వీటిలో హయత్ నగర్, ఎల్బీనగర్, సరూర్ నగర్ సర్కిళ్లు ఉన్నాయి. హయత్ నగర్ సర్కిల్ పరిధిలో నాలుగు డివిజన్లు నాగోల్, మన్సూరాబాద్, హయత్ నగర్, బీఎన్ రెడ్డి నగర్ డివిజన్లు ఉన్నాయి. ఎల్బీనగర్ సర్కిల్ లో ఇప్పటివరకు వనస్థలిపురం, హస్తినాపురం, చంపాపేట, లింగోజిగూడ డివిజన్లు ఉన్నాయి.సరూర్ నగర్ సర్కిల్ లో ఇప్పటివరకు కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం, సరూర్ నగర్, ఆర్కే పురం డివిజన్లు ఉన్నాయి. మూడు సర్కిళ్ల పరిధిలోని డివిజన్లను పునర్విభజన చేసి, కొత్తగా ఎనిమిది డివిజన్లు ఏర్పాటు చేశారు. సరూర్ నగర్ సర్కిల్ పరిధిలోని కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం డివిజ న్లను యథావిధిగా ఉంచారు. అయితే, మహేశ్వరం నియోజకవర్గంలోని సరూర్ నగర్ డివిజన్ ను విభజించి డాక్టర్స్ కాలనీ పేరుతో కొత్త డివిజన్, రామకృష్ణాపురం డివిజన్ ను విభజించి ఎన్టీఆర్ నగర్ పేరుతో నూతన డివిజన్ ఏర్పాటు చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఎల్బీనగర్ సర్కిల్ లో ఉన్న చంపాపేట డివిజన్ విభజించి నూతనంగా కర్మన్ ఘాట్, హస్తినాపురం డివిజన్ నుంచి బైరామల్ గూడ, వనస్థలిపురం డివిజన్ నుంచి చింతలకుంట,నాగోల్ డివిజన్ నుంచి సాయినగర్, మన్సూరా బాద్ డివిజన్‌నుంచి లెక్చరర్స్ కాలనీ, హయత్ నగర్ డివిజన్ నుంచి హైకోర్టు కాలనీ, బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ నుంచి సాహెబ్ నగర్ డివిజన్లను ఏర్పాటుచేశారు. తాజాగా ఎల్బీనగర్ నియోజకవ ర్గంలో7 డివిజన్లు, మహేశ్వరం నియోజకవర్గంలో 2 నూతన డివిజ న్లు ఏర్పాటు చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని సరూర్ నగర్‌సర్కిల్ పరిధిలోని కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం డివిజన్లను యథావిధిగా ఉంచారు. నియోజకవర్గంలోని డివిజన్ల పునర్విభజనతో రాజకీయ పార్టీలో నూతనోత్తేజం కనిపిస్తుంది. సుమారు 40 వేల జనాభాకు ఒక డివిజన్ ఏర్పాటు చేస్తుండడంతో కొత్తవారికి రాజకీయ రంగ ప్రవేశం లభిస్తుంది.

# పేకాట స్థావరం.. డ్రోన్ నిఘాతో బహిర్గతం



**అనంతపురం, జనవరి, 24 :** అనంతపురం జిల్లా పోలీసులు వినూత్న విధానాలను అవలంబిస్తున్నారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు, ముఖ్యంగా పేకాట స్థావరాలపై ఉక్కుపాదం మోపేందుకు పోలీసులు సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. అందులో భాగంగా రాయదుర్గం మండలం గొల్లలదొడ్డి గ్రామ శివారు ప్రాంతంలో శుక్రవారం యదేచ్ఛగా జరుగుతున్న పేకాట స్థావరాన్ని పోలీసులు డ్రోన్ సహాయంతో గుర్తించారు. గుర్తించడమే కాకుండా పేకాట ఆడుతున్న వారిపై మెరుపు దాడి చేశారు. పోలీసుల ఈ వినూత్న నిఘా విధానం పేకాట ఆడేవారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. అందుకు సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించారు. గొల్లలదొడ్డి గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో ఏడుగురు వ్యక్తులు గుమిగూడి పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం పోలీసులకు అందింది. అయితే గతంలో మాదిరిగా నేరుగా దాడి చేయకుండా, అనుమానితుల కదలికలను ముందుగా డ్రోన్ ద్వారా నిశితంగా పరిశీలించాలని పోలీసులు నిర్ణయించుకున్నారు. ఆకాశంలో చక్కర్లు కొడుతున్న డ్రోన్ శబ్దం వినగానే, తమ స్థావరంపై నిఘా పడిందని పేకాట ఆడేవారు గ్రహించారు. దీంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డి ఆందోళనపడ్డారు. పోలీసులకు పట్టుబడకుండా తప్పించుకునేందుకు పొలాల్లోకి, ముళ్లపొదల్లోకి పరుగు లంకించుకున్నారు. ఇదంతా కూడా డ్రోన్ విజువల్స్ లో రికార్డు అయ్యింది. అయితే వారి పారిపోతున్న దిశలను కూడా పోలీసులు గమనిస్తున్నారనే విషయాన్ని పేకాట ఆడిన వారి గ్రహించలేదు.అయితే డ్రోన్ ద్వారా వారి కదలికలను పర్యవేక్షించిన పోలీసులు పారిపోతున్న ఏడుగురు వ్యక్తులను చుట్టుముట్టి చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారి వద్ద నుంచి 15,050 రూపాయల నగదుతో పాటు పేకాట ఆడేందుకు వినియోగించిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కొత్త టెక్నాలజీని ఉపయోగించి పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించడంపై స్థానికులు, ముఖ్యంగా శివారు ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంలో డ్రోన్ నిఘా ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో కూడా ఈ తరహా నిఘాను కొనసాగించాలని కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై నిఘా కొనసాగుతుందని, ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా పోలీసు అధికారులు హెచ్చరించారు.

## హైదరాబాద్లో నగ్జియాన్ ఎనర్జీ యూనిట్

సోడియం–అయాన్ బ్యాటరీ కంపెనీ నగ్జియాన్ ఎనర్జీ, తన ఉత్పత్తి సదుపాయాలను విస్తరించడానికి రూ.200 కోట్లు పెట్టు బడి పెట్టనుంది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థ, కోయంబత్తూరులోని తన యూనిట్లో మొబిలిటీ, ఎనర్జీ స్టోరేజ్ అప్లికేషన్ల కోసం అధిక సామర్థ్యం గల సోడియం అయాన్ బ్యాటరీ ప్యాక్లను అభివృద్ధి చేస్తోంది. ఇప్పుడు హైదరాబాద్లో కొత్త యూనిట్ ఏర్పాటు చేస్తోంది. ఇది 2026 చివరికి సిద్ధం అవుతుందని అంచనా. తమ వినియో గదార్ల నుంచి పెరుగుతున్న డిమాండ్ను దృష్టిలో పెట్టుకుని, కొత్త యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ సీఈఓ అభిషేక్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీ ప్లాంట్, సెల్ తయారీ సదుపాయం ఇందులో ఉంటాయన్నారు. మనదేశంలో తొలి సారిగా సోడియం అయాన్ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ను తమ సంస్థ కోయం బత్తూరు యూనిట్లో తయారు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో బ్యాటరీ, ఇన్వర్టర్, సోలార్ మాగ్జిమమ్ పవర్ పాయింట్ ట్రాకింగ్ (ఎంపీ పీటీ) ఉంటాయి.

# చమురు ట్యాంకర్‌ను సీజ్ చేసిన ఇరాన్

**న్యూఢిల్లీ, జనవరి, 24 :** ఒమన్‌లో భారీ పరిమాణంలో చమురును మోసుకెళ్తున్న ఒక నౌకను ఇరాన్ సీజ్ చేసింది. అందులో భారతీయులతోపాటు శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు చెందిన 18 మంది సిబ్బంది ఉన్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత ఈ ఘటన జరిగింది. 60 లక్షల లీటర్ల చమురును అక్ర మంగా తరలిస్తున్నారని, అందుకే నౌకలోని నావిగేషన్ వ్యవస్థలన్నింటినీ నిలిపివేశారని ఇరాన్ మీడియా వెల్లడించింది. గల్ఫ్‌లో అక్రమంగా ఇంధనం రవాణా చేస్తోన్న నౌకలను అడ్డుకుంటున్నట్లు ఇరాన్ ఇప్పటికే పలుమార్లు వెల్లడించింది. చమురు ఎగుమతి చేస్తోన్న దేశాల్లో ఒకటైన ఇరాన్‌లో చమురు ధరలు అతి తక్కువగా ఉంటాయి. అందుకే ఇక్కడినుంచి ఇతర దేశాలకు అక్రమంగా ఎగుమతి చేసి, కొందరు భారీ లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ కార్యకలాపాలను ఇరాన్ ఎప్పటికప్పుడు అడ్డుకుంటోంది. కాగా వెనెజువెలా తీరంలో రెండు రోజుల క్రితం అమెరికా ఒక ఆయిల్ ట్యాంకర్‌ను సీజ్ చేసింది. నౌక కెప్టెన్ వెనెజువెలా, ఇరాన్‌ల నుంచి అక్రమంగా చమురు రవాణా చేస్తున్నాడన్న ఆరోపణలతో ఈ నౌకను అగ్రరాజ్యం అడ్డుకుంది. వెనెజువెలా తీరం నుంచి క్యూబాకు బయలుదేరిన ఈ భారీ నౌకను అమెరికా సైనికులు తమ అధీనంలోకి తీసుకున్నారు. హెలికాప్టర్‌లో వెళ్లి షిప్‌పై దిగారు. ఆయుధాలతో షిప్ సిబ్బందిని చుట్టుముట్టిన వీడియోను అమెరికా మీడియాకు విడుదల చేసింది.

ఇప్పటి వరకు సీజ్ చేసిన వాటిలో ఇదే అతిపెద్ద ఆయిల్ ట్యాంకర్ డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇకముందు కూడా ఇలాంటి సంఘటనలు జరుగుతాయని అన్నారు. అది జరిగిన రెండు రోజులకే ఇరాన్ ఈ నౌకను సీజ్ చేసింది. ప్రపంచ చమురు మార్కెట్‌కు జీవనాడిగా ఉన్న హర్మూజ్ జలసంధి ఉంది. ప్రపంచ వ్యాప్తంగా రోజువారీ చమురు అవసరాల్లో 20 శాతం హర్మూజ్ ద్వారానే రవాణా అవుతోంది. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పం–ఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇది.

దీనిలో ఓ చోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఈ మార్గం నుంచి నిత్యం 2 కోట్ల బారెళ్ల చమురు వివిధ దేశాలకు వెళ్తుంది. సౌదీ, ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అవుతోంది. ఇక లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) రవాణాకు కూడా అత్యంత కీలకం. మూడింట ఒక వంతు ఎల్ఎన్‌జీ కూడా ఇక్కడి నుంచే వివిధ దేశాలకు చేరుతుంది.

## హిమాలయాల్లో న్యూక్లియర్ డివైస్..



**న్యూఢిల్లీ, జనవరి, 24 :** హిమాలయాల్లోని నందా దేవి కొండల్లో ప్రచ్ఛన్న యుద్ధ కాలం నాటి న్యూక్లియర్ డివైస్ కూరుకుపోయింది. చైనాపై గూఢచర్యం కోసం 1965లో సీఐఏ రహస్యంగా ఓ మిషన్‌ను నిర్వహించింది. దీనిలో భాగంగా ప్లుటోనియం పవర్డ్ జనరేటర్‌ను అమెరికన్, ఇండియన్ పర్వతారోహకులు తీసుకెళ్లారు. అది ప్రమాదవశాత్తూ ఇక్కడ పడిపోయింది. దీని ప్రభావం పర్యావరణంపై పడుతుందనే ఆందోళన దశాబ్దాల నుంచి వ్యక్తమవుతున్నది. జపాన్‌లోని నాగసాకిపై వేసిన అణు బాంబులో ఉన్న పీయూ–239 ఐసోటోప్, అత్యధిక రేడియోధార్మిక ఇంధనం పీయూ–238 ఈ డివైస్‌లో ఉండటంతో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ మిషన్‌ను నిర్వహించిన వారిని విస్తృత స్థాయిలో ఇంటర్వ్యూలు చేసినపుడు, అమెరికా, భారత్ ప్రభుత్వాల వద్ద ఉన్న రహస్య పత్రాలను పరిశీలించినపుడు, ఈ డివైస్ గురించి బయటపడింది. ఈ డివైస్‌పై సమాధానం చెప్పాలని భారతీయులు 1970వ దశకం నుంచి ఇప్పటికీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ న్యూక్లియర్ డివైస్ మంచు ప్రవాహంలో కొట్టుకొస్తే, రేడియోధార్మిక పదార్థం గంగా నదిలో కలిస్తే, కోట్లాది మందికి క్యాన్సర్ ముప్పు తప్పదని హిమాలయాల సమీపంలోని గ్రామస్థులు,పర్యావరణవేత్తలు, రాజకీయ నాయకులు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు

## తెలంగాణకు నాలుగు కొత్త కేంద్రీయ విద్యాలయాలు

**హైదరాబాద్, జనవరి, 24 :** దేశవ్యాప్తంగా కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఇందులో తెలంగాణకు నాలుగు (4) కొత్త కేంద్రీయ విద్యాలయాలు మంజూరయ్యాయి. ఈ కొత్త పాఠశాలలు భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జగిత్యాల (చెల్గల్), వనపర్తి (నాగవరం) జిల్లాల్లో ఏర్పాటు కానున్నాయి. ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన కేంద్ర విద్యా ప్రమాణాలు అందుబాటులోకి రానున్నాయి.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం దేశవ్యాప్తంగా పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలలో అత్యంత ముఖ్యమైనది.. దేశవ్యాప్తంగా కొత్తగా 57 కేంద్రీయ విద్యాల యాల ఏర్పాటుకు ఆమోదం తెలపడం. ఈ ప్రతిపాదనలో భాగంగా.. తెలంగాణ రాష్ట్రానికి నాలుగు (4) కొత్త కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేస్తూ కేంద్రం అదనపు చేయూతను అందించింది.ఈ వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. తెలంగాణలో ఇప్పటికే ఉన్న 35 కేంద్రీయ విద్యాలయాలకు ఈ నాలుగు కొత్త పాఠశాలలు తోడవడంతో, రాష్ట్రం లో మొత్తం కేంద్రీయ విద్యాలయాల సంఖ్య 39కి చేరుకుంది. ఈ కొత్త విద్యాలయాలు ముఖ్యంగా వెనుకబడిన, మారుమూల ప్రాంతాల విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. కొత్త కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు కానున్న ప్రాంతాలు, వాటి ప్రయోజనాలు ఇలా ఉన్నాయి. అందులో ఒకటి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం పరిధిలో ఉంది. ఇక్కడ కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక విద్యార్థులకు, ముఖ్యంగా వెనుకబడిన వర్గాల వారికి మెరుగైన ప్రాథమిక, సెకండరీ స్థాయి విద్య అందుబాటులోకి వస్తుంది.మరొక కేంద్రం ములుగు జిల్లా పరిధలో ఏర్పాటు. ఇది గిరిజన ప్రాంతం కావడంతో.. ఇక్కడి విద్యార్థులకు కేంద్ర విద్యా ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన విద్య లభిస్తుంది.



## ఇండిగో వ్యవహారం వెనుక కుట్ర

**హైదరాబాద్, జనవరి, 24 :**ఇండిగో సంస్థకు సంబంధించిన విమానాలు అర్థంతర ంగా ఆగిపోవడం మనదేశంలో తీవ్ర కలవరాన్ని కలిగించాయి.. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు విమానాశ్రయాలకు పరిమితమయ్యారు. ఉన్నట్టుండి విమానాలు ఆగిపోవడంతో ప్రయాణికులు నరకం చేశారు.. వాస్తవానికి విమానాలు ఆగిపోవడం మన దేశ చరిత్రలో ఇదే తొలిసారి.. ప్రకృతి విపత్తులు చోటు చేసుకున్నప్పుడు.. ఇతర సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు విమానాలను నిలిపివేస్తారు. కానీ ఎటువంటి కారణాలు లేకుండానే ఇండిగో సంస్థ విమానాలు ఆపివేయడం దేశవ్యాప్తంగా ఇబ్బంది కరమైన వాతావరణాన్ని కలిగించింది.విమానాలు ఆగిపోవడం వెనక టర్కీ దేశం పాత్ర అనుమానాస్పదంగా కనిపిస్తోందని జాతీ య మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఇండిగో సంస్థకు టర్కీస్ ఎయిర్ లైన్స్ తో విస్తృతమైన కోడ్ షేర్ బాండింగ్ ఉంది. టర్కీస్ ఎయిర్లైన్స్ ను నేరుగా టర్కీ ప్రభుత్వమే నియంత్రిస్తోంది.కొన్ని సంవత్సరాలుగా భారత్, టర్కీ మధ్య అంత గొప్పగా సంబంధాలు లేవు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్తాన్ కు టర్కీ బహిరంగ మద్దతు పలికింది. దీంతో భారతీయ కంపెనీలు టర్కీని బహిష్కరిం చాయి.. అంతేకాదు టర్కీ అధ్యక్షుడి కుమార్తెకు ప్రయోజనం క లిగించే సెలెబి ఏర్పోర్ట్ సర్వీసెస్ కాంట్రాక్టు ను భారత రద్దు చేసింది. అహ్మదాబాదులో ఎయిర్ ఇండియా విమానం ప్రమాదాని కి గురికావడానికి ముందు మనదేశంలో టర్కీ దేశానికి చెందిన విమానాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.అహ్మదాబాద్ ప్రమాదం తర్వాత ప్రజలు సహజంగానే ఎయిర్ ఇండియా వైపు దృష్టిస్తారిం చారు. ఈ కుట్ర అనేక రకాలుగా మలుపులు తిరిగింది.. పుతిన్ మనదేశంలో పర్యటిస్తున్నప్పుడే పశ్చిమ దేశాలు సరికొత్త వ్యూహాలు అవలంబించాయి.. అయితే ఈ వ్యవహారం వెనుక టర్కీ మాత్రమే కాకుండా, ఇంకా చాలా దేశాలు ఉన్నాయని తెలుస్తోంది. 2020లో ట్రంప్ భారత్లో పర్యటిస్తున్నప్పుడు సిఏఏ వ్యతిరేక నిరసనలు ఎలా అయితే వ్యక్తమయ్యాయో.. పుతిన్ భారతలో పర్యటిస్తున్నప్పుడు కూడా పశ్చిమ దేశాలు అదే విధంగా అసౌకర్యానికి గురయ్యాయి.ప్రస్తుతం మన దేశంలో పెళ్లిళ్లు, ఇతర వేడుకలు విస్తృతంగా జరుగుతూ ఉంటాయి. ఈ మార్కెట్ మొత్తాన్ని స్తంభింప చేయడానికి ఈ విధమైన కుట్రలకు పాల్పడ్డారని ఆరోపణ లు ఉన్నాయి. ఈ సంక్షోభానికి ఇండిగో సంస్థలో ఉన్న అంతర్గత బలహీనతలు కూడా ఒక కారణమని తెలుస్తోంది. పౌర విమానయాన శాఖ పైలెట్ ల విశ్రాంతి సమయాన్ని పెంచింది.. ఈ నిబంధనలను 2024 జనవరిలో విడుదల చేసింది. అయితే వీటిని ఇండిగో సంస్థ మాత్రం పాటించలేదు..

సొంత పైలెట్ అకాడమీ ఉన్నప్పటికీ సకాలంలో పైలెట్లను ఇండిగో సంస్థ నియమించుకోలేదు. ఇండిగో సంస్థలో గంగువాల్ కుటుంబం తమ వాటాలను నిరంతరం విక్రయించుకునే పనిలో పడింది. అందులో వాటాలను పశ్చిమ దేశాలకు చెందిన బ్యాంకులు కొనుగోలు చేశాయి. అందువల్లే ఇటీవల విమానాలను తెలివిగా నిలిపివేశాయి.ప్రభుత్వం పైలెట్ల విశ్రాంతి సమయాన్ని.. రాత్రి కాలంలో ఆపరేషన్ల నియమాలను అత్యంత కఠిన తరం చేసింది. దీంతో రోజుకు 2300 విమానాలను నడిపే ఇండిగో సంస్థ మీద విపరీతమైన ఒత్తిడి పడింది. పైలెట్లు విమానాలు నడపడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ.. కంపెనీ కావాలనే విమానాలను నిలిపివేసిందని తెలుస్తోంది. పలువురు పైలెట్లు విజిల్ బ్లోయర్లుగా ముందుకు వచ్చి ఈ నిజాలను వెల్లడించారు.

## యాసభాషల వ్యాకరణం..!

**హైదరాబాద్, జనవరి, 24 :**ప్రామాణిక వైయాకరణుల గ్రంథాలు, భాష్యకారుల రచనలు చదువుతున్న కొద్దీ ఆనాటి పండితుల్లో సైతం ఏవో తెలియని గడబిడలుండేవని తెలుస్తుంది. వారి భ్రమల వల్లో, ఇతర కారణాల వల్లో వారి రచనల్లో కొన్ని తారుమారులు, ఆక్షేపణలు దొర్లాయని కూడా అర్థమౌతోంది. నేడు కూడా మనలో కొందరు వ్యాస రచయిత లు అదే రీతిగా భ్రమలు, ప్రలోభాలకు గురవుతూ నిజమైన వైయాకర ణులకు అన్యాయం చేస్తున్నారా గత చరిత్ర నుంచి గుణపాఠం నేర్చుకున్నదేనా అన్న భావనలు కలుగుతున్నాయి. కాలం మారింది. టెక్నాలజీ పెరిగింది. అయినా ఆ దుష్ప్ర'భావ'జా లాలు వదలకపోవ డం, విశాల దృక్పథం కొరవడటం బాధాకరమే! గ్రాంథిక భాషకు వ్యాకరణ రచన 'ఆంధ్ర శబ్ద చింతామణి'తో మొదలై డాక్టర్ వడ్లమూడి గోపాల కృష్ణయ్య(వ.గో.కృ)తో ఆగిపోయి ంది. చాలామంది బహుజనపల్లి వారే గ్రాంథిక భాష వ్యాకరణ రచనలో చివరి వారనుకుంటారు కానీ, డాక్టర్ వ.గో.కృ. పరిష్కరిం చిన సమూల శ్రీమదాంధ్ర ఋగ్వేద సంహిత (తి.తి.దే) సంపుటాలు చదివితే కొత్త ఛందస్సులో అనువాద పద్యాలు దర్శనమిస్తాయి. అంటే డాక్టర్ వ.గో.కృ. కూడా చివరగా గ్రాంథిక భాషకై కొద్దో గొప్పోవ్యాకరణాన్ని జోడించినట్లే కదా! వ్యావహారిక భాషను ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు దాదాపు రెండున్నర శతాబ్దాల క్రితం ఇద్దరుపెద్ద ఉద్యమమే చేసి 'వ్యావహారిక భాషకు వ్యాకరణం రచిస్తా మని ఘంటాపథంగా శపథం చేశారు. ఆ తర్వాత వారు రాయలేక కన్ను మూశారు. 'వ్యావహారిక భాషా వ్యాకరణం' అనేశీర్షికనే అందిపుచ్చుకొని 1956లో వ్మాయ మహాధ్య క్ష డాక్టర్ వడ్లమూడి గోపాల కృష్ణయ్య తన 29వ యేటే 1474 సూత్రాలతో అమోఘమై న (యాసభాషల) వ్యాకరణం రచిం చి, 1958లో ప్రథమ ముద్రణ గా వెలువరించారు. ఈ ఉద్గ్రంథం అ ప్పటి ప్రసిద్ధ కవి పండితుల, ఆచార్యుల ప్రశంసలందుకొని, ప్రామాణికతకు సూచికగా నిలిచింది. 1990 సంవత్సరం తర్వాత మార్కెట్లో ఈ వ్యాకరణ గ్రంథం అందుబాటులో లేనందున, సినిమా మీడియా ప్రభావం వల్ల ఆ గ్రంథ ప్రాచుర్యం తగ్గింది. ఫలితంగా ఇప్పుడు సూత్రాల రూపేణా ఉన్న వ్యాకరణమే అసలైందని పదే పదే చెప్పాల్సిన దుస్థితి ఏర్పడింది. పైగా కొందరు అసలు వ్యావహారిక 'భాషా వ్యాకరణ'మే లేదని బుకాయింపు రచనలు చేయనారంభిం చారు. ఇలాంటి బ్లాక్మెయిల్ రచనలు మన తెలుగు సాహిత్యంలో గతంలో కూడా జరిగాయంటే నమ్మశక్యం కాదు. సాక్షాత్తూ 'ఆంధ్ర శబ్ద చింతామణి' గ్రంథమే సుమారు 600 ఏండ్లు అజ్ఞాతంలో ఉంది. 'అధర్వణ కారికలు' కూడా సుమారు 300 ఏండ్లు అజ్ఞాతంలోనే ఉంది. ఈ రెండు విషయాల నూ అహోబిలుడనే పండితుడు తన పద్యాల్లో తెలిసో తెలీకో పొందుపరిచాడు. ఇతని నిజనామం 'గాలి ఓబుల య్య'.

ఈ పేరు గంభీరంగా లేదనో ఏమో.. కాగా ఈఅహోబిలుడే-కేతన మహాకవి రచించిన 'ఆంధ్రాభాషాభూషణం' అనే వ్యాకరణ గ్రంథా న్ని చదివి బాగా ఆక్షేపించాడు. చింతామణి వ్యాకరణ గ్రంథం ఉన్నదని తెలిసీ దాన్ననుసరించాక కేతన తనదైన శైలిలో కొత్త వ్యాకరణ రచన చేశాడన్న భ్రమతోనే అహోబిలుడు ఆక్షేపిస్తూ కొన్ని రచనలు చేశాడు. అంతేకాక మరికొందరు సమకాలి కులుసైతం కేతనను బాగా ఆక్షేపించారని చరిత్ర చెప్తున్నది. తీవ్ర విచారకరం. 1958లో ప్రథమ ముద్రణగా వెలువడిన 'వ్యావహారిక భాషా వ్యాకరణం' గ్రంథాన్నే స్వల్ప మార్పులతో ద్వితీయ ముద్రణగా తేవడం మన తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలకు గర్వకారణం.

## అభివృద్ధి వైపు మావోయిస్టు ప్రాంతాలు



**రాయ్ పూర్,జనవరి, 24 :** రాజ్యాంగపై, ప్రభుత్వాలపై విశ్వాసం లేక.. దశాబ్దా లుగా నక్సలైట్లు, మావోయిస్టుల పేరుతో ప్రత్యామ్నాయ ఉద్యమాలు నడిపారు. అయితే మొదట్లో ఉద్యమ సిద్ధాంతాలు బాగానే ఉన్నాయి. ప్రజలు మద్దతు ఇచ్చారు. కానీ క్రమంగా ఉద్యమ సిద్ధాంతం దారితప్పింది. దీంతో ప్రజలు దూరమవూతు వచ్చారు. ప్రస్తుతం సంఘ విద్రోహ శక్తులుగా మారారు. దీంతో కేంద్రం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల ఏరివేత చేపట్టింది. చాలా మంది ఎన్కౌంటర్లో హతమవ్వగా, వందల మంది లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. దీంతో మావోయిస్టుల కారణంగా అభివృద్ధికి దూరంగా ఉన్న గ్రామాల్లో అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. తెలంగాణ, ఛత్తీస్గఢ్ సరిహద్దు గ్రామం కొండపల్లి మావోయిస్టు ప్రభావిత గ్రామం. సవంత్సరాలుగా అక్కడ అభివృద్ధి జాడలేదు. ప్రాథమిక వసతులు కూడా లేకుండా ప్రజలు జీవనం సాగిస్తున్నారు. సమస్యలతో సహవాసం చేస్తున్నారు. మావోయిస్టుల అంతంతో ఇప్పుడు ఆ గ్రామంలో అభివృద్ధి ఆశలు చిగురించాయి. చెక్కించిన మావోయిస్టుల కారణంగా అనేక సంవత్సర్లుగా పెడుతూ ఉన్న ఆటంకాలు తొలగిపోయాయి. ప్రాథమిక వసతులు లేకుండా వింత పరిస్థితుల్లో జీవిస్తున్న ప్రజలకు కొత్త ఆశ కలిగింది.కొండపల్లి గ్రామానికి మొబైల్ టవర్ ఏర్పాటు కావడంతో గ్రామస్తులు సంబరాలు మొదలయ్యాయి. పలువురు దూర ప్రాంత బంధువులతో సంభాషణ జరపడం ప్రారంభించారు, సాంకేతిక పరిజ్ఞానం స్ఫూర్తిగా మారింది. గ్రామానికి రహదారులు, పాఠశాలలు, వైద్య సదుపాయాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు గ్రామాన్ని కొత్త దిశగా నడిపిస్తున్నాయి.తొలి మూడు అగ్రిమెంట్ల ఆధారంగా, ఛత్తీస్గఢ్ ప్రభుత్వం నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న ప్రత్యేక పథకాల ద్వారా కొండపల్లి వంటి గ్రామాలకు సాంకేతిక మరియు మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధికి దారి తీస్తోంది. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మూడు అగ్రివెెంట్లతో తమ భవిష్యత్ మారుతుందని సంబురాలు చేసుకుంటున్నారు. ఛత్తీస్గఢ్ ప్రభుత్వం నియాద్ నెల్లార్ వంటి అంటే నా గ్రామము.. నా అభివృద్ధి అనే పథకంలో భాగంగా నక్సల్ ప్రభావిత గ్రామాల్లో కొండపల్లికి మొబైల్ తీసుకువచ్చారు.

## కౌలు రైతులకు ఎపి ప్రభుత్వం శుభవార్త

### లక్ష వరకు రుణం మంజూరు చేయడానికి నిర్ణయం

**హైదరాబాద్, జనవరి, 24 :**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కౌలు రైతులకు శుభవార్త చెప్పింది. సాగు పెట్టుబడి కోసం రూ.లక్ష వరకు రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. పీఏసీఎస్ల ద్వారా ఈ రుణాలు మంజూరు చేయను న్నారు. కౌలు రైతులను మరింత ప్రోత్సహించే ప్రణాళికలో భాగంగా అర్హులైన కౌలు రైతులకు రూ.లక్ష వరకు రుణాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. వ్యవసాయ సహకార పరపతి సంఘాల నుంచి రుణాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే ప్రస్తుతం అధికారులు రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతుల వివరాలు సేకరించే ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ వివరాల సేకరణ పూర్తయిన వెంటనే అర్హులైన లబ్దిదారులకు రుణాలు మంజూరు చేసే అవకాశం ఉంది. రుణాలు విత్తనాలు, ఎరువులు, కూలీ ఖర్చుల వంటి ముఖ్యమైన వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.ఈ రుణ ప్రయోజనం పొందేందుకు లబ్దిదారులు సంబంధిత అధికారుల నుంచి జారీ చేయబడిన కౌలు పత్రాలు కలిగి ఉండాలి. కొందరు కౌలు రైతులు సహకార సంఘం పరిధిలో నివాసం ఉంటూ ఆ సంఘంలో సభ్యత్వం కలిగి ఉండాలి. ఈ రుణానికి దరఖాస్తు చేసే రైతు కౌలు పత్రంలో చూపించిన సాగు భూమి ఎకరాకు తగ్గకుండా ఉండాలి. అసైన్డ్ భూములు సాగు చేస్తున్న కౌలు పత్రాలు ఉన్నవారు మాత్రం ఈ రుణాలకు అర్హులు కాదు. సొంత ఇల్లు ఉన్నవారికి లోన్ మంజూరు చేయడంలో అధిక ప్రాధాన్యత ఇస్తారు.

## గ్రేటర్ లోపునర్విభజన లొల్లి..!

**హైదరాబాద్,జనవరి,24 :** సినిమాలో ఏదో మ్యాప్ ముందు పెట్టుకుని ముక్కలు ముక్కలు చేసి పంచుకున్న సీన్ గుర్తుస్తోంది గ్రేటర్లోని వార్డుల విభజన చూస్తే. ఓ ప్రాతిపదిక అంటూ లేకుండా గ్రేటర్ మ్యాప్ ముందు పెట్టుకుని గీతలు గీస్తూ వార్డుల విభజన చేశారంటూ ఆరోప ణలు వస్తున్నాయి.గ్రేటర్ ని ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో పాలన మొత్తం బల్దియా ఆధ్వర్యం లోకి వచ్చింది.వార్డుల పునర్విభజన చేసిన అధికారులు 150 నుంచి 300 వార్డులకు పెంచారు. ఈనెల 9వ తేదీ నుంచి అధికారికంగా ఏడు రోజులపాటు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. అయితే వార్డుల విభజన మ్యాపులు..జనాభా లెక్కలు ఏవీ పరిగణన లోకి తీసుకోకుండా తోచినట్లు విభజన చేశారంటూ విమర్శలు వస్తున్నాయి. ఓల్డ్ సిటీలో ఎంఐఎంకు అనుకూలంగా వార్డులను విభజించారంటూ బీజేపీ ఆరోపిస్తోంది.గ్రేటర్లో 20 మున్సిపాలిటీలు..ఏడు కార్పొరేషన్ల విలీనం తర్వాత.గ్రేటర్ ని మూడు విభాగాలు డివైడ్ చేస్తారని టాక్ నడిచింది. కానీ అందరి అంచనాలకు విరుద్ధంగా.. హైదరాబాద్ లో 150 వార్డులను 3వందలకు పెంచింది సర్కార్. అయితే వార్డుల విభజనపై రాజకీయ పార్టీలు గుర్రుగా ఉన్నాయి. వార్డుల విభజనపై ఎంఐఎం శాసనసభ్యులు, కార్పొరేటర్లు అక్బరుద్దీన్ ఓవైసీ ఆధ్వర్యంలో కమిషనర్తో భేటీ అయ్యారు. తమ ప్రాంతాల్లోని పలు వార్డుల విభజనపై వారు కమిషనర్కు లిఖితపూర్వక ఫిర్యాదులు చేశారు.వార్డ్ హద్దులు క్లియర్గా లేవనేది రాజకీయ పక్షాల వాదన. ప్రధానంగా సెంట్రల్ సిటీలో వార్డుల సంఖ్య కొంత పెరిగింది. ఇక విలీన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను ఒకటి రెండు వార్డులుగా మాత్రమే విభజించారు. అయితే ఇందులో జనాభాను ప్రాతిపదికగా తీసుకొని వార్డుల విభజన చేశామని అధికారులు చెబుతున్నప్పటికీ ఆ అంశంలో క్లారిటీ లేదట. మరోవైపు నాచురల్బౌండరీస్ అనుసరించి వార్డును విభజించామని అధికారులు చెబుతున్నారు. వాటి విషయం లోనూ లోకల్ లీడర్లకు క్లారిటీ రావడం లేదు. తమ డివిజన్లో తమకే తెలియని నేచురల్ బౌండరీస్ను అధికారులు గుర్తించి పేర్కొ నడంతో నోరువెళ్లబెట్టడం కార్పొరేటర్ల వంతు అవుతోందివార్డుల విభజన వైశాల్యాన్ని బట్టి చేశారా జనాభాను బట్టి చేశారా అన్నదానిపై క్లారిటీ లేదు. ఈ విషయంలో డిప్యూటీ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులకు కూడా క్లారిటీ లేకపోవడంతో..వారు కార్పొరేటర్లు, పొలిటికల్ లీడర్లు అడిగే ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వలేకపోతు న్నారట. అటు కొత్తగా వచ్చిన కమిషనర్ కూడా క్లారిటీ ఇవ్వలేక ఎవరికీ అందుబాటులోకి రావడం లేదంటున్నారు పలువురు కార్పొరేట ర్లు.ఏ వార్డులో ఎంత జనాభా ఉన్నారు.. ఏ వార్డు వైశాల్యం ఎంత. అనేది చెప్పేవారే లేరట. పైగా వార్డ్ బౌండరీలను ఈజీగా గుర్తించేలా మ్యాపులను కూడా విడుదల చేయలేదు.

దాంతో డీలిమిటేషన్పై గందరగోళ పరిస్థితి కొనసాగుతోంది. వార్డుల బౌండరీల విషయంలో రెండు మూడుసార్లు మార్పులు చేర్పులు జరిగినట్లు టాక్. కొందరు రాజకీయ నేతల ఒత్తిడితోనే వార్డుల హద్దులను మార్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.ఇక పాత గ్రేటర్ పరిధిని..విలీన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోకి రాకుండా..బల్దియా అధికారులు జాగ్రత్త పడ్డట్లు కనిపిస్తుంది. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని డివిజన్లను అదే ప్రాంతంలో పునర్విభజన చేశారు. పక్కనే ఉన్న బోడుప్పల్, ఫీర్జాదిగూడ కార్పొరేషన్ల పరిధిలో గతంలో 58 వార్డులు ఉన్నాయి. కానీ ఇప్పుడు ఫిర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో రెండు వార్డులు..బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో రెండు వార్డులను మాత్రమే ఏర్పాటు చేశారు. అంటే అప్పటికే ఉన్న లోకల్ బాడీల పరిధిలో మాత్రమే ఈ విభజన జరిగింది తప్ప అన్నింటిని ఒక్క దగ్గరకి చేర్చి విభజించలేదన్న వాదన వినిపిస్తోంది.

మరోవైపు ఇప్పటికే ఉన్న ఆరు జోన్ల పరిధిలో ఉన్న వార్డుల సంఖ్య ఎంత పెరిగింది..ఏయే వార్డు రెండు వార్డులుగా విభజన అయిందన్న అంశాలపై క్లారిటీ లేదు. ఏ వార్డులో ఎంత జనాభా ఉంది అన్న అంశంలో స్పష్టత లేకపోవడంతో బీజేపీ డీలిమిటేషన్ను తప్పుబడుతు ంది. వార్డుల విభజన మ్యాపులు లేకపోవడంతో తమ అభ్యంతరాలను సూచనలను చెప్పేందుకు ఆస్కారం లేకుండా పోతుందనేది రాజకీయ పార్టీల వాదన. అయితే పొలిటికల్ ప్రెజర్ వల్లే అధికారులు వార్డుల మ్యాప్లు, బార్డర్లలో విషయంలో ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకున్నారనే ప్రచారం జరుగుతోంది.

## ఆ రెండు జైళ్లు వీఐపీలు

**హైదరాబాద్, జనవరి, 24 :** ఆంధ్రప్రదేశ్లో రాజకీయ పరిణామాలు వేగంగా మారు తున్న నేపథ్యంలో, రాష్ట్రం లోని రెండు ప్రధాన కారాగారాలు విజయ వాడ జిల్లా జైలు ,నెల్లూరు సెంట్రల్ జైలు అనూహ్యంగా ఎక్కువ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వివిధ చట్టవిరుద్ధ చర్యలకు సంబంధించిన కేసులు పెరగడం, వాటిలో రాజకీయ నాయకులు, ప్రభావశీల వ్యక్తులు రిమాండ్కు వెళ్లడం వల్ల ఈ జైళ్లు వార్తల్లో నిలుస్తున్నాయి. ఒకప్పటి వరకు సాధారణ నేరస్తులే ఎక్కువగా ఉండే ఈ జైళ్లలో ఇప్పుడు వీఐపీలు, రాజకీయ నాయకుల రాకపోకలు పెరగడంతో వాతావరణం పూర్తిగా మారిపో యింది. ఇటీవలి కాలంలో నెల్లూరు జైలులో మళ్లీ హల్చల్ మొదలైం ది. మాచర్లకు చెందిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరు డు సహా పలువురు రిమాండ్ ఖైదీలుగా అక్కడికి చేరుకోవడం చర్చనీయాంశమైంది. అంతకు ముందు నెల్లూరు సెంట్రల్ జైలు పెద్ద కేసుల కోసం ఎక్కువగా వినియోగించబడేది కాదు. విశాఖపట్నం రాజమండ్రి, కడప జైళ్లలోనే ముఖ్యనిందితులను ఉంచేవారు. కానీ తాజాగా నెల్లూరు, విజయవాడ జైళ్లపైనే అధిక భారం పడుతోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపిన కేసులు తిరుమల లడ్డూ కల్తీ, ములకలచెరువు నకిలీ మద్యం, లిక్కర్ స్కాం, నెల్లూరులో మహిళా డాన్లపై నమోదు చేసిన కేసులు అన్నీ ఏదో ఒక విధంగా ఈ రెండు జైళ్లకే చేరుతున్నాయి. ప్రధాన మీడియాతోపాటు సోషల్ మీడియాలో కూడా ఈ కేసులు రోజూ హాట్ టాపిక్ కావడంతో జైళ్ల చుట్టూ రద్దీ పెరుగుతోంది. ప్రతిరోజూ నిందితుల రాకపోకలు, విచారణలకు పంపడాలు, కొత్త ఆరోపణలతో రిమాండ్కు వచ్చే వారు ఇలా జైల్లో జరిగిన ప్రతి చిన్న కదలిక కూడా వార్తగా మారుతోంది.నెల్లూరు సెంట్రల్ జైలులో ఇప్పుడు ప్రధాన కేసులకు సంబంధించిన వ్యక్తులే ఎక్కువ. తిరుమల లడ్డూ కేసులో అరెస్టయిన పది మంది అక్కడే రిమాండ్లో ఉన్నారు. మహిళా డాన్గా గుర్తింపు పొందిన అరుణ,సీపీఎం హత్య కేసులో నిందితురా లు కామాక్షి కూడా అక్కడే ఉన్నారు. వైఎస్సార్సీపీకి చెందిన మాజీ మంత్రి జోగి రమేష్ , ఎస్పీవై డిస్టిలరీస్కు చెందిన సజ్జల శ్రీధర్ రెడ్డి , సీనియర్ ఐపీఎస్ అధికారి సంజయ్ వంటి వారు అక్కడే ఉన్నారు. గతంలో చిన్న నేరస్తులు ఎక్కువగా ఉండే ఈ జైలు, ఇప్పుడు భారీ సెక్యూరిటీ అవసరమయ్యే వీఐపీలతో నిండి సిబ్బందికి సవాలుగా మారింది.

# టమాటా రైతుల కన్నీరు



**కర్నూలు, జనవరి, 23** :కూరగాయలతో పాటు నిత్యవసరాల అమ్మకాలు పెరిగాయి. వాటి ధరలు చూస్తుంటే మాత్రం మండిపోతున్నాయి. ముఖ్యంగా టమాటా ధర పాతిక రూపాయల కు పైగానే ఉంది. కానీ ఏపీలో ఆ ప్రాంతాల్లో మాత్రం కిలో 50 పైసలకే దొరుకుతుంది. రూపాయి ఇస్తామంటే రైతులు ఎగబడి ముందుకు వచ్చి అమ్ముతున్నారు. అయితే ధరల స్థిరీకరణ లేకపోవడం, యంత్రాంగం ముందు చూపు లేకపోవడం వంటి కారణాలతో పంట లభ్యమయ్యే చోట తక్కువ ధర పలుకుతోంది. ఇతర ప్రాంతాల్లో మాత్రం అందనంత దూరంలో ఉంది. దీంతో టమాటా రైతు పడుతున్న బాధ అంతా ఇంతా కాదు.ఏపీలో టమాటా పంటకు పెట్టింది పేరు కర్నూలు జిల్లా. జిల్లా వ్యాప్తంగా విరివిగా పండుతుంది టమాట. ప్రస్తుతం పంట అందుబాటులోకి వచ్చింది. దిగుబడి బాగా ఉంది. కానీ ధర మాత్రం పూర్తిగా పడిపోయింది. కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపలేదు. అయితే ధర విషయంలో చేదు అనుభవం ఎదురు కావడంతో రైతులు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. మార్కెట్లో పోసి నిరసన వ్యక్తం చేస్తున్నారు. టమాటా విక్రయాలు జరపకుండానే ఆరుగాళం కష్టపడే రైతుకు శ్రమకు తగ్గ ఫలితం రావడం లేదు. పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదు. ఈ క్రమంలో పంటలు పండించి అప్పుల పాలవుతు న్నారు. రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో కిలో టమాట పాతిక రూపాయల పై మాటే. కానీ కర్నూలు జిల్లాలో(రైతులు వద్ద టమాటా రూపాయికి కూడా అడగడం లేదు. ఇలా ధరల స్థిరీకరణ లేకపోవడంతో నష్టపోవడం రైతుల వంతు అవుతోంది. కనీసం గ్రామం నుంచి మార్కెట్ కు తీసుకొచ్చేందుకు రవాణా ఖర్చులు కూడా రావడం లేదు. అటువంటప్పుడు పంట సేకరణ ఎందుకు చేయాలని కొందరు.. తెచ్చిన పంటను రహదారుల పక్కనే పారేస్తున్నారు మరి కొందరు. మార్కెట్కు తీసుకువచ్చినవారు వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతుండడంతో.. తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు. మార్కెట్లో టమాటా పారబోసి నిరసన తెలుపుతున్నారు.

# త్వరలో టీడీపీ కమిటీలు

**గుంటూరు, జనవరి, 23** : టీడీపీ రాష్ట్ర కమిటీ ఎలా ఉండబోతోంది.. ఎవరెవరికి ఈ సారి అవకాశాలు ఉంటాయి.. టీడీపీ జాతీయ అధ్యక్షుడు సీఎం చంద్రబాబు త్వరలో టీడీపీ స్టేట్ కమిటీ ఏర్పాటు జరుగుతుందని స్పష్టత ఇవ్వడంతో పార్టీ వర్గాల్లో చర్చ మొదలయింది.. ఆ దిశగా ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సమావేశాలు ముగిసాయి. అసలు తెలుగుదేశం పార్టీలో సంస్థాగత మార్పులు ఎలా ఉండబోతున్నాయి? టీడీపీలో సంస్థాగత మార్పులపై చర్చ. తెలుగుదేశం పార్టీలో సంస్థాగత మార్పులు..క్రియాశీల పదవులు, మిగిలిన నామినేటెడ్ పదవుల భర్తీకి సంబంధించి చర్చ జరుగుతోంది. ఈ నెలాఖరులోగా మరికొన్ని నామినేటెడ్ పదవులు భర్తీ అయ్యే అవకాశం ఉంది.. దీంతో పాటు త్వరలో జిల్లా కమిటీలను పూర్తి చేసి ఆ తర్వాత రాష్ట్ర టీడీపీ కార్యవర్గం ఏర్పాటుపై దృష్టి పెట్టనుంది టీడీపీ అధిష్టానం.. ఆ క్రమంలో రాష్ట్ర టీడీపీ కమిటీకి సంబంధించి పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. జిల్లా కమిటీలు పూర్తి చేసి వెంటనే స్టేట్ కమిటీలపై దృష్టి పెట్టనున్నారు. యువత, మహిళలకు ఎక్కువగా అవకాశాలు వచ్చే పరిస్థితి కనిపిస్తోంది.. యువతను బాగా ఎంకరేజ్ చెయ్యాలనే అలోచనలో పార్టీ అధిష్టానం ఉందంట. అందులో భాగంగానే కొన్ని కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేస్తోందంట.. ఎన్నికల సమయంలో పార్టీకి సేవలు అందించిన వారికి , టికెట్లు రానివారు.. అదే విధంగా మహిళలకు ఈసారి కమిటీల్లో ప్రాధాన్యత దక్కనుంది. కార్యకర్తలుగా కెరీర్ ప్రారంభించి పార్టీని అంటి పెట్టుకుని ఉన్న నేతలకు అవకాశాలు రానున్నాయి. సీఎం చంద్రబాబు కూడా ఇదే అంశాన్ని నేతలకు చెబుతున్నారు. పార్టీతో పాటు నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారి గురించి ఆరా. పార్టీ పదవులు తీసుకోడానికి ఎవరెవరు సుముఖత



వ్యక్తం చేస్తున్నారు? ఎవరు నామినేటెడ్ పదవులు అడుగుతున్నారనే అంశంపై కూడా హైకమాండ్ స్పష్టత తీసుకుంటోంది. జిల్లాల వారీగా కమిటీలు ఏర్పాటు జరిగిన తర్వాత రాష్ట్ర కమిటీపై దృష్టి పెట్టనున్నారు. కొంతమంది నామినేటెడ్ పదవులు కోరుకుంటున్నారు, పార్టీ పదవులు నిర్వహించేందుకు అంత సుముఖంగా లేరు.

వీరిని కూడా దృష్టిలో పెట్టుకుని కొన్ని నిర్ణయాలు తీసుకోనున్నారు. ఆ దిశగా జిల్లాల వారీగా యువ నేతలు, మహిళా నేతల లిస్ట్ రెడీ అవుతోందంట. పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకోవాలని సూచనలు. ఇదే విధంగా పార్టీని ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని సీఎం పదే పదే చెబుతున్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు పార్టీ పరంగా ముందుకు తీసుకు వెళ్లాలనే విధంగా నేతలకు సూచనలు ఇస్తున్నారు.. జిల్లా కమిటీ అయినా రాష్ట్ర కమిటీ అయినా ఇదే రకమైన సూచనలతో ఏర్పాటు జరగనుంది.. త్వరలోనే అన్ని కమిటీలు పూర్తి చెయ్యాలనే ఆలోచనలో టీడీపీ అధిష్టానం ఉందంట.

# లంచాలు తీసుకొని అభివృద్ధి చేస్తున్నా?

## వైరల్ గా మారిన కామెంట్స్!

**ఏలూరు, జనవరి, 23** :ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ముఖ్యంగా కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేల తీరు ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. గత కొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాలు కూటమిలో క్రమశిక్షణను ప్రశ్నిస్తున్నాయి. శాసనసభలో బిజెపి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు టిడిపి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ. జగన్ హయాంలో సినీ ప్రముఖులు కలిసినప్పుడు జరిగిన పరిణామాలపై స్పందించారు. ఎగతాళిగా మాట్లాడారు. చిరంజీవి ప్రస్తావన తీసుకురావడంతో మెగా అభిమానులు ఆగ్రహంగా ఉన్నారు. అయితే ఈ వివాదం పై సీఎం చంద్రబాబు కూడా స్పందించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేల తీరుపై అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. సరిగ్గా ఇటువంటి సమయంలో జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రభుత్వ అవినీతితో పాటు ఎమ్మెల్యేల లంచాల పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ప్రముఖ జర్నలిస్టు జాఫర్ తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తో ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అవినీతితో పాటు ఎమ్మెల్యేల ఆదాయంపై ప్రశ్నించారు. అయితే దీనిపై మనసులో ఉన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు బొలిశెట్టి. తనతో పాటు నూటికి 99 మంది ఎమ్మెల్యేలు ఇలానే చేస్తున్నారు అంటూ ఆయన చెప్పుకు రావడం విశేషం. వాత పెట్టేది మేమే.. వెన్న పూసేది మేమే.. అలాగే ప్రతి అంశంలోనూ డబ్బుల లావాదేవీలు నడుస్తాయని చెప్పుకొచ్చారు. నాలుగు నుంచి ఐదు కోట్ల రూపాయల వరకు లంచాలు వస్తాయని బహిరంగంగానే ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఎమ్మెల్యేలకు ఎక్కువగా ఆదాయం సమకూరుతోందని? తనకు కూడా అదే మాదిరిగా వచ్చిందని బొలిశెట్టి నిర్మొహమాటంగా చెప్పడం విశేషం.అయితే ఇటీవల జరుగుతున్న పరిణామాలు కూటమిని ఇరకాటంలో పెడుతున్నాయి. ప్రస్తుతం మూడు పార్టీల ఉమ్మడి ప్రభుత్వం నడుస్తోంది. ఎమ్మెల్యేలు క్రమశిక్షణతో మెలగాలని మూడు పార్టీల నాయకత్వాలు సూచించాయి. కానీ ఎమ్మెల్యేలు స్వేచ్ఛకు మించి మాట్లాడుతున్నారు. తమ పార్టీలతో పాటు కూటమికి ఇబ్బందులు తెచ్చి పెడుతున్నారు. ఇప్పుడు ఎమ్మెల్యే బొలిశెట్టి అలా స్పందించేసరికి.. సోషల్ మీడియాలో ఈ అంశం వైరల్ గా మారింది. తరచూ వివాదాల్లో చిక్కుకుంటున్నారు బొలిశెట్టి శ్రీనివాస్. అప్పట్లో అల్లు అర్జున్ సినిమా విషయంలో సైతం అతిగా స్పందించా రన్న విమర్శ ఉంది. అప్పట్లో హై కమాండ్ గట్టిగానే హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది. ఇప్పుడు లంచాలు సహజం అన్నట్టు.. ఏకంగా ఓ మీడియా ఇంటర్వ్యూలోనే బొలిశెట్టి వ్యాఖ్యానించడం వివాదాస్ప దంగా మారుతోంది. మరి దీనిపై జనసేన నాయకత్వం, కూటమి ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి.నేను పదవిని అడ్డంపెట్టుకుని లంచాలు తీసుకుంటున్నా..దోచుకున్న సొమ్ముతో అభివృద్ధి చేద్దాం అని సిగ్గులేకుండా చెప్తున్నా నేను..

## ఆలయ పునరుద్ధరణకు భారీ విరాళం

**పెగడపల్లి, జనవరి, 23** :ఆలయ పునరుద్ధరణకు భారీ విరాళం అందించారు బోయినపల్లి శాంతపురావు సరిత దంపతులు. మండల కేంద్రంలోని శ్రీ రాజ రాజేశ్వర స్వామి పాత బస్తీ హనుమాన్ ఆలయ పునరుద్ధరణ లో భాగంగా స్లాబ్ నిర్మాణం కోసం బోయినపల్లి శాంతపురావు సరిత దంపతులు 2,25,000 రూపాయలను ఆలయ కమిటీకి అందజేశారు.

పుట్టిన ఊరు మీద మమకారంతో భక్తితో ఆలయ పునరుద్ధరణ కోసం తనవంతుగా భారీ విరాళం అందశారు. ఈ తరుణంలోనే... శాంతపురావు సరిత దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు అభినందించి ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు ఓరుగలి శ్రీనివాస్,శేఖర్ గౌడ్,పార్థ సారధి, బోగ గోపి,మాదరపు కిషన్ రావు,మాదరపు కరుణాకర్ రావు,గొల్లపల్లి రాం చంద్రం,తదితరులు ఇందులో ఉన్నారు.

# కూటమికి దూరమౌతున్న కాపు వర్గం!

**కాకినాడ, జనవరి, 23** :ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. ఏదో ఒక రూపంలో విపక్షానికి కాల కలసి వస్తుందని భావించి ఉంటారు కానీ.. అందులో టీడీపీ నేత, చంద్రబాబు నాయుడు బామ్మర్ది బాలకృష్ణ రూపంలో తమ పార్టీకి హైప్ వస్తుందని వైసీపీ నేతలు ఊహించి ఉండరు. వైసీపీకి ఎటూ దారి తోచని స్థితిలో నందమూరి బాలకృష్ణ ఫ్యాన్ పార్టీకి ఒక మార్గం చూపినట్లయింది. ఇటీవల నందమూరి బాలకృష్ణ అసెంబ్లీ సమావేశాల్లో చేసిన వ్యాఖ్యలు కూటమి పార్టీలో కలతలు ఎత వరకూ పెడతాయో తెలియదు కానీ, వైసీపీకి మాత్రం కొండంత బలం చేకూర్చాయని చెప్పాలి. జగన్ సైకోగాడంటూ బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు కొంత బాధ కలిగించవచ్చు కానీ, అదే సమయంలో బాలయ్య చిరంజీవి పై చేసిన కామెంట్లు తమకు కలసి వచ్చేటట్లుగా ఉన్నాయని తెగ ఖుషీ ఫీలవుతున్నారు. గతంలో జగన్ పై చేసిన ఆరోపణలన్నీ ఒక్కసారిగా బాలయ్య తెలిసీ తెలియకుండా చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రయోజనం కల్పించాయి. ఎందుకంటే గత ఎన్నికల సమయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ జగన్ వద్దకు వెళ్లినప్పుడు తన సోదరుడు, మెగాస్టార్ చిరంజీవిని అవమానించారని పదే పదే ఆరోపించారు.జగన్ యాటిట్యూడ్ అదేనని, సాక్షాత్తూ చిరంజీవినే అవమానిస్తే ఇక సామాన్యుల మాటేమిటని ప్రశ్నించారు. కానీ అప్పుడు పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను ఖండించని చిరంజీవి నేడు బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలతో కొంత ఘాటుగానే స్పందించారు. జగన్ తనను సాదరంగా ఆహ్వానించారన్నారు. తనను అవమానించలేదని చిరంజీవి చెప్పడంతో వైసీపీకి పవన్ కల్యాణ్ గతంలో చేసిన ఆరోపణలు అబద్ధమని తేలిపోయింది. మరొకవైపు బాలయ్య చేసిన వ్యాఖ్యలతో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో జనసేన నేతలపై కూడా అక్కడ కాపు సామాజికవర్గం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాలకృష్ణ అన్ని మాటలు చిరంజీవిని అన్నప్పటికీ జనసేన మంత్రులు అసెంబ్లీలో ఉండి ఎందుకు ఖండించలేదని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు. అదే సమయంలో రాయలసీమలోని బలిజ సామాజికవర్గం నుంచి కూడా వ్యతిరేకత వ్యక్తమవుతుంది. పవన్ కల్యాణ్, నాగబాబు లు కూడా ఈ విషయంపై స్పందించకపోవడంతో పాటు టీడీపీ ముఖ్య నేతలు కూడా కనీసం ఆ వ్యాఖ్యాలపై చిరంజీవికి అనుకూలంగా కామెంట్స్ చేయకపోవడంపై కాపు సామాజికవర్గం నేతలతో పాటు చిరంజీవి అభిమానులు ఆగ్రహంగా ఉన్నారు. సోషల్ మీడియాలో ఇది కనిపిస్తుంది. అందుకే వైసీపీ తమ అధినేతను సైకో అని అన్నప్పటికీ బాలయ్య చేసిన వ్యాఖ్యలతో వాతావరణం తమకు అనుకూలంగా మారిందన్న లెక్కలు వేసుకుంటున్నారు.

# ఉల్లిధరలతో కర్నూలు రైతు దిగాలి

## సాగు పెరిగినా..దక్కని గిట్టుబాటు ధరలు

**కర్నూలు, జనవరి, 23** : రాష్ట్రంలో ఉల్లి ఘాటు క్రమంగా పెరగాల్సిన ప్రస్తుత సీజన్‌లో రైతులు దిగాలు పడ్డారు. ధరలతో సామాన్యులు బెంబేలెత్తుతున్నా, రైతులకు మాత్రం గిట్టుబాటు కావడం లేదు. 1200కు క్వింటా అని ప్రభుత్వం చెప్పినా ఆ ధరలు కూడా రావడం లేదంటున్నారు. గత కొన్ని రోజులుగా ధరలు పతనం అవుతున్నాయి. ఇటీవల 25 రూపాయలు ఉన్న ధరలు ఏకంగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవలి వర్షాల కారణంగా ఉల్లి సరఫరా ఆగిపోయిందని అంటున్నారు. గతేడాదితో పోలిస్తే మార్కెట్‌లకు 4-5 వేల క్వింటాళ్ల మేర సరఫరా తగ్గిపోయింది. అయినా రైతులకు మాత్రం ధరలు దక్కడం లేదు. దీంతో హోల్‌సేల్ ధరే కిలో రూ. 20 నుంచి 25కి చేరింది. కర్నూలు జిల్లాలో మార్కెట్‌లోకి ఉల్లి ఈ యేడు భారీగా చేరింది. వర్షాల పరిస్థితుల కారణంగా ఉల్లి సాగు అనుకున్నంత జరిగినా ధరలు మాత్రం పెరగడం లేదని అంటున్నారు. పొరుగు రాష్ట్రాల్లో ఇటీవలి వర్షాలు, వరదల కారణంగా దిగుబడి తగ్గడంతో ధర కొండెక్కుతుందని భావించారు. దీంతో ఇక్కడి రైతులకు డిమాండ్ వస్తుందని భావించారు. ఈ యేడు దేశంలో ఉల్లి సాగు విపరీతంగాపెరగడంతో ధరలు దిగివచ్చాయి. కేవలం పది రోజుల వ్యవధిలోనే కిలో ఉల్లి ధర రూ. 10 నుంచి రూ. 15 వరకు మాత్రమే అమ్ముడువతోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో 20 రూపాయలు పలుకుతుండగా ఇది మరింత పెరిగే అవకాశం లేదు. రాష్ట్రంలో ప్రధానంగా ఉల్లి సాగు గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, మెదక్, రంగారెడ్డి, వికారాబాద్, కొంతమేర కామారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో సాగవుతుంది. రాష్ట్రం నుంచి వస్తున్న ఉల్లితో పూర్తిస్థాయిలో అవసరాలు తీరే అవకాశం లేకపోవడంతో పొరుగు రాష్ట్రాలపై ఆధారపడాల్సి వచ్చేది. సాధారణంగా రాష్ట్ర మార్కెట్‌లకు మహారాష్ట్రలోని షోలాపూర్, ఔరంగాబాద్, నాసిక్, కర్ణాటకలోని శివమొగ్గ, రాయచూర్ ప్రాంతాలు, మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నుంచి దిగుమతులు ఉంటాయి. అలాగే ఏపీలోని కర్నూలు నుంచి కూడా ఉల్లి సరఫరా అవుతుంది. అయితే ఈ ఏడాది మహారాష్ట్ర, కర్ణాటకల్లో కురిసిన కుండపోత వర్షాలతో ఉల్లి సాగుకు భారీ నష్టం వాటిల్లింది. కానీ కర్నూలు రైతులు విపరీతంగా సాగు చేయడంతో దిగుబడులు పెరిగాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఉల్లి వ్యాపారులు నిల్వలు పెంచడంలేదు. మొత్తంగా దిగుబడులు పెంచిన కర్నూలు రైతులు ధరలు లేక డీలా పడ్డారు.



# రాజకీయ విలువలు లేని నేతలు !

రాజకీయమంటే పదవులు కావాలి. పదవి, హోదా ఉంటేనే ప్రజల గురించి మాట్లాడుతారు. ఎపిలో వైకాపానేత జగన్‌కు ఇది బాగా సరిపోతుంది. విపక్షనేత హోదా ఇస్తే తప్ప అసెంబ్లీకి రానని మొండికేశారు. చివరకు హైకోర్టు గడప తొక్కారు. ఐదేళ్లు సిఎంగా పనిచేసిన వ్యక్తికి నిబంధనలు తెలియకపోవడం, అసెంబ్లీకి రాకపోవడం సిగ్గుచేటు. తనకు విపక్ష పదవి కావాలని దేబురిస్తున్నారు. బయట ఉండి విమర్శలు చేస్తున్నారు. నిజానికి రాజకీయాల్లో రోజురోజుకూ విలువలు పడిపోతున్నాయి. సిద్ధాంతాలు పక్కకు పోయాయి. ఎదుటి పార్టీని ఎలా దిబ్బతీయాలా అన్నదే ఇప్పుడు అన్నిపార్టీల ప్రథమ లక్ష్యంగా మారింది. అధికారంలో ఉంటే అక్రమాలకు పాల్పడడం, ఆస్తులు సంపాదించుకోవడం, ఓడితే ఎదుటి పార్టీని విమర్శించడం అలవాటు చేసుకున్నారు. బిఆర్‌ఎస్, వైకాపాలు ఇదే కోవలో ఉన్నాయి. తమ పాలనలో జరిగిన అవినీతి వ్యవహారాలపై మాత్రం మాట్లాడడంలేదు. ఇకపోతే కొందరు నేతలు అధికారం ఉన్న పార్టీలో ఉండడం అలవాటు చేసుకున్నారు. ఎక్కడ అధికారం ఉంటే అక్కడ చేరిపోతున్నారు. విపక్ష పార్టీలు కూడా సమర్థంగా పనిచేయడం లేదు. అధికార పార్టీని విమర్శించడం, ఐదేళ్ల తరవాత అదృష్టం ఉంటే మళ్లీ మనదే అధికారం అన్న ధోరణిలో రాజకీయాలు నెరపుతున్నాయి. ప్రజల సమస్యలను గాలికి వదిలేసి.. పరస్పర విమర్శలతో పబ్బం గడుపుకునే పరిస్థితిలో రాజకీయ పార్టీలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు అదే పరిస్థితి ఉంది. అనేక విషయాల్లో జగన్ అధికార టిడిపిపై విమర్శలు చేస్తే సరిపోతుందని ఎదురుదాడికి దిగుతున్నారు. తన హయాంలో జరగిన పాపాలపై జగన్ ఏనాడూ విచారణ కోరుకోవడం లేదు. అందుకే రాజకీయాల్లో విలువలు లేవనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. ఇకపోతే తెలంగాణలో పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించి, భ్రష్టు పట్టించిన బిఆర్‌ఎస్, ఎపిలో ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో దివాళా తీయించిన జగన్ ఇప్పుడు ఒకే తరహా రాజకీయాలు చేస్తున్నారు. ఈ రెండు పార్టీల నేతలు తమ తప్పులను, అప్పులను కప్పి పుచ్చుకోవడానికి ఇప్పుడున్న ప్రభుత్వాలపై విరుచుకు పడుతున్నారు. ప్రాంతీయ పార్టీలు, సిద్ధాంత భావజాలాన్ని కలిగి ఉండడం లేదు. తమ రాజకీయ అవసరాన్ని ప్రజల అవసరంగా చిత్రీకరించి కొందరు పార్టీలు మారుతున్నారు. దీనికి ఎవరూ మినహా యింపు కాదు. అందుకే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ పెరుగుతోంది. సుప్రీం తీర్పు ఇచ్చి సూచనలు చేశాక, తామంతా బిఆర్‌ఎస్‌లోనే ఉన్నామని పార్టీమారిన పదిమంది ఎమ్మెల్యేలు బుకాయిస్తున్నారు. ఎంతటి నేతలైనా అధికారపార్టీలో చేరడానికి వెరవడం లేదు. రాజకీయనిబద్దత పక్కకుపెడుతున్నారు. అధికారపార్టీ అయితే తమ పబ్బం గడుపుకోవచ్చు. అందులో చేరడానికి సవాలక్ష కారణాలు చూపాల్సిన అసవరం లేదు. రాజకీయాల్లో విలువలు లేవని, వ్యక్తులకు పార్టీల పట్ట విశ్వాసం కన్నా పదవులపైనే మోహం ఉందనడానికి తాజా రాజకీయాలే ఉదాహరణ. ఇలా ఇప్పుడు ఇరు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు ఆసక్తికరంగా ఉన్నాయి. ఇకపోతే మోడీ పనితీరు నచ్చిందని, దేశానికి ఆయనే ఆశాజ్యోతి అని బిజెపి పార్టీలో చేరేముందు కొందరు ప్రవచానాలు వల్లిస్తున్నారు. గతంలో తెలంగానలో పలువురు బఆర్‌ఎస్‌లో చేరగా దానిని బిఆర్‌ఎస్ గర్వంగా చాటుకుంది. కానీ ఇప్పుడు తమ ఎమ్మెల్యేలు పార్టీని వీడేసరికి గగ్గోలు పెడుతోంది. ఇలా చేయడంలో కేవలం స్వార్థ రాజకీయాలు తప్ప మరోటి కాదు. ఏ పార్టీ అధికారంలో ఉంటే అక్కడ పదవులు అనుభవించి, పార్టీ అధినేత అడుగలకు మడుగులొత్తిన వారు అధికారం కోల్పోగానే అధికారంలో ఉన్న పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారు.అనేక పదవులు అనుభవించి, రాజకీయం గా ఎదుగుదలకు కారణం అయిన పార్టీని, దాని అధినేతలను తిట్టాల్సినన్ని తిట్లు తిట్టి మరీ పార్టీలు మారుతున్నారు. ఇదంతా రాజకీయంగా తమ అవసరం కోసమే అన్నది వేరుగా చెప్పాల్సిన పనిలేదు. రాజకీయ ఉనికి కోసం అనేక కారణాలు చూపుతున్నారు. అధికారంలో ఉన్నవారు రాజకీయ ఎత్తులు వేస్తూ వీరిని అక్కున చేర్చుకుంటున్నారు. పార్టీ మారదల్చు కుంటే మారాలి. అంతేగానీ వీడుతున్న పార్టీపై విమర్శలు చేస్తే ప్రజలు నమ్మరని నేతలు గుర్తించాలి. రాజకీయ అవసరార్థం ఎప్పుడు ఏదైనా మాట్లాడే అలవాటు మన రాజకీయ నేతలకు ఉంది. చాలామంది ప్రాంతీయ పార్టీల నాయకులు, ముఖ్యమంత్రులు అవకాశం వస్తే ఢిల్లీ గద్దెను ఎక్కాలనే కుతూహలంతో ఉన్నవారు అనేకులు ఉన్నారు. ఏ పార్టీకి కూడా సిద్ధాంతం లేదన్నది తాజా పరిణామాలను బట్టి గమనించాలి. అధికారమే అన్ని పార్టీల సిద్ధాంతం. అధికారం ఉంటేనే నేతలు పార్టీని అంటిపెట్టుకుని ఉంటారు. లేకుంటే అధికారం ఉన్న పార్టీలోకి జంప్ అవుతారు. ఇందుకు ఎవరు కూడా మినహాయింపు కాదు. రాష్ట్రం ఏదైనా, పార్టీ ఏదైనా అధికారం ఉంటే అదే తమ పార్టీ అన్న ధోరణిలో నేతలు ఉన్నారు. ఇది రాజకీయ పార్టీల పతనానికి దారితీస్తోంది. ప్రజల సమస్యలపై పోరాడే అవకాశం లేకుండా చేస్తోంది. రాజకీయనేతలు నిబద్ధత కోల్పోతే ఎక్కువ కాలం నేతలుగా మనలేమని గుర్తిస్తే మంచిది. తెలంగాణలో ఓ పదిమంది విపక్ష బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వీరిపై చర్యలు తీసుకోవాలని బిఆర్‌ఎస్ కోర్టుల చుట్టూ తిరుగుతోంది.

చివరకు సుప్రీంకోర్టు బాల్‌ను స్పీకర్ కోర్టులో వేసింది. పార్టీ వీడిని వారికి స్పీకర్ నోటీసులు ఇచ్చి, విచారణ చేశారు. తామంతా బిఆర్‌ఎస్‌లోనే ఉన్నామని అంటున్నారు. ఇక ఎపిలోనూ జగన్‌కు వీరవవిధేయులుగా ఉన్నవారు సైతం పార్టీని వీడుతు న్నారు. అధికారం పోవడంతో అధికార టిడిపి, జనసేనల్లో చేరుతున్నారు. వీరు కూడా సిద్ధాంతాలు, గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రధానంగా తెరమీదకు తీసుకుని వస్తున్నారు. నిజానికి ఫిరాయింపుల చట్టం పకడ్బందీగా లేకపోవడం, దానిని అమలు చేయాలన్న చిత్తశుద్ధి పాలకుల్లో లేకపోవడం వల్ల ఇష్టం వచ్చినట్లుగా పార్టీ ఫిరాయింపులు సాగుతున్నాయి. ఇందుకు అన్ని పార్టీలది ఒకటే సిద్ధాంతం. దీనికి ఎక్కడో ఒకచోట తెరపడాలి. పార్టీ ఫిరాయింపులు, అవకాశవాద రాజకీయాలపై ప్రజలు నిలదీయడం అలవాటు చేసుకోవాలి.

# డిజిటల్ బుక్ లో వైసీపీపైనే ఫిర్యాదులు




**గుంటూరు, జనవరి, 23 :** తెలుగుదేశం పార్టీ తమ నేతలు, కార్యకర్తలపై జరిగిన దాడులను ఎదుర్కొనేందుకు రెడ్ బుక్ తీసుకొచ్చింది. అందులో అన్నీ రాసుకుని వడ్డీతో సహా బాకీ తీర్చేస్తామని మంత్రి నారా లోకేష్ గత ఎన్నికల సమయంలో పలుమార్లు చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇటీవల వైసీపీ డిజిటల్ బుక్ యాప్ తీసుకొచ్చింది. వైసీపీ నేతలు, కార్యకర్తలు, మద్దతుదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, వేధింపులను ఇందులో నమోదు చేయాలని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల వైసీపీ డిజిటల్ బుక్ యాప్ లాంచ్ చేయడం తెలిసిందే. ఏపీ మాజీ మంత్రి విడదల రజనీకి వైసీపీ డిజిటల్ బుక్‌లో షాక్ తగిలింది. చిలకలూరిపేటలోని నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం ఆదివారం నాడు వైసీపీ డిజిటల్ బుక్ యాప్ ద్వారా విడదల రజినిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రావు సుబ్రహ్మణ్యం మీడియాతో మాట్లాడుతూ, '2022 లో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని నవతరం పార్టీ ఆఫీసుతో పాటు, నా ఇల్లు, కారుపై మాజీ మంత్రి విడదల రజినీ దాడి చేయిం చారు. ఈ ఘటనపై తగిన చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయాల ని వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డికి వైసీపీ డిజిటల్ బుక్ యాప్ ద్వారా ఫిర్యాదు చేశానని' వివరించారు. డిజిటల్ బుక్ యాప్ ద్వారా ఫిర్యాదు అనంతరం వచ్చిన టికెట్‌ను చూపించారు. తనకు కనుక జగన్ న్యాయం చేస్తే.. వైసీపీ నేతలు, కార్యకర్తలకు ఈ డిజిటల్ బుక్ యాప్ ద్వారా న్యాయం అందుతుందని నమ్మకం కలుగుతుందన్నారు రావు సుబ్రహ్మణ్యం. ఇందులో ఫిర్యాదు చేస్తే న్యాయం జరుగుతుందని అందరికీ దీనిపై నమ్మకం కలుగుతుందని నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం వ్యాఖ్యానించారు. వాస్తవానికి మాజీ మంత్రి విడదల రజిని చిలకలూరిపేటలోని తన ఇంటి వద్ద, వైసీపీ నాయకులు, శ్రేణులతో కలిసి వైసీపీ డిజిటల్ బుక్ యాప్‌ను ఆవిష్కరించడం తెలిసిందే. ఇప్పుడు ఆమె మీద నియోజకవర్గం నుంచి ఫిర్యాదు రావడంతో వైసీపీ శ్రేణులు కంగుతిన్నాయి. దీనిపై వైసీపీ అధిష్టానం ఏం చర్యలు తీసుకుంటుందా అనేది ఉత్కంఠ రేపుతోంది. ఈ సందర్భంగా విడదల రజిని మాట్లాడుతూ.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలు ఎదుర్కొంటున్న అన్యాయం, వేధింపులు, కక్షలు, తప్పుడు కేసులు వీటికి ఒక సమాధానం, సాక్ష్యం కావాలి అని పార్టీ అధినేత వైఎస్ జగన్ జూఖీఅఖ డిజిటల్ బుక్ ప్రారంభించారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో వైసీపీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న అన్యాయాలకు సమాధానం ఈ డిజిటల్ బుక్ ద్వారా దొరుకుతుందన్నారు. ఈ డిజిటల్ బుక్ వైసీపీ కార్యకర్తలకి జగనన్న ఇస్తున్న భరోసా, అభయం అని పేర్కొన్నారు.

## డీసీపీ రాహుల్ హెగ్డే నకిలీ ఫేస్ బుక్ అకౌంట్ కలకలం..?

**జూబ్లీహిల్స్, జనవరి, 23 :** హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే తన పేరు మీద సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా నకిలీ ఫేస్ బుక్ అకౌంట్ ను సృష్టించి డబ్బులు వసూలు చేసేందుకు , ఇతర సైబర్ నేరాలకు పాల్పడేందుకు గుర్తించిన డీసీపీ రాహుల్ హెగ్డే స్పందించారు. ఈ సందర్భంగా రాహుల్ హెగ్డే మాట్లాడుతూ.. తన ఫోటో, పేరుతో నకిలీ ఫేస్ బుక్ ఐడి సృష్టించి ఆఫీసర్లు , సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే వారి ఖాతాలకు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపిస్తున్నారని ,వారు యాక్సెప్ట్ చేయగానే, డబ్బులు వసూలు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందన్నారు. తన ఒరిజినల్ ఫేస్ బుక్ అకౌంట్ ద్వారా అందరినీ అలర్ట్ చేశారు. తన పేరుతో ఎవరు డబ్బులు అడిగినా ఇవ్వవద్దని సూచించారు. వీలైనంత త్వరగా బ్లాక్ చేయమని కోరారు. దీనిపై కేసు నమోదు నమోదు చేసి సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

# పేర్ని నానికి నో ఆప్షన్..

**విజయవాడ, జనవరి, 23 :** మాజీ మంత్రి పేర్ని నాని విషయంలో జగన్ తిరిగి తన నిర్ణయం మార్చుకున్నారని తెలిసింది. గత ఎన్నికల్లో పేర్ని నాని ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో మళ్లీ పేర్నినాని పోటీ చేయాలని జగన్ ఆదేశించినట్లు తెలిసింది. గత ఎన్నికల్లో పేర్ని నానికి బదులు ఆయన కుమారుడు పేర్నిసాయి కృష్ణమూర్తి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తిరిగి 2029 ఎన్నికల్లో పేర్ని నానిని పోటీ చేయాలని ఇటీవల పేర్నినానికి గట్టిగా జగన్ చెప్పినట్లు తెలిసింది. పేర్నినాని కొంత తటపటాయించినా వచ్చే ఎన్నికలు కీలకమని, ఈసారి మాత్రం మీరే పోటీ చేయాలంటూ పేర్ని నానిని ఉద్దేశించి కొంత గట్టిగానే చెప్పినట్లు సమాచారం. దీంతో అందుకు పేర్ని నాని కూడా అంగీకరించినట్లు తెలిసింది. పేర్ని నాని తండ్రి పేర్ని కృష్ణమూర్తి కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉండేవారు. ఆయన తదనంతరం రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న పేర్ని నాని కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా మచిలీపట్నం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన



పేర్ని నాని విజయం సాధించారు. అనంతరం వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణానంతరం జగన్ పార్టీలో చేరారు. అప్పటి నుంచి జగన్ వెంటే ఉన్నారు. పేర్ని నాని 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర చేతిలో వైసీపీ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2019 ఎన్నికల్లో తిరిగి పేర్ని నాని వైసీపీ నుంచి గెలిచారు. కొల్లు రవీంద్రను ఓడించారు. తర్వాత పేర్ని నాని జగన్ మంత్రివర్గంలో సినిమాటోగ్రఫీ మంత్రిగా పనిచేశారు పేర్నినాని మంచి వాగ్దాటి ఉన్న నేతగా పార్టీలో పేరుపొందారు. కాపు సామాజికవర్గానికి చెందిన పేర్ని నాని తన తండ్రి రాజకీయ వారసత్వాన్ని కొనసాగించడానికి రాజకీయాల్లోకి వచ్చారంటారు. ఆయన తన మాటలతో 2024లో తన కుమారుడు మచిలీపట్నంలో ఓటమి పాలయిన తర్వాత రాష్ట్రంలోనూ వైసీపీ అధికారం కోల్పోయిన పిదప పార్టీకి మౌత్ పీస్‌గా తయారయ్యారు. అంశం ఏదైనా పేర్ని నాని మాట్లాడే మాటల్లో ఖచ్చితత్వం ఉంటుందని అంటారు.

ఆయన తన వాగ్దాటితో అధికార పక్షంపై విరుచుకుపడతారు. ప్రధానంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ పైనా, చంద్రబాబుపైనా విమర్శలు చేస్తూ పార్టీ క్యాడర్ లో పేరు తెచ్చుకున్నారు. అందుకే జగన్ వచ్చే ఎన్నికల్లో తనకు అండగా ఉండేదుకు పోటీ చేయాల్సిందేనని ఖచ్చితంగా చెప్పడంతో పేర్ని నాని కూడా అందుకు అంగీకరించినట్లు చెబుతున్నారు. సో.. వచ్చే ఎన్నికల్లో పేర్ని నాని పోటీ చేయడం కోసమే యాక్టివ్ అయ్యారని చెబుతున్నారు.

## ఉపాధ్యాయుడి కోసం గ్రామస్తుల నిరసన

**ఏన్కూర్,తెలంగాణ దిశ:** ఉపాధ్యాయుడి కోసం గ్రామస్తులు నిరసనకు దిగారు. తిమ్మరావుపేట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న చంద్రశేఖర్ అనే ఉపాధ్యాయుడుని డిప్యూటేషన్ పై కొత్త మేడేపల్లికి బదిలీ అయ్యారు. అయితే ఈ డిప్యూటేషన్ ను నిరసిస్తూ గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం పాఠశాల ఎదురుగా నిరసన వ్యక్తంచేశారు. సుమారు 60 మంది పిల్లలు ఉన్న ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా ఒక ఉపాధ్యాయున్ని డిప్యూటేషన్ పద్ధతిపై బదిలీ చేయడాన్ని నిరసిస్తున్నామని గ్రామస్థులు తెలిపారు. చంద్రశేఖర్ వల్ల పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిందని గుర్తు చేశారు. తక్షణమే డిప్యూటేషన్ పై వెళ్లిన చంద్రశేఖర్ ను తిరిగి రప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై ఎంఈఓ వాసవి దేవి చర్యలు తీసుకుంటారా లేదా అనేది తెలియాల్సి ఉంది.

# మళ్లీ తెరపైకి విశాఖ స్టీల్ ప్లాంట్



**విశాఖపట్టణం, జనవరి, 23 :**విశాఖ స్టీల్ ప్లాంట్ వ్యవహారం మరోసారి హాట్ టాపిక్ అవుతోంది. పనిచేస్తున్న ఉద్యోగుల విషయంలో టార్గెట్లు ఇచ్చింది యాజమాన్యం. చెప్పిన పనికి, ఆదేశించిన లక్ష్యానికి మేరకు జీతాల చెల్లింపు ఉంటుందని తేల్చి చెప్పింది. ఒక విధంగా చెప్పాలం టే ప్రైవేట్ సంస్థల ఫార్ములాను తెరపైకి తెచ్చింది. దీనిపై స్టీల్ ప్లాంట్ ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. ఇది ప్రైవేటీకరణకు ఉద్దేశించిన నిర్ణయమని తప్పుపడుతున్నాయి. అయితే అందులో తప్పేముందని.. ఉత్పత్తి పెరగాలంటే ప్రతి ఉద్యోగి పని చేయాల్సి ఉంటుందని తేల్చి చెప్పినట్లు అయింది. ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబు స్టీల్ ప్లాంట్ ఉద్యోగులపై అసహనం వ్యక్తం చేసినట్లు ప్రచా రం నడిచింది. ఇప్పుడు ఉత్పత్తి పెంపునకు సంబంధించి లక్ష్యాలు విధించడం సైతం అనుమా నాలకు తావిస్తోంది. అయితే ఇది కంపెనీ వృద్ధి కోసమేనని.. స్టీల్ ప్లాంట్ ఉన్న పరిస్థితిని అధిగమించేందుకేనని విశ్లేషణలు వస్తున్నాయి. అయితే ఇప్పటివరకు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో అనేక ప్రయోగాలు చేసింది యాజమాన్యం. అయితే ఉత్పత్తి పెరగకపోవడానికి మానవ తప్పిదాలు ఉన్నాయని భావించి ఈ లక్ష్యాలను విధించినట్లు తెలుస్తోంది. ప్రపం చంలోనే విశాఖ స్టీల్ ప్లాంట్ చాలా గుర్తింపు ఉంది.. ఇక్కడ స్టీల్ నాణ్యమైనదిగా గుర్తించి ఎక్కువగా అమ్మకాలు జరుగుతుంటాయి. అమ్మకాలకు తగ్గట్టు ఇక్కడ ఉత్పత్తి జరగడం లేదు. కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసిన ఉత్పత్తి పెరగడం లేదు.

# ఆ నాలుగు ప్రాంతాలకు మహర్ధశ

**నిజామాబాద్, జనవరి, 23 :** తెలంగాణలో రోడ్లకు మహర్ధశ పట్టనుంది. తెలంగాణలో ఈ ఆర్థిక సంవత్సరానికిగాను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చేపట్టాల్సిన 4 జాతీయ రహదారులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తాజాగా ఆర్మూర్- జగిత్యాల, జగిత్యాల-కరీంనగర్, జగిత్యాల- మంచిర్యాల జాతీయ రహదారులకు సంబంధించి టెండర్లను ఆహ్వానించింది.

అంతకుముందు మహబూబ్‌నగర్-గూడెబల్లూర్ హైవేకి సంబంధించిన టెండర్లను గత నెలలోనే ఆహ్వానించింది. ఈ నాలుగు రహదారులను ఎన్‌హెచ్ఏఐ మొత్తం 271 కి.మీ. మేర రూ. 10,034 కోట్లతో నిర్మించనుందని సమాచారం.

రోడ్ల నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ముగిసిన అనంతరం, జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఈ పనులు ప్రారంభించేలా ఎన్‌హెచ్ఏఐ చర్యలు చేపట్టనుంది. ఇందులో జగిత్యాల- మంచిర్యాల హైవేని ఈపీసీ (ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో నిర్మించనున్నారు. మిగతా మూడింటిని హ్యామ్ విధానంలో వేయనున్నారు. ఈ నాలుగు రహదారులకు పర్యావరణ, అటవీ, రైల్వే అనుమతులు పూర్తయ్యాయి. త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తే వెంటనే పనులు మొదలవుతాయి.

జాతీయ రహదారుల వివరాలు..: మహబూబ్‌నగర్- గూడెబల్లూర్ జాతీయ రహదారి: 80 కి.మీ. మేర రూ. 2,662 కోట్లతో జాతీయ రహదారిని నిర్మించనున్నారు. దీని కోసం 465.7 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంది. ఆర్మూర్- జగిత్యాల జాతీయ రహదారి: 64 కి.మీ. మేర రూ. 2,338 కోట్లతో నిర్మించనున్నారు. ఇందుకు 288.3 హెక్టార్ల భూమి సేకరించనున్నారు. జగిత్యాల- కరీంనగర్: 59 కి.మీ. నేషనల్ హైవేను రూ. 2,484 కోట్లతో నిర్మిస్తారు. ఇందుకు 306.7 హెక్టార్ల భూసేకరణ చేయాలి.

## కూపన్‌లు, లక్కీ డ్రాలతో నయా దందా..?

**సిరిసిల్ల, జనవరి, 23 :**వేములవాడ పోలీసు సబ్ డివిజన్‌లో దసరా ధమాక పేరుతో 'రూ.100 కొట్టు మేకను పట్టు' అంటూ జిల్లా ప్రజలకు బంపర్ ఆఫర్ స్కీంను రూపొందించామని ప్రచారం చేసుకున్నారు. మరొకరు రూ.100లతో ఒక కూపన్ కొంటే మద్యం, కోడి, మేకలను లక్కీ డ్రాలో గెలుచుకోవచ్చంటూ పథకాన్ని తీసుకొచ్చారు. వీటిని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని వ్యాపార కేంద్రాల్లో విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. నెల రోజుల క్రితం వేములవాడ పట్టణంలో వాహన, గృహోపకరణాల కొనుగోలుకు నెల వారీ వాయిదాలతో భాగస్వాములు కావాలని బ్రోచర్ ద్వారా ప్రచారం చేశారు. చేరిన వారికి ఏడాదిలో లక్కీ డ్రా తీసి వారి పేరు తగిలితే నగదు, పలు రకాల వస్తువులు అందిస్తామని అందులో పేర్కొన్నారు. ఇలాంటి ప్రచారాలు ఎక్కువ కావడంతో పోలీసులు దృష్టి సారించారు. వేములవాడ పోలీసు సబ్ డివిజన్‌లో కొడుముంజ, వేములవాడ పట్టణాల్లో స్కీంలు, లక్కీ డ్రాల ప్రచారంతో మోసాలకు పాల్పడుతున్న పది మందిపై బుధవారం కేసులు నమోదు చేశారు. జిల్లాలో మూడేళ్ల క్రితం ఒక సంస్థ ఒకేసారి రూ.30 వేలు చెల్లిస్తే ఆరు నెలల తర్వాత నుంచి రూ.10 వేల చొప్పున మొత్తం లక్ష రూపాయలు మీ సొంతం చేసుకోవచ్చని భారీగా డబ్బులు వసూలు చేసింది. గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలా ల్లోని చాలా గ్రామాల్లో చాప కింద నీరులా వ్యాపించింది. డబ్బులు చెల్లించే సమయానికి రేపుమాపు అంటూ కాలం వెళ్లదీశారు. చివరికి తాము మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. వారిపై కేసులు నమోదైనా కట్టిన డబ్బులు మాత్రం రాలేదు. రూ.5 లక్షలకు రెండు పడక గదుల ఇల్లు నిర్మించి ఇస్తామని ఓ స్వచ్ఛంద సంస్థ గ్రామాల్లో ప్రచారం చేసింది. ముస్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద మొత్తంలోడబ్బులు వసూలు చేశారు. వీరి మాటలు నమ్మి చాలా మంది డబ్బులు కట్టారు. కొన్ని చోట్ల నిర్మాణాలు కూడా ప్రారంభించారు. దీంతో కొందరైతే పాత ఇళ్లను కూల్చివేసుకుని కొత్త ఇంటి నిర్మాణానికి సిద్ధమయ్యారు.

# భారత్‌కు తలనొప్పిగా బంగ్లా పరిణామాలు !

ఏదేశాన్ని తిన్నగా బతకనీయకుండా ఆటలాడడం అమెరికాకు అలవాటుగా మారింది. అన్ని దేశాలపైనా ఆంక్షలు విధించడం, మోయలేని సుంకాలు విధించడం, బెదిరించడం పరిపాటిగా మారింది. తాజాగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే, 500 శాతం పన్నులు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిం చారు. ప్రపంచ దేశాలన్నీ తన కనుసన్నల్లో ఉండాలన్న కోరిక అమెరికాలో బలంగా నాటుకుంటోంది. అందుకు అవసరమైన అన్ని కుయుక్తులు పన్నుతోంది. ఒక్కో దేశంలో వేలుపెడుతూ వాటిని కంట్రోల్ చేస్తోంది. ఇజ్రాయిల్‌ను అడ్డం పెట్టుకుని పాలస్తీనాపై దాడికి తెగించింది. ఇరాన్, ఖతార్‌లపైనా విరుచుకు పడింది. అలాంటి అవకాశం లేని చోట్ల రాజకీయంగా వేలుపెట్టి అక్కడున్న పాలకులను మార్చేస్తోంది. ఒక్క భారత్‌లోనే అది సాధ్యం కావడం లేదు. చైనాలో అస్సలు సాధ్యం కాదు. భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం కావడం, విభిన్న మతాలు, కులాల సమాహారం కావడంతో ఇక్కడ దాని పప్పులు ఉడకలేదు. ఇక్కడా రకరకాల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇటీవలి వరుస ఆందోళనలు చూస్తుంటే సిఐఎ బాగా పని చేస్తోందన్న విమర్శలు ఉన్నాయి. మన పక్కనే ఉన్న బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వాన్ని గద్దె దించడంలో పరోక్షంగా అమెరికా పాత్ర ఉంది. అలాగే పాక్‌ను మరోమారు దువ్వుతున్నారు. నేపాల్‌లో గొడవలు సృష్టించారు. భారత్‌ను దెబ్బతీసేందుకు చుట్టుపక్కల దేశాల్లో అలజడులు సృష్టిస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై ఆంక్షలు విధించారు. వీసాల విషయంలో అనేక రకాల నిబంధలను పెట్టారు. బంగ్లాదేశ్‌నే తీసుకుంటే అక్కడా అలజడుల వెనక అమెరికా హస్తం ఉందని అంతర్జాతీయ నిపుణులు ఆరోపిస్తున్నారు. ఇతరదేశాల్లో వేలు పెట్టడం వల్ల తాము చాలా నష్టపోయామని అమెరికా ఇంటిలిజెన్స్ చీఫ్ తులసీగబ్బార్ ఆమధ్య అంగీకరించారు. అయినా వెనకటి గుణమేల మారు అన్న చందంగా అమెరికా పరిస్థితి ఉంది. బంగాదేశ్‌లనే తీసుకుంటే అక్కడ హసీనాను గద్దె దించడం, యూనస్‌ను గద్దెనెక్కిం చడం చకచకా జరిగి పోయాయి. ఇప్పుడు హసీనాకు ఉరిశిక్షను కూడా విధించారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం రసాయన ఆయుధాల పేరుతో ఇరాక్‌పై దాడిచేసి అక్కడ సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని అమెరికా గద్దె దింపింది. అలాగే సద్దాంను విచారణ పేరుతో బంధించి ఉరితీసే వరకు నిద్రపోలేదు. సరిగ్గా ఇప్పుడు బంగ్లాదేశ్‌లో జరుగుతున్న తీరు కూడా ఇరాక్‌ను పోలివుంది. హసీనా భారత్‌కు అనుకూలంగా ఉండడాన్ని అమెరికా జీర్ణించుకోవడం లేదని అర్థం అవుతోంది. అందుకే ఆమెను పదవీచ్యుతురాలిని చేశాక భారత్‌లో ఆశ్రయం పొందారు. ఇప్పుడు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మరణశిక్షకు అర్హురాలని అక్కడి ట్రిబ్యునల్ నిర్ణయించింది. ముగ్గురు సభ్యుల ఈ ట్రిబ్యునల్ హసీనా ఎన్నో దుర్మార్గాలకు పాల్పడిందని ఏకరువు పెట్టింది. తనకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్న వారిని కాల్చిపారేయమని ఆమె ఆదేశించారని, డ్రోన్లు, హెలికాప్టర్లు ఉపయోగించి మరీ నిరసనకారులపై మారణాయుధాలతో విరుచుకుపడమని భద్రతాబలగాలను ఒత్తిడిచేశారని న్యాయమూర్తులు తేల్చారు. అధికారంలో కొనసాగడానికి అత్యంత అమానుషంగా ప్రవర్తించా రంటూ, తీవ్రంగా గాయపడిన నిరసనకారులను సకాలంలో ఆస్పత్రికి తరలించడానికి కూడా భద్రతాదళాలు నిరాకరించాయని న్యాయమూర్తులు ప్రకటించారు. తీర్పు ఇవ్వడంలో జాప్యం జరిగినందుకు క్షమించమని కూడా ఒక న్యాయమూర్తి అన్నారు. తీర్పు వెలువడగానే, యూనిస్ ప్రభుత్వం హసీనాను తమకు అప్పగించమని డిమాండ్ చేయడం చూస్తూనే ఉన్నాం. ట్రిబ్యునల్ తీర్పు ఎలా రాబోతున్నదో ఊహకు అందనిదేమీ కాదు. సరిగ్గా యాభైయేళ్ళక్రితం జరిగిన సైనిక కుట్రలో తండ్రి, తల్లి, ముగ్గురు సోదరులను కోల్పోయి, ఆరేళ్ళపాటు భారత్‌లో ఇందిర నీడన తలదాచుకొని, తిరిగి స్వదేశంలో కాలూని అధికారాన్ని చేజిక్కించుకున్న హసీనా గతం ఇప్పుడు అందరికీ గుర్తుకువస్తోంది. జియావుర్ రహ్మాన్ భార్య ఖలీదాజియామీద అలుపెరగని, సాహసోపేత పోరాటాలు చేశారు. ఇద్దరు బేగంల మధ్య సాగిన ఆధిపత్య పోరాటంలో ముజబూర్ రహ్మాన్ కుమార్తె పైచేయి సాధించారు. ఖలీదా సహా బీఎన్పీ అధినాయకుల నిర్బంధాలు, ఆ పార్టీకి అండగా ఉన్న జమాతే వంటే ఇస్లామిక్ ఛాందసశక్తులను అధికారికంగానూ, అనధికారికగానూ హసీనా చీల్చిచెండాడారు. హసీనా పాలనలో బంగ్లాదేశ్ వేగంగా వృద్ధిచెందింది. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్తయ్యాయి, పేదరిక నిర్మూలనలోనూ మంచిపేరు తెచ్చుకుంది. తనకు వ్యతిరేకంగా సాగిన విద్యార్థి ఉద్యమంపట్ల హసీనా నిర్దయగా వ్యవహరించారన్నదీ వాస్తవమే. ఆ తరువాత ఆమె దిగివచ్చినా, అప్పటికే పరిస్థితి చేజారింది. రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం తన లక్ష్యాన్ని సాధించు కున్న తరువాత నిజానికి చల్లారినా, స్వల్పకాలంలోనే తిరిగి రాజుకోవడం వెనుక జమాత్ ఇస్లామీ, బీఎన్పీ ఉండటంతో ఆమె కఠినంగా వ్యవహరించాల్సి వచ్చిందని అంటారు. పాకిస్థాన్ ఒత్తిడి కారణంగా అమెరికా, దాని మిత్రదేశాలు కొన్ని ఆమెకు పూర్తి వ్యతిరేకంగా వ్యహరించాయి. ఆమె ఢిల్లీ పారిపోయి వచ్చిన తరువాత, బంగ్లాదేశ్‌లో అప్పటినుంచి ఇప్పటివరకూ సాగిన పరిణామాలన్నీ ఆమె పట్ల ఏయే శక్తులు ఏ లక్ష్యాల సాధనకోసం కత్తికట్టాయో తెలియచెబుతాయి. గృహనిర్బంధంలో ఉన్న ఖలీదా విదేశీ చికిత్సతో ఎన్నికలకు సిద్ధపడటం, వేలాదిమంది జమాత్ యోధులు జైళ్ళ నుంచి బయటకు రావడం, ముజబూర్ రహ్మాన్ విగ్రహాలను మాత్రమే కాదు, ఆయన ఆధ్వర్యంలో సాగిన విముక్తి పోరాటాన్ని సైతం చరిత్ర నుంచి చెరిపేసి, అప్పట్లో ఊచకోతకోసిన పాకిస్థాన్‌ను ఘనంగా ఊరేగించడం చూస్తూనే ఉన్నాం. ఓ రకంగా పాకిస్థాన్ ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిది. ఇలా భారత్‌కు వ్యతిరేకంగా పాక్‌ను, బంగ్లాదేశ్‌ను ఎగదోయడం వెనక ఎవరున్నారన్నది వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఇప్పటికే పలుమార్లు ఆమె అప్పగిం చాలని యూనిస్ ప్రభుత్వం కోరుతూ వచ్చింది. ఇప్పుడు ఉరిశిక్ష విధించారు. కనుక భారత్ మీద ఒత్తిడి పెంచేందుకు ఇప్పుడు మరో ఆయుధం చేతికి అందివచ్చింది. ఇదంతా పెద్దన్న ఆడిస్తున్న నాటకమని తెలుసుకోవడానికి పెద్దగా తెలివి తేటలు అక్కర్లేదు.

Edited,Printed,Published and Owned by PALLA KONDALA RAO, H.No:5-13/1,Allapadu Road,Bonakal(Village,Post & Mandal),Khammam District-507204, Telangana State.
Printed at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah nagar, Gurralapadu (V), Tallampadu (Post), Khammam(Rural) Mandal, Khammam District, Pin-507170, Telangana State.
Published at H.No:11-3-17/1, Beside Ankura Hospital,Balaji Nagar, Khammam-507002, Telangana State, EDITOR : PALLA KONDALA RAO RNI. No. TELTEL/2017/74161